ప్రతిపక్షం

www.prathipaksham.in

మంగళవారం 03.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 314 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

'ఐసీసీ నిబంధనలు పాటిస్తాం': బీసీసీఐ 10

త్యాగమే జాతిపిత గాంధీజీ లక్షణం

అలాంటి త్యాగమూర్తితో తమను తాము పోల్చుకుంటూ

తెలంగాణ జాతిపిత అని చెప్పకోవడం హాస్యాస్పదం

> పోలీసులు చట్టబద్ధంగా నోటీసులు ఇస్తే, జాతిపితకు నోటీసులు ఇస్తారా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "గాంధీజీ ప్రాణాలే త్యాగం చేశారు. మరి ఇప్పుడు జాతిపిత అంటూ చెప్పకునే వారు తెలంగాణ కోసం ఏం త్యాగం చేశారు?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమాన్ని ఏకం చేసి నడిపించిన ప్రొఫెసర్ కోదండరాం ఉద్యమకారుడు కాదా? అని ప్రశ్నించిన సీఎం, "మీ పాలనలోనే ఆయన ఇంటి తలుపులు బద్దలు కొట్టి అరెస్టు చేశారు. అప్పడు ఉద్యమకారుల విలువ గుర్తుకురాలేదా?" అంటూ బీఆర్ఎస్ పై నిప్పులు చెరిగారు. "మిమ్మల్ని మాత్రం తలుపులు పగలగొట్టి తీసుకురాలేదు. నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారు. ఇందులో అన్యాయం ఎక్కడుంది?" అని బీఆర్ఎస్ పై నిప్పులు చెరిగారు.

- పోలీసుల నోటీసులకే రోదన ఎందుకు?
- కోదండరాంను అరెస్ట్ చేస్తే ఉద్యమాకారులు గుర్తుకు రాలేదా?
- ఆయనను తలుపులు బద్దలు కొట్టి అరెస్ట్ చేయలేదా?
- ఇప్పుడు నోటీసులు ఇస్తేనే ఇంత గగ్గోలు ఎందుకు?
- కేసీఆర్, బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ రెడ్డి మండిపాటు
- త్యాగానికి ప్రతిరూపం రావి నారాయణరెడ్డి
- జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి రావి నారాయణరెడ్డి జాతీయ పురస్కారం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 2: జాతిపిత మహాత్మాగాంధీ పదవులను త్యాగం చేసి, దుర్మార్గుల తూటాలకు ప్రాణాలు అర్పించారని, అలాంటి త్యాగమూర్తితో తమను తాము పోల్చుకుంటూ 'తెలంగాణ జాతిపిత' అని కొందరు చెప్పుకోవడం హాస్యాస్పదమని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన 'రావి నారాయణరెడ్డి జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం'లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. రావి నారాయణరెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. 'తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు' ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మవిభూషణ్ 'రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ పురస్కారం - 2025'ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి గారికి అందజేశారు. రావి నారాయణ రెడ్డి జాతీయ పురస్కారం జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి దక్కడం

...:: మిగతా 2లో

కాంగ్రెస్ పెట్టుబడులన్నీ

కట్టుకథలే

ఫేక్ ఎంవోయూలను యువత ఎక్స్‌పోజ్ చేయాలి

లక్షల కోట్ల ఎంవోయూల వెనుక మోసపు రాకెట్

- అగ్నిప్రమాదాలు, నేరాలపై సీఎం మౌనం
- లేబుల్ చూసి ఓటు వేయమంటే నియంతృత్వమే
- ఫోన్ ట్యాపింగ్ కేసులో చట్టాలకెవరూ అతీతులు కాదు
- "హ్యాష్‌ట్యాగ్ కాంగ్రెస్ ఫేక్ ఎంవోయూలు" పేరుతో తెలంగాణ యువత ఉద్యమం చేయాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 2: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటిస్తున్న పెట్టుబడులు, ఎంవోయూలన్నీ ఫేక్ అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తెలంగాణ జాగృతి కార్యాలయం, బంజారాహిల్స్‌లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో జాగృతి నేత కల్వకుంట్ల కవిత కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న పెట్టుబడులన్నీ కట్టుకథలేనని ఆరోపించారు. వేల కోట్ల రూపాయల ఎంవోయూలు చేసుకున్నట్లు ప్రకటిస్తున్న అనేక కంపెనీలకు కనీసం వెబ్‌సైట్ కూడా లేదని, తాను చేసిన పరిశోధనలో చాలా కంపెనీల గుట్టు బయటపడిందని చెప్పారు. ఈ ఫేక్ ఎంవోయూలను

...:: మిగతా 2లో

అజిత్ పవార్ మరణంపై అనుమానాలు

అజిత్ పవార్ మరణంపై అనుమానం వ్యక్తం చేశారు శివసేన ఉద్ధవ్ వర్గం నేత సంజయ్ రౌత్ . ఇరిగేషన్ కుంభకోణాన్ని బయటపెడుతానని బీజేపీని బెదిరించిన 10 రోజుల్లోనే ఆయన మరణించారని తీవ్ర ఆరోపణలు చేశారు.

9

షేక్ హసీనాకు పదేండ్ల జైలు శిక్ష

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు పదేళ్ల జైలు శిక్ష ఖరారు చేశారు. ఆమె మేనల్లుడు రద్వాన్ ముజిబ్ సిద్దిక్, మేనకోడళ్లు తులిప్ రిజ్వానా సిద్దిక్, అజ్మినా సిద్దిక్‌లకు కూడా రెండు వేర్వేరు అవినీతి కేసుల్లో శిక్ష పడింది.

9

లోక్‌సభలో గందరగోళం

- ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంపై వివాదం
- ఒక మ్యాగజైన్ కథనాన్ని ప్రస్తావించిన రాహుల్ గాంధీ
- ఆ పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదు: రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా
- అందులో ఏముంది? అంతగా భయపడున్నారు
- ఆ అంశాలను చదవడానికి అనుమతించాలి: రాహుల్‌గాంధీ

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: 2020లో భారత్‌చైనా మధ్య నెలకొన్న లద్దాఖ్ ప్రతిష్టంభనపై మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించి ఒక మ్యాగజైన్ ప్రచురించిన కథనాన్ని కాంగ్రెస్ ఎంపీ, విపక్షనేత రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రస్తావించారు. దీంతో సభలో గందరళగోళం ఏర్పడింది. రాహుల్ ప్రస్తావిస్తున్న పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, అమిత్ షా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ పుస్తకం ప్రచురితమైందా? లేదా? అనే విషయాన్ని స్పష్టం చేయాలని రాహుల్‌ను రాజ్ నాథ్ కోరారు. ఈ క్రమంలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ వేళ సభలో గందరగోళం ఏర్పడింది. చైనా సైన్యం భారత సరిహద్దుల్లోకి చొరబడుతోందని మాజీ ఆర్మీ చీఫ్ నరవణే తన పుస్తకంలో రాసుకొచ్చిన అంశాలను

...:: మిగతా 2లో

కలవరపరుస్తున్న రెబల్స్

పురపోరులో లెక్కకు మించి నామినేషన్లు

ఉపసంహరణకు నేడే చివరి గడువు

- రంగంలోకి కాంగ్రెస్ నేతలు, మంత్రులు
- బుజ్జగింపులు, నామినేటెడ్ పోస్టుల హామీ
- ఇదే అదునుగా ప్రత్యర్థి పార్టీల ఎత్తులు
- అధికార పార్టీకి సవాల్‌గా మారిన ఉపసంహరణలు

మాణిక్యప్రభు గుర్రంపల్లి

ప్రతిపక్షం, హైదరాబాద్, ఫిబ్రవరి 2: మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం ఉత్కంఠభరితంగా మారింది. ముందు ఇంటి పోరు గెలిచి, తర్వాత రచ్చ పోరు గెలవాల్సిన పరిస్థితి వచ్చింది. సొంత పార్టీ వారే లెక్కకు మించి నామినేషన్లు వేయడంతో, ప్రధాన పార్టీలకు వారిని బుజ్జగించడం సవాలుగా మారింది. పురపోరులో లెక్కకు మించి నామినేషన్లు, ఉపసంహరణకు నేడే చివరి గడువు కావడంతో కాంగ్రెస్‌రెబల్స్ ను బుజ్జగించేందుకు సీనియర్‌నేతలు, మంత్రులు రంగంలోకి దిగారు. దీన్ని పరిష్కరించేందుకు

...:: మిగతా 2లో

ఫాస్ట్‌ట్యాగ్ యూజర్లకు గుడ్ న్యూస్

ఫాస్ట్‌ట్యాగ్ విధానంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్ హెచ్ ఏఐ) కీలక సంస్కరణలు తీసుకొచ్చింది. ఫాస్ట్ ట్యాగ్ యాక్టివేషన్ సమయంలో వాహన వివరాలను ధృవీకరించే పూర్తి బాధ్యతను బ్యాంకులకే అప్పగించింది.

9

సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో ప్రజా సంబంధాల శాఖ పాత్ర కీలకం

- అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
- పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవాలి
- పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఆధునీకరించిన సమాచార శాఖ వెబ్‌సైట్ ప్రారంభించిన మంత్రి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 2: ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు సమర్ధవంతంగా చేరవేయడంలో ప్రజా సంబంధాల శాఖ పాత్ర అత్యంత కీలకం అని పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆధునీకరించిన సమాచార పౌరసంబంధాల శాఖ వెబ్‌సైట్‌ను సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఐపీఆర్ కమిషనర్ ప్రియాంక, ముఖ్యమంత్రి

...:: మిగతా 3లో

డీల్ కుదిరింది.. టారిఫ్ తగ్గింది

- భారత్-అమెరికా ట్రేడ్ డీల్
- టారిఫ్‌లు 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గింపు
- ప్రకటించిన ట్రంప్
- రష్యా చమురు కొనుగోలును ఇండియా నిలిపివేస్తుందని వెల్లడి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: చాలా కాలంగా అమెరికాతో పెండింగ్ లో ఉన్న ట్రేడ్ డీల్ పై కీలకమైన ముందడుగు పడింది. వాణిజ్య ఒప్పందానికి ఇరు దేశాలు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. సోమవారం రాత్రి తన సోషల్‌మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. భారత ప్రధాని మోదీతో ఫోన్ సంభాషణ తర్వాత ఒప్పందం ఖరారైనట్టు ట్రంప్ ప్రకటించారు. ఇందులో భాగంగా భారత్‌పై ప్రతీకార సుంకాలను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్టు తెలిపారు. అంతేగాకుండా రష్యా నుంచి చమురు కొనుగోలును భారత్ నిలిపివేస్తుందని చెప్పారు. అలాగే అమెరికాపై సుంకాలను సున్నాకు తగ్గించబోతున్నదని ప్రకటించారు. వాణిజ్య ఒప్పందానికి భారత్‌అమెరికా అంగీకరించాయని, దీంతో భారత్‌పై తాను

...:: మిగతా 3లో

కోర్టు తీర్పు ముందే 'ఇల్లీగల్' ఎలా?

- సిట్ చీఫ్‌పై హరీష్ రావు ఫైర్
- తీర్పులు చెప్పేది కోర్టులు.. పోలీసులు కాదు
- విచారణ నడుస్తుండగానే తుది నిర్ణయమా?
- ఫోన్ ట్యాపింగ్ కేసులో సజ్జనార్ ప్రకటనపై తీవ్ర అభ్యంతరం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 2: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కోర్టు తుది తీర్పు రాకముందే సిట్ చీఫ్ సజ్జనార్ అధికారికంగా "ఇల్లీగల్" అని ప్రకటించడం బాధ్యతారాహిత్యమని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. విచారణ కొనసాగుతున్న దశలోనే ఒక అంశాన్ని చట్టవిరుద్ధమని తేల్చడం

...:: మిగతా 3లో

పాకిస్తాన్ దళితులకు ఇండ్లు ఇవ్వాలి

పాకిస్తాన్ నుంచి వలస వచ్చి, ఇక్కడే ఉండిపోయిన హిందూ దళితులకు ప్రభుత్వం ఇండ్లు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది.

9

రాజకీయం

కలవరపరుస్తున్న రెబల్స్

మొదటిపేజీ తరువాయి

ఎక్కడికక్కడ సమన్వయ కమిటీలు ఏర్పాటు చేశారు. నామినేషన్ల ఉపసంహరణకు ఒకే రోజు సమయం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో పోటీకి దిగిన వారిని తమ దారిలోకి తెచ్చుకోవల్సిన అవసరం ఉంది. మరోవైపు టికెట్ దక్కక దిగులు పడుతున్న వారిని మచ్చిక చేసుకునేందుకు ప్రత్యర్థి పార్టీ ఎత్తులు వేస్తోంది. ఈ నెల 11న జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు మొత్తం 29,694 నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో కాంగ్రెస్ నుంచే 10,024 అంటే దాదాపు మూడో వంతు ఉన్నాయి.

బుజ్జగించేందుకు రంగంలోకి నేతలు, మంత్రులు

మొత్తం 2996 వార్డులకు ఎన్నికలు జరుగుతుండగా సగటున కాంగ్రెస్ నుంచి ఒక్కో వార్డుకు మూడుకు పైగా నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్ఎస్ తరఫున 7556 మంది, బీజేపీ నుంచి 5457 మంది నామినేషన్లు వేశారు. ఈ నేపథ్యంలో బరిలో రెబెల్ అభ్యర్థులు లేకుండా చూసేందుకు అన్ని పార్టీల నాయకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. సహజంగానే అధికార పార్టీ కాంగ్రెస్‌కు సవాల్‌గా మారింది. బుజ్జగించేందుకు రంగంలోకి పార్టీ సీనియర్ నేతలు, మంత్రులు దిగారు. పోటీ నుంచి తప్పుకుంటే నామినేటెడ్ పోస్టుల ఇస్తామంటూ మచ్చిక చేస్తున్నారు. అత్యధికంగా మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో 60 డివిజన్లకు 328 మంది కాంగ్రెస్ అభ్యర్థులు పోటీకి దిగారు. వీరిలో 268 మందిని ఉపసంహరించుకునేలా చేయాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు ప్రాతినిధ్యం వహించి ఉండటం, మహబూబ్‌నగర్ పట్టణంతో ఆయనకు మంచి అనుబంధం ఉండటంతో స్థానిక నాయకులు తమ ఉనికి చాటుకునేందుకే పోటీకి దిగారని తెలుస్తోంది.

సవాల్‌గా మారిన ఉపసంహరణలు

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సొంత జిల్లా అయిన నిజామాబాద్ కార్పొరేషన్‌లోని 60 డివిజన్లకు కాంగ్రెస్ నుంచి 319 మంది రంగంలోకి దిగారు. ఇక్కడ కూడా ఉపసంహరణలు సవాలుగా మారే పరిస్థితి ఉంది. ఇక్కడ ఛైర్మన్ ఎన్నికలో మజ్లిస్‌దే కీలకపాత్ర. ఉదాహరణకు గత ఎన్నికల్లో బీజేపీ 28 స్థానాలు గెలిచినా ఛైర్మన్ పదవి దక్కించుకోలేకపోయింది. కేవలం 13 స్థానాలు మాత్రమే పొందిన బీఆర్ఎస్, 15 స్థానాలు వచ్చిన మజ్లిస్‌తో కలిసి కార్పొరేషన్‌ను చేజిక్కించుకుంది. ఇప్పుడు మజ్లిస్ పార్టీ కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉండటంతో నిజామాబాద్ కార్పొరేషన్ దక్కించుకోవచ్చన్న ఆశావహ పరిస్థితులే ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేయడానికి కారణంగా భావిస్తున్నారు. బీజేపీ నుంచి కూడా ఇక్కడ 252 మంది నామినేషన్లు దాఖలు చేశారు. గత ఎన్నికల్లో అత్యధిక స్థానాలు దక్కించుకుంది. 66 డివిజన్లు ఉన్న కరీంనగర్ కార్పొరేషన్లో కాంగ్రెస్ తరఫున 308 మంది నామినేషన్లు వేశారు. బీజేపీ, బీఆర్ఎస్ నుంచి తీవ్రంగా పోటీ ఉన్నా కార్పొరేషన్‌ను దక్కించుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న కాంగ్రెస్ పార్టీ, అభ్యర్థుల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. బీఆర్ఎస్ నుంచి కూడా అత్యధికంగా 257 మంది నామినేషన్లు వేశారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఇంకో రకమైన పరిస్థితి నెలకొంది. స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుటుంబం నుంచి ఆయన ఇద్దరు కుమారులు, భార్య నామినేషన్లు దాఖలు చేయడం చర్చనీయాంశంగా మారింది. తన ప్రమేయం లేకుండానే కొందరు నాయకులు అభ్యర్థులను ప్రకటిస్తున్నారన్న ఆగ్రహంతోనే లక్ష్మారెడ్డి ముగ్గురితో నామినేషన్లు వేయించారని తెలుస్తోంది. ఎమ్మెల్యేను బుజ్జగించేందుకు పార్టీ రాష్ట్ర నాయకులు ప్రయత్నిస్తున్నారు. నల్గొండ కార్పొరేషన్లో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ఇక్కడి 48 డివిజన్లకు గాను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు 26 డివిజన్లకు తమ అభ్యర్థులను ప్రకటించారు. ఇందులో 4వ డివిజన్‌కు కత్తుల నాగేశ్వరి, 20వ డివిజన్‌కు నాంపల్లి అయ్యప్పల పేర్లు ప్రకటించారు. కానీ వీరిద్దరూ నామినేషన్ దాఖలు చేయకపోవడం కొసమెరుపు.

త్యాగమే జాతిపిత గాంధీజీ లక్షణం

మొదటిపేజీ తరువాయి

సముచితమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అన్నారు. "నిర్వాహకులు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారు. తొలితరంలో బూర్గుల రామకృష్ణారావు గారు, రావి నారాయణ రెడ్డి గారు స్ఫూర్తినిస్తే, మలితరంలో ఎస్. జైపాల్ రెడ్డి గారు, సుదర్శన్ రెడ్డి గారి వంటి వారు తెలంగాణ సమాజానికి స్ఫూర్తినిచ్చారు. సుదర్శన్ రెడ్డి గారు తెలంగాణ సమాజానికి ఒక స్ఫూర్తిగా నిలిచారు. రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో వారు పోషించిన పాత్ర మనందరికీ గుర్తుంది. వారి అనుభవాలు పరిపాలనలో ఉపయోగపడుతున్నాయి" అని వివరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పోలీసులు చట్టబద్ధంగా నోటీసులు ఇస్తే, జాతిపితకు నోటీసులు ఇస్తారా అంటూ ఆవేదన వ్యక్తం చేయడం సరికాదన్నారు. "గాంధీజీ ప్రాణాలే త్యాగం చేశారు. మరి ఇప్పుడు జాతిపిత అంటూ చెప్పుకునే వారు తెలంగాణ కోసం ఏం త్యాగం చేశారు?" అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమాన్ని ఏకం చేసి నడిపించిన ప్రొఫెసర్ కోదండరాం ఉద్యమకారుడు కాదా? అని ప్రశ్నించిన సీఎం, "మీ పాలనలోనే ఆయన ఇంటి తలుపులు బద్దలు కొట్టి అరెస్టు చేశారు. అప్పుడు ఉద్యమకారుల విలువ గుర్తుకురాలేదా?" అంటూ బీఆర్ఎస్ పై నిప్పులు చెరిగారు. "మిమ్మల్ని మాత్రం తలుపులు పగలగొట్టి తీసుకురాలేదు. నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారు. ఇందులో అన్యాయం ఎక్కడుంది?" అని సీఎం ప్రశ్నించారు.

త్యాగం లేని వారు ఉద్యమకారులు ఎలా?

రావి నారాయణరెడ్డి లాంటి వారు తెలంగాణ కోసం సర్వం కోల్పోయారని, పదవులు, వేలకోట్ల ఆస్తులు సంపాదించుకున్న వారు ఉద్యమకారులమని చెప్పుకోవడం ప్రజలను మభ్యపెట్టడమేనని సీఎం మండిపడ్డారు. ప్రజలు తీర్పు ఇచ్చినప్పుడు హుందాగా స్వీకరించాలని, ప్రజలే తప్పు చేశారని ఆరోపించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. "ఇదెక్కడి ప్రజాస్వామ్యం? ఇదెక్కడి ఉద్యమకారుడి లక్షణం? ఇదెక్కడి జాతిపిత లక్షణం?" అని ప్రశ్నల బీఆర్ఎస్ పై సీఎం వర్షం కురిపించారు. అక్రమ మార్గాలు ఎంచుకున్న వారు ప్రజాస్వామ్యంలో తప్పనిసరిగా విచారణను ఎదుర్కోవాలని అంబేద్కర్ స్పష్టం చేశారని గుర్తు చేశారు. శిబు సోరెన్ లాంటి వారు కూడా విచారణ ఎదుర్కొన్నారని, "మనమేం దైవాంశ సంభూతులం కాదు, మధ్యయుగాల చక్రవర్తులు కాదు" అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మధ్యయుగాల పాలకులు తమ బాధనే రాజ్యబాధగా ప్రచారం చేసేవారని, అలాంటి కాలం చెల్లిపోయిందన్నారు. బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన 'సర్' ద్వారా రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కాలరాయాలనే కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ అంశంపై కమ్యూనిస్టులు గ్రామగ్రామాన ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంపై దాడి జరుగుతోందని, దీనికి వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా నిలవాలని అన్నారు.

త్యాగానికి ప్రతిరూపం రావి నారాయణరెడ్డి

అరాచక శక్తులకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు రావి నారాయణరెడ్డి అని సీఎం కొనియాడారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా పేద ప్రజల కోసం తన 500 ఎకరాల భూమిని దానం చేసిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. రాచరిక పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ వెట్టిచాకిరీ విముక్తికి కృషి చేశారని, నిరక్షరాస్యులను కూడా ప్రభావితం చేసిన నాయకుడని అన్నారు. దేశంలో తొలి ప్రధాని నెహ్రూ కంటే ఎక్కువ మెజారిటీతో పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన అరుదైన నేత రావి నారాయణరెడ్డి అని తెలిపారు. ప్రజా తీర్పును గౌరవిస్తూ తొలి పార్లమెంట్ భవనాన్ని నెహ్రూతో కలిసి ఆయనే ప్రారంభించారని గుర్తు చేశారు. అరవై ఏళ్ల వయసులో రాజకీయ పదవులు, పార్టీ బాధ్యతలను వదిలి ప్రజలకు స్ఫూర్తినిచ్చిన నాయకుడిగా ఆయన నిలిచారని సీఎం అన్నారు. "ఈ కాలంలో ప్రజలు ఓడించినా కొందరు పదవులు వదలడం లేదు" అంటూ పరోక్షంగా కేసీఆర్ పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీపీఐ నాయకులు నారాయణ, చాడ వెంకట్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించారు.

లోక్‌సభలో గందరగోళం

మొదటిపేజీ తరువాయి

ఓ మ్యాగజైన్ ప్రచురించింది. వాటిని రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రస్తావించారు. దీంతో రాహుల్ ప్రసంగాన్ని రాజ్‌నాథ్ సింగ్ అడ్డుకున్నారు. రాహుల్ ప్రచురించని పుస్తకంలోని అంశాలను ప్రస్తావిస్తున్నారని మండిపడ్డారు. ఆ పుస్తకం ప్రామాణికతను ప్రశ్నించారు.

అందులో ఏముంది? అంతగా భయపడున్నారు: రాహుల్ గాంధీ

తాను ఈ ప్రత్యేక విషయంపై మాట్లాడాలని ఎప్పుడూ అనుకోలేదని రాహుల్ గాంధీ అన్నారు. అయితే బీజేపీకి చెందిన ఎంపీ తేజస్వీ సూర్య కాంగ్రెస్ పార్టీ దేశభక్తిని ప్రశ్నించిన తర్వాత తాను ఈ పుస్తకంలోని అంశాలను ప్రస్తావించాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. "ఇక్కడొక యువ ఎంపీ కాంగ్రెస్ పార్టీపై ఆరోపణ చేశారు. నేను ఈ అంశాన్ని లేవనెత్తాలని అనుకోలేదు. కానీ అతను కాంగ్రెస్ దేశభక్తి, భారతీయ సంస్కృతిపై మాకున్న అవగాహన గురించి మాట్లాడారు. మాజీ ఆర్మీ చీఫ్ నరవణే రాసిన బుక్‌లోని అంశాల గురించి అందుకే ప్రస్తావించాను. ఈ అంశాల గురించి వింటే ఎవరు దేశభక్తులో? ఎవరు దేశభక్తి లేనివారో మీకు కచ్చితంగా అర్థమవుతుంది. మ్యాగజైన్ ప్రచురించిన కథనాన్ని నేను ఉటంకిస్తే అధికార పార్టీ భయపడుతోంది. వారిని అంతగా భయపెడుతున్నది అందులో ఏముంది? వారు భయపడకపోతే నన్ను ఆ అంశాలను చదవడానికి అనుమతించాలి" అని రాహుల్ పేర్కొన్నారు. "నేను సభలో ప్రస్తావించినవి డోక్లాంలో జరిగిన ఒక సంఘటనకు సంబంధించవి. నాలుగు చైనా ట్యాంకులు భారత భూభాగంలోకి ప్రవేశించి ఒక పర్వత శ్రేణిని ఆక్రమిస్తున్నాయి. ఈ విషయాన్ని మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే ఆత్మకథ ఆధారంగా ఓ మ్యాగజైన్ తన కథనంలో ఉదహరించింది. ఆ కథనంలోని అంశాలనే నేను సభలో ఉటంకించాను. అవి మీరు శ్రద్ధగా వినాలని నేను కోరుకుంటున్నాను. అప్పుడు దేశభక్తులు ఎవరో, దేశద్రోహులు ఎవరో మీకు కచ్చితంగా అర్థమవుతుంది. దీనికి కొద్దిగా సమయం పడుతుంది. "అని రాహుల్ వ్యాఖ్యానించారు. అలాగే సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ రాహుల్‌కు మద్దతుగా నిలిచారు. చైనాకు సంబంధించిన విషయం చాలా సున్నితమైనదని, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడటానికి అనుమతించాలని డిమాండ్ చేశారు.

'సభలో చర్చలు నిబంధనలు ప్రకారం జరగాలి'

వార్తాపత్రికల క్లిప్పింగులు, ప్రచురణ కాని పుస్తకాలకు సంబంధించిన విషయాలను లోక్‌సభలో ప్రస్తావించకూడదని స్పీకర్ ఓం బిర్లా ఆదేశించారని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. సభలో చర్చలు నిబంధనల ప్రకారం జరగాలన్నారు. లోక్‌సభలో స్పీకర్ ఆదేశాలను పాటించని సభ్యుడిపై ఏ చర్యలు తీసుకోవాలో కూడా సభలో చర్చించాలని పేర్కొన్నారు. అలాగే సభా కార్యకలాపాలకు సంబంధం లేని ఏ బుక్ లేదా వార్తాపత్రిక క్లిప్పింగ్‌ను సభలో ఉటంకించకూడదని స్పీకర్ ఓం బిర్లా చెప్పారు. ఈ క్రమంలో రూల్ బుక్‌లోని నిబంధనలను చదివి వినిపించారు. అయితే విపక్షాల గందరళగోళం నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను మధ్యాహ్నం నాలుగు గంటలకు వాయిదా వేశారు.

కాంగ్రెస్ పెట్టుబడులన్నీ కట్టుకథలే

మొదటిపేజీ తరువాయి

బహిర్గతం చేయడానికి "హ్యాష్‌ట్యాగ్ కాంగ్రెస్ ఫేక్ ఎంవోయూలు" పేరుతో తెలంగాణ యువత ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరంలో అగ్నిప్రమాదాలు, నేరాలు పెరుగుతున్నా సీఎం స్పందించకపోవడం దురదృష్టకరమని అన్నారు. 2022 మార్చి నుంచి ఇప్పటి వరకు నగరంలో అనేక అగ్నిప్రమాదాలు జరిగాయని, రూబీ హోటల్, దక్కన్ మాల్, స్వప్నలోక్ కాంప్లెక్స్, గుల్జార్ హౌస్, నాంపల్లి ఘటనల్లో ప్రాణ నష్టం జరిగినా ముఖ్యమంత్రి కనీసం పరామర్శ కూడా చేయలేదని విమర్శించారు. మొన్నటి నాంపల్లి అగ్నిప్రమాదంలో తెలంగాణ వాళ్లు లేరని చెప్పడం సీఎం స్థాయికి తగదని అన్నారు. పీఆర్ స్టంట్లు మానేసి సెల్లార్లలో జరిగే వ్యాపారాలు, పాత భవనాలను ప్రభుత్వం కఠినంగా మానిటర్ చేయాలని సూచించారు. మహిళల భద్రత విషయంలో హైదరాబాద్ నగరం పూర్తిగా విఫలమైందని కవిత అన్నారు. గత ఒక్క ఏడాదిలోనే 69 హత్యలు, 176 హత్యాయత్నాలు జరిగాయని, గన్ కల్చర్ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం కోటిలో గన్‌తో కాల్పులు జరిపి లక్షల రూపాయలు దోచుకున్న ఘటనను గుర్తు చేశారు. గతేడాది పోలీసులపైనే దాడులు జరిగినా హోం మంత్రిగా ఉన్న సీఎం మేల్కొనలేదని విమర్శించారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యపై దాడి జరిగినప్పుడు స్పందించని సీఎం ఆమె మరణానంతరం ట్వీట్ చేయడమే బాధాకరమన్నారు. ఎక్సైజ్, ఫారెస్ట్ శాఖ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు.

లేబుల్ చూసి ఓటు వేయమని చెప్పడం నియంతృత్వమే

మున్సిపల్ ఎన్నికలపై మాట్లాడిన కవిత, అభ్యర్థి మంచోడైనా చెడ్డోడైనా కేసీఆర్‌ను చూసి ఓటు వేయాలని కేటీఆర్ కోరుతున్నారని విమర్శించారు. కేవలం లేబుల్ చూసి ఓటు వేయమని చెప్పడం నియంతృత్వ, రాజరిక పోకడలకు నిదర్శనమని అన్నారు. కులం, మతం, చుట్టరికం, డబ్బు చూసి కాకుండా, ఆపదలో ఆదుకునే వ్యక్తి ఎవరో చూసి ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. డబ్బులు అడిగే అభ్యర్థులు కాకుండా ప్రజలకు సేవ చేసే వారిని గెలిపించాలని అన్నారు. జాగృతి తరఫున కొన్ని చోట్ల ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున మంచి అభ్యర్థులను నిలబెట్టామని, వారికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని కవిత మండిపడ్డారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలుగింటి కోడలైనా రాష్ట్రానికి ఏమీ దక్కలేదన్నారు. 53 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు ఒక్క శాతం కూడా కేటాయించలేదని విమర్శించారు. విభజన జరిగి 12 ఏళ్లు గడిచినా హామీలు అలాగే పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం 47 అంశాలు అడిగితే ఒక్కటైనా మంజూరు చేయలేదని చెప్పారు. అర్బన్ డెవలప్‌మెంట్, రీజినల్ రింగ్ రోడ్, మెట్రో ఫేజ్ 2, ఐఐఎం, నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, ఉక్కు ఫ్యాక్టరీ, కోచ్ ఫ్యాక్టరీ వంటి హామీలను కేంద్రం విస్మరించిందన్నారు. మెట్రో ఫేజ్ 1 రిపోర్ట్ ఇవ్వలేదనే కారణంతో నిధులు ఇవ్వలేదని కిషన్ రెడ్డి చెప్పడం తెలంగాణ ప్రజలను తక్కువగా చూడటమేనని అన్నారు. ముందుగా కేటాయింపులు చేసి ఆ తర్వాత రిపోర్టులు కోరాలి కదా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి 30 సార్లు ఢిల్లీకి వెళ్లి మోడీని కలిసినా కనీసం 30 వేల కోట్లు కూడా తీసుకురాలేకపోయారని విమర్శించారు. ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. మూడు సార్లు వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌కు వెళ్లడం, హైదరాబాద్‌లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించడం ద్వారా లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వం చెబుతుండగా, వాటి నిజానిజాలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. సీఎం హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లిన విషయంపై స్పందిస్తూ, ఆ కోర్సు ఫీజు సింగరేణి నుంచి చెల్లించారా లేదా ఎవరైనా బిజినెస్‌మ్యాన్ చెల్లించారా, లేక హార్వర్డ్ యూనివర్సిటీ నుంచే ఆహ్వానం వచ్చిందా అనే విషయాలపై సీఎం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని అన్నారు. పెట్టుబడులపై చేసిన ప్రకటనలన్నీ అనుమానాస్పదమని కవిత ఆరోపించారు. ట్రంప్ మీడియా టెక్నాలజీ సంస్థ లక్ష కోట్ల పెట్టుబడి అని చెప్పారని, కానీ ఆ సంస్థ మొత్తం మార్కెట్ వ్యాల్యూ 30 వేల కోట్లే అని అన్నారు. సింగపూర్ గేట్‌వే డేటా సెంటర్ ద్వారా 67 వేల కోట్ల పెట్టుబడులు అన్న సంస్థకు వెబ్‌సైట్ కూడా లేదని తెలిపారు. ఇన్‌ఫ్రాకీ డేటా సెంటర్ పార్క్ అనే సంస్థ గతేడాది మేలో మాత్రమే ఏర్పాటైందని, అది అమెరికా, బ్రెజిల్ ప్రభుత్వాలతో భారీ ఎంవోయూలు చేసుకుందని చెప్పారు. ఈ సంస్థలు కేవలం ఎంవోయూల కోసమే ఏర్పాటయ్యాయా, లేక బ్యాంకులను మభ్యపెట్టే ప్రయత్నమా అని ప్రశ్నించారు. బ్రూక్‌ఫీల్డ్ యాక్సెస్ సంస్థలు తమ మార్కెట్ వ్యాల్యూకన్నా ఎక్కువ పెట్టుబడులు పెడతామని ప్రకటించాయని అన్నారు. కుందురూ జయవీర్ రెడ్డి సంస్థ 5,600 కోట్ల పెట్టుబడి నిజమేనా అని ప్రశ్నించారు. భరత్ గరుడ, ఎస్ఎల్ఆర్, ఆర్సీటీ వంటి సంస్థలు వేల కోట్ల పెట్టుబడులు అంటున్నా వాటి ఫెడ్ అఫ్ క్యాపిటల్ పది లక్షలు కూడా లేదని చెప్పారు. ఉర్సా క్లస్టర్స్ అనే సంస్థ ఎంవోయూ కుదుర్చుకున్న తర్వాతే కంపెనీ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ అన్ని కంపెనీల వివరాలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తామని ప్రకటించారు.

కేసీఆర్ సీఎం ఉన్నప్పుడే ఫోన్ ట్యాపింగ్

ఫోన్ ట్యాపింగ్ కేసుపై మాట్లాడుతూ, కేసీఆర్ సీఎం ఉన్నప్పుడే ట్యాపింగ్ జరిగిందని, అందుకే ఆయనను విచారణకు పిలిచారని చెప్పారు. చట్టాలకు ఎవరూ అతీతులు కాదని, తాను తప్పు చేయకపోయినా ఈడీ, సీబీఐ విచారణలకు వెళ్లానని గుర్తు చేశారు. కేటీఆర్ కేసీఆర్‌ను విచారణకే పిలవొద్దని చెప్పడం రాజరిక ఆలోచనలకు నిదర్శనమని అన్నారు. ఈ ఆలోచనలు మారకపోతే బీఆర్ఎస్‌ను ఎవ్వరూ కాపాడలేరని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సాగదీయకుండా తుది దశకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. అయితే గుంటనక్కతో కాంగ్రెస్ ప్రభుత్వం మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుందని, అందుకే ఈ కేసులో పూర్తి విచారణ జరుగుతుందన్న నమ్మకం లేదన్నారు. మున్సిపల్ ఎన్నికల కోసమే కేసును అటూ ఇటూ తిప్పుతున్నారని ఆరోపించారు. ఫిబ్రవరి 20 తర్వాత జాగృతి తరఫున "జనం బాట" కార్యక్రమం కొనసాగిస్తామని కవిత ప్రకటించారు. బీఆర్ఎస్ రాజరిక పోకడలు, కాంగ్రెస్ ఫేక్ హామీలు, బీజేపీ అన్యాయం నేపథ్యంలో రాష్ట్ర రాజకీయ వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. యువత, మహిళలు, మేధావులు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. నిజంగా పెట్టుబడులు వచ్చి ఉంటే వాటి వివరాలు, వాటి ద్వారా ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

'ఉపాధి' చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలి

- వీబీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలి
- బానిసత్వంలో నెట్టెందుకే కొత్త చట్టం: వక్తల అందోళన
- ఇందిరా పార్క్, ధర్నా చౌక్‌లో ఉపాధి హమి కూలీలు ధర్నా

ప్రతిపక్షం, సికింద్రాబాద్, ఫిబ్రవరి 2: ఉపాధి హామీ హక్కుల పరిరక్షణ ఉద్యమం ఆధ్వర్యంలో సోమవారం ఇందిరా పార్క్, ధర్నా చౌక్‌లో ఉపాధి హమి కూలీలు ధర్నా నిర్వహించారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో ప్రజా సంఘాల విస్తృత వేదికగా ఏర్పడిన 'ఉపాధి హామీ హక్కుల పరిరక్షణ ఉద్యమం' ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని ఎంజీ నరేగా చట్టాన్ని కొనసాగించాలని మహిళ కూలీలు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో దళిత బహుజన ఫ్రంట్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ, తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్, స్వరభారతి, రైతు నేస్తం సంఘాలు, గ్రామ్య సంస్థ, ఒంటరి మహిళల సంఘం, రైతు స్వరాజ్య వేదిక, సఫర్, ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక, మహిళా రైతుల హక్కుల వేదిక తదితర సంఘాలు పాల్గొన్నాయి. 20 సంవత్సరాలుగా అమల్లో ఉండి, లక్షలాది మంది గ్రామీణ కార్మికులకు జీవనాధారంగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఎంజీ నరేగాను పునరుద్ధరించాలని, దాని స్థానంలో వచ్చిన వీబీ గ్రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా జరిగింది. తెలంగాణ ప్రభుత్వం కూడా రాష్ట్ర అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని ఆమోదించి, ఎంజీ నరేగాను దాని అసలు రూపంలో పునరుద్ధరించాలని ఈ ధర్నాలో పాల్గొన్న సంఘాలు, జిల్లాల నుండి వచ్చిన గ్రామీణ ఉపాధి పథకంలో ఉపాధి పొందే కూలీలు డిమాండ్ చేశారు. తెలంగాణలోని దాదాపు జిల్లాల నుండి దాదాపు 200 మంది ఈ ధర్నాకు హాజరై తమ డిమాండ్ ను నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సౌమ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగయ్య, వెంకట్రాములు, రైతు స్వరాజ్య వేదిక నాయకులు విస్సా కిరణ్, కన్నెగంటి రవి, వివిధ సంఘాల నాయకులు అశాలత, ఉష, పులి కల్పన, వెంకటయ్య, వెంకటమ్మ, ఎగొడ రాజేందర్, దుబాషి సంజీవ్, కొండల్, స్వప్న, రాము తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలు అయిపోగానే

ఇంటి పన్ను పెంపుకు కాంగ్రెస్ ప్లాన్

- కాంగ్రెస్ కు ఎందుకు ఓటేయాలి?
- బీఆర్ఎస్ కు ఓటేస్తే డ్రైనేజీలో పడ్డట్లే
- కరీంనగర్ అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్
- మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 2: మున్సిపల్ ఎన్నికలు అయిపోయిన వెంటనే ఇంటి పన్ను పెంచి ప్రజల నడ్డి విరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. ఈ మేరకు ప్రతిపాదనలు కూడా సిద్ధమైందని అన్నారు. 6 గ్యారంటీలతోపాటు మేనిఫెస్టో పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. రెండేళ్లలో మున్సిపాలిటీలు, కరీంనగర్ కార్పొరేషన్ కు నయాపైసా ఇయ్యకుండా ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగడానికి వస్తున్నారని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అరాచకాలు, కబ్జాలతో ప్రజలను అరిగోస పెట్టిన బీఆర్ఎస్ నేతలకు ఎందుకు ఓటేయాలని నిలదీశారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలో లేని బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం నిధులు ఎక్కడి నుండి తెస్తుందని ప్రశ్నించారు. పొరపాటున బీఆర్ఎస్ కు ఓటేస్తే డ్రైనేజీలో పడ్డట్లేనని చెప్పారు. పొరపాటున బీఆర్ఎస్ గెలిస్తే...కమీషన్ల కోసం కేంద్ర నిధులను దారి మళ్లిస్తుందని అన్నారు. కరీంనగర్ లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే స్పష్టం చేశారు. తాను కేంద్రం నుండి నిధులు తీసుకొస్తే. బీఆర్ఎస్ నేతలు సిగ్గు లేకుండా కొబ్బరికాయ కొట్టి ఆ నిధులు తామే తెచ్చామని చెప్పుకుంటున్నారని విమర్శించారు. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే మరిన్ని నిధులు తెచ్చి కరీంనగర్ ను అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. కరీంనగర్ కు బండి సంజయ్ నయాపైసా తీసుకువచ్చినట్లు రుజువు చేస్తే ... కరీంనగర్ వదిలి వెళ్లిపోతానన్న మాజీ మంత్రి గంగుల కమలాకర్ చేసిన వ్యాఖ్యలను ధీటైన రీతిలో తిప్పికొట్టారు. "ఇదిగో బుక్ లెట్. కరీంనగర్ కోసం నేను తెచ్చిన నిధుల వివరాలన్నీ ఇందులో ఉన్నయ్. 5 లక్షల కాపీలను ప్రింట్ చేసి ఇంటింటికీ పంపిస్తున్నా... ఆ బుక్ లో నేను ఎన్ని నిధులు తెచ్చాను? ఏయే అభివృద్ధి పనులు చేశానో అన్నీ ఉన్నాయి. గంగుల కమలాకర్...ఇచ్చిన మాట ప్రకారం... ఇగ మూట ముల్లె సర్దుకుని కరీంనగర్ వదిలి వెళ్లిపో..."అని వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈరోజు నుండి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ 28, 29, 30, 35, 36 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు.

ప్రపంచ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుకు ట్రంప్ నాయకత్వం కీలకం. మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులపై సుంకాలను 18 శాతానికి తగ్గించడం అద్భుత నిర్ణయం. భారత్, అమెరికా సహకారం రెండు దేశాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరం. గతంలో ఎన్నడూ లేని విధంగా ట్రంప్‌తో కలిసి పనిచేయాలని ఆశిస్తున్నా. ప్రపంచంలో రెండు అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసి పనిచేస్తున్నాయి.
- ట్విట్టర్‌లో ప్రధాని మోదీ

రాజకీయం

బుల్లెట్ ట్రైన్‌కు హబ్‌గా హైదరాబాద్

- తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.5,454 కోట్ల నిధులు
- కాంగ్రెస్ పాలనలో కంటే అధికంగా కేటాయించాం
- బడ్జెట్లో ఏమీ ఇవ్వలేదని కాంగ్రెస్ నేతలు అంటున్నారు
- రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: బుల్లెట్ ట్రైన్‌కు హైదరాబాద్ మహా నగరం హబ్‌గా మారుతుందని స్పష్టం చేశారు. ఇది సౌత్ ఇండియా డైమండ్ హై స్పీడ్ రైల్వే ప్రాజెక్ట్ అని రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ అభివర్ణించారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన రైల్వే ప్రాజెక్టులతోపాటు నిధుల కేటాయింపులను అశ్వినీ వైష్ణవ్ వివరించారు. సోమవారం న్యూఢిల్లీలో మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.5,454 కోట్ల నిధులు కేటాయించామని, కాంగ్రెస్ పాలనలో కంటే అధికంగా తెలంగాణ రాష్ట్రానికి రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించామని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. అయినా ఈ బడ్జెట్ లో కేంద్రం మొండి చేయి చూపిందంటూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలోని పలువురు అగ్రనేతలు ఆరోపిస్తున్నారని, అలాంటి వేళ రైల్వే శాఖ ద్వారా తెలంగాణకు జరిగిన బడ్జెట్ కేటాయింపులను ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు. అలాగే మూడు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు ఇచ్చామని చెప్పారు. అవి.. హైదరాబాద్-బెంగళూరు (రెండున్నర గంటల ప్రయాణం) , హైదరాబాద్-చెన్నై (2:55 గంటల ప్రయాణం), హైదరాబాద్-పుణె (1:45 గంటల ప్రయాణం) అంటూ వివరించారు. బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లు అన్నీ ఎలివేటెడ్ కారిడార్‌గా నిర్మిస్తామన్నారు. అందుకు సంబంధించిన పనులను త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ నీచానికి పాల్పడిన వారికి శిక్ష తప్పదు

- తప్పుచేసి మాపైనే అభియోగాలు మోపుతున్నారు
- ఎవరు, ఎందుకు చేశారో.. తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రతిపక్షం, హైదరాబాద్, ఫిబ్రవరి 2 : ఫోన్ ట్యాపింగ్ నీచానికి పాల్పడినవారికి శిక్ష తప్పదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. చట్టం తన పని తాను చేస్తుందని స్పష్టం చేశారు. భార్యాభర్తల సంభాషణలు వినే దుశ్చర్యకు పాల్పడితే విచారణ జరపాలా వద్దా? అని ప్రశ్నించారు. తప్పుచేసి మాపైనే అభియోగాలు మోపుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎవరి మీదా కక్ష సాధింపు ఆలోచన లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాష్ట్రానికి చెడ్డపేరు తెచ్చిందన్నారు. సాధారణంగా ఉగ్రవాదులు, ఆటంకవాదుల ఫోన్లను ట్యాప్ చేస్తారని.. కానీ ఇక్కడ నాయకులు, జడ్జిలు, వ్యాపారవేత్తల ఫోన్లనే ట్యాప్ చేశారని చెప్పారు. ఆధారాలు లభించిన నేపథ్యంలో విచారణ జరుగుతోందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేశారు? ఎందుకు చేశారో.? తేల్చాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. బీజేపీ నేతలు బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అర్వింద్ ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేయాలని డిమాండ్ చేశారని ప్రస్తావించారు. వారి కుటుంబ సభ్యులు ఫోన్ ట్యాపింగ్ జరిగిందని బీజేపీ నేతలు చెబుతున్నారన్నారు. ఈ నీచానికి ఎవరు ఒడిగట్టారో విచారణ జరిపిస్తున్నామని తెలిపారు. దుశ్చర్యకు పాల్పడ్డవారికి శిక్ష తప్పదని హెచ్చరించారు.

న్యాయ నియామకాల్లో పారదర్శకతకు 'అఖిల భారత న్యాయ సేవ' ఏర్పాటు చేయాలి

- న్యాయమూర్తుల ఎంపికకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఉండాలి
- రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన ఎంపీ లక్ష్మణ్

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 2 : దేశ వ్యాప్తంగా న్యాయ నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ఐఏఎస్ , ఐపీఎస్ తరహాలోనే అఖిల భారత న్యాయ సేవ ను వెంటనే ఏర్పాటు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇవాళ ఆయన రాజ్యసభలో మాట్లాడుతూ న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో ప్రస్తుతం ఉన్న విధానం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీని స్థానంలో ఓ జాతీయ స్థాయి వ్యవస్థను తీసుకురావాలని సూచించారు. యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షల మాదిరిగానే, న్యాయమూర్తుల ఎంపికకు కూడా ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఉండాలని కామెంట్ చేశారు. దీంతో ప్రతిభావంతులైన యువతకు న్యాయ వ్యవస్థలో సరైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. అఖిల భారత న్యాయ సేవ ఏర్పాటుతో ఎస్సీ ఎస్టీ , బీసీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు న్యాయ వ్యవస్థలో తగిన ప్రాతినిధ్యం లభిస్తుందని లక్ష్మణ్ అన్నారు. నియామకాల్లో పారదర్శకత పెరగడం వల్ల న్యాయ వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం ఏర్పడుతుందని పేర్కొన్నారు. సమర్థులైన న్యాయమూర్తులు తక్కువ వయస్సులోనే విధుల్లోకి రావడం వల్ల, కోర్టుల్లో ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించే అవకాశం ఉంటుందని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 312 ప్రకారం అఖిల భారత న్యాయ సేవను ఏర్పాటు చేసే అధికారం పార్లమెంటుకు ఉందని లక్ష్మణ్ గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ఒకే రకమైన నిబంధనలు, వేతనాలు శిక్షణా విధానం ఉండటంతో న్యాయ పంపిణీ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికే అనేక రాష్ట్రాలు, న్యాయ నిపుణులు దీనిపై సుదీర్ఘంగా చర్చిస్తున్నారని, త్వరలోనే కేంద్రం దీనిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని డాక్టర్ లక్ష్మణ్ కేంద్ర ప్రభుత్వం దృష్టితీసుకొచ్చారు.

తాడిచర్ల-1 బొగ్గు గనులు తెలంగాణకే: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

తాడిచర్ల 1 బొగ్గు గనులను తెలంగాణకు కేటాయించామని ఇవాళ రాజ్యసభలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. 2015లో తెలంగాణ విద్యుత్ సంస్థకు కేటాయించామని తెలిపారు. ఇవాళ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ అడిగి ప్రశ్నకు బదులిచ్చిన కిషన్ రెడ్డి 2019 మార్చిలో ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఆమోదం తర్వాత 2020 జూన్ నుంచి గనుల కేటాయింపుల ప్రక్రియ మారిందని తెలిపారు. వ్యాపారానికి వాడే గనులను వేలంలో కేటాయించాలని కమిటీ సూచించిందని, ప్రత్యేక, తప్పని పరిస్థితుల్లోనే బొగ్గు శాఖ నేరుగా కేటాయించాలని కమిటీ తెలిపిందన్నారు. తాడిచర్ల2 గనులు ఇంకా ఎవరికీ కేటాయించలేదని స్పష్టం చేశారు. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు తాడిచర్ల కోల్ బ్లాక్ ను జెన్కోకు కేటాయించాం. దీని మైనింగ్ చేసేందుకు సింగరేణి ముందుకొస్తే.. వారితో 'మేం పనిచేయలేమని బీఆర్ఎస్ ప్రభుత్వం లేఖ రాయించుకుని' ప్రైవేటు కంపెనీకి 25 ఏళ్ల టెండర్ కట్టబెట్టిన మాట వాస్తవం కాదా? అని ఇటీవల కిషన్ రెడ్డి విమర్శించారు. ఇవాళ సుమారు.. రూ.47వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయి పడింది. దేశంలో ఏ కోల్ మైనింగ్ కంపెనీకి కూడా ఈ స్థాయిలో ఇబ్బందుల్లేవని వ్యాఖ్యానిచారు.

ప్రభుత్వ సలహాదారు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మభూషణ్ అవార్డుకు ఎంపికైన సందర్భంగా ముఖ్యమంత్రి ఆయనకు అభినందనలు తెలియజేశారు.
ప్రతిపక్షం, హైదరాబాద్

సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురు

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త నల్లబాలు కేసులో రాష్ట్ర హైకోర్టు తీర్పు
- సుప్రీంలో సవాల్ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- పిటిషన్‌ను డిస్మిస్ చేసిన న్యాయస్థానం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 2: సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురైంది. బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త నల్లబాలుపై రాష్ట్ర హైకోర్టు తీర్పును తెలంగాణ ప్రభుత్వం సుప్రీంలో సవాల్ చేయగా, న్యాయస్థానం పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త నల్లబాలు పోస్టులు పెట్టారని పోలీసులు మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ కేసుపై గతంలో విచారణ చేపట్టిన రాష్ట్ర హైకోర్టు.. సదరు ఎఫ్ఐఆర్‌లను కొట్టివేస్తూ పలు మార్గదర్శకాలను జారీ చేసింది. సోషల్ మీడియా పోస్టులపై మెకానికల్‌గా కేసులు నమోదు చేయొద్దని పోలీసులకు సూచించింది. ఈ మార్గదర్శకాలు ఇబ్బందికరంగా ఉన్నాయని తెలంగాణ ప్రభుత్వ తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా గతంలో ప్రస్తావించారు. ఈ కేసును తాజాగా విచారించిన సుప్రీం న్యాయస్థానం.. హైకోర్టు తీర్పును అభినందిస్తున్నామని, మార్గదర్శకాలు ఇవ్వడంలో తప్పేమీలేదని స్పష్టం చేసింది.

హుస్నాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం, హుస్నాబాద్, ఫిబ్రవరి 2: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 20 స్థానాలు గెలిపించి తనకు మరింత బలం ఇవ్వాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఓటర్లను కోరారు. హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలోని 1, 2, 3, 12, 13, 14 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులతో కలిసి మంత్రి డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ ప్రజా పాలన ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఫిబ్రవరి 11న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గత పదేళ్లలో హుస్నాబాద్‌కు ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ ఒక్క సంవత్సరంలోనే 500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, నూతన రేషన్ కార్డులు, వడ్డీలేని రుణాలు వంటి పథకాలు అమలవుతున్నాయన్నారు. హుస్నాబాద్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తవుతున్నాయని, 250 పడకల ఆసుపత్రి నిర్మాణం కొనసాగుతోందని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశాల, ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు జరుగుతున్నాయని, ఉపాధి అవకాశాల కోసం ఇండస్ట్రియల్ కారిడార్ తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. మహిళల స్వయం ఉపాధి కోసం సెట్విన్ శిక్షణ, ఎల్లమ్మ చెరువు వద్ద ఫిషరీస్ మార్కెట్, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో ప్రజా సంబంధాల శాఖ పాత్ర కీలకం

మొదటిపేజీ తరువాయి

సీపీఆర్‌వో మల్సూర్, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్, సంబంధిత అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రజలు ఏ మార్పు కావాలని కాంగ్రెస్ ప్రజాపాలనను కోరుకున్నారో, ఆ దిశగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే స్పష్టంగా చేసి చూపించి ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని నిలబెట్టుకుందని అన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ఒకవైపు ప్రపంచ నగరాలతో పోటీ పడే లక్ష్యాలను నిర్దేశించుకొని, మరోవైపు పేదల ఆకాంక్షలు తీర్చే సంక్షేమ ఫలాలు అందిస్తూ, ద్విముఖ వ్యూహంతో పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ పాలన సాగుతోందని అన్నారు. ఈ మార్పులను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో ప్రజా సంబంధాల శాఖ పాత్ర ఎంతో కీలకం అని అన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకొని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు వేగవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఈ సందర్భంగా సూచించారు.

డీల్ కుదిరింది.. టారిఫ్ తగ్గింది

మొదటిపేజీ తరువాయి

విధించిన ప్రతీకార సుంకాలను 25 నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. తన ఈ చర్య స్నేహం, గౌరవానికి చిహ్నంగా ట్రంప్ పేర్కొన్నారు. 'అమెరికాపై విధిస్తున్న సుంకాలను పూర్తిగా ఎత్తివేసేందుకు భారత్ ముందుకొస్తుంది.సుమారు 500 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన ఇంధన, సాంకేతిక, వ్యవసాయ, బొగ్గు, ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేస్తామని మోదీ హామీ ఇచ్చారు' అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై విధించిన 25 శాతం అదనపు సుంకాల తగ్గింపుపై ఎలాంటి స్పష్టత లేదు. భారత్‌పై టారిఫ్‌లు తగ్గించినందుకు ట్రంప్‌కు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారత తయారీ రంగానికి, ఎగుమతులకు ఇది ఊతమిస్తుందని చెప్పారు. రెండు అతిపెద్ద ప్రజాస్వామిక దేశాల మధ్య ఈ ఒప్పందం ఇరుదేశాల ప్రజలకు అనేక అవకాశాలకు ద్వారాలు తెరుస్తుందని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, సుస్థిరతకు ట్రంప్ నాయకత్వం అత్యంత కీలకమని పేర్కొన్నారు. అంతకుముందు ట్రంప్‌ప్రధాని మోదీ సోమవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. అయితే ఇరువురు నేతల మధ్య ఏయే అంశాలు ప్రస్తావనకు వచ్చాయన్న వివరాలు మాత్రం ఆయన వెల్లడించలేదు. 'వేచి చూడండి..' అనే సందేశాన్ని సెర్గియో గోర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ట్రంప్ ఫోన్ కాల్‌పై ప్రధాని మోదీ కూడా 'ఎక్స్'లోస్పందించారు. ట్రంప్‌తోసంభాషణ అత్యంత ఆకర్షణీయంగా సాగిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మరోవైపు భారత్‌లోని చారిత్రక కట్టడం ఇండియా గేట్ ఫొటోను ట్రంప్ సోషల్‌మీడియాలో షేర్ చేశారు. 'భారతదేశపు సుందరమైన విజయస్మారకం ఇది. మనది అన్నింటికన్నా గొప్పగా ఉండబోతున్నది' అని ఆయన పేర్కొన్నారు. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ 250వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, వాషింగ్టన్ డీసీలో భారీ కట్టడాన్ని నిర్మించాలని ట్రంప్ భావిస్తున్న నేపథ్యంలో ఈ పోస్ట్ ప్రాధాన్యత సంతరించుకుంది.

కోర్టు తీర్పు ముందే 'ఇల్లీగల్' ఎలా?

మొదటిపేజీ తరువాయి

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. పోలీసుల పని కేవలం దర్యాప్తు చేయడమేనని, తీర్పులు చెప్పాల్సింది కోర్టులేనని హరీష్ రావు స్పష్టం చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం కోర్టు నిర్ధారణ జరిగే వరకు ఏ ఆరోపణను నేరంగా పరిగణించరాదన్నది మౌలిక న్యాయ సూత్రమని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమా కాదా అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం 5(2), ఐటీ చట్టం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పరిశీలించాల్సిన అంశమని పేర్కొన్నారు. ఆ నిబంధనలకు విరుద్ధంగా ఏదైనా జరిగితే అది కోర్టు విచారణ ద్వారా మాత్రమే తేలాల్సి ఉంటుందని, పోలీసుల ప్రకటనల ద్వారా కాదని హరీష్ రావు తెలిపారు. సిట్ చీఫ్ సజ్జనార్ తన అధికారిక ట్విట్టర్ ప్రకటనలో "ఇల్లీగల్ ఫోన్ ట్యాపింగ్" అనే పదాన్ని ఉపయోగించడం ద్వారా దర్యాప్తు ఫలితంపై ముందే ఒక నిర్ణయానికి వచ్చినట్లు కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. ఇది సీనియర్ అధికారుల నుండి ఆశించే నిష్పాక్షికతకు విరుద్ధమని, ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్-1968 ప్రకారం కూడా తప్పేనని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడికి సంబంధించిన అంశంలో ఇలాంటి తొందరపాటు వ్యాఖ్యలు పక్షపాతంతో కూడిన రాజకీయ ప్రేరేపిత దర్యాప్తునకు సంకేతంగా ఉన్నాయని హరీష్‌రావు వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతకు ఇవ్వాల్సిన కనీస గౌరవాన్ని కూడా ఇవ్వకపోవడం ద్వారా ఏమి సందేశం ఇవ్వదలుచుకున్నారని నిలదీశారు.

సీఎం రేవంత్ వ్యాఖ్య విచారకరం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా విరుచుకుపడ్డారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి హేట్ స్పీచ్‌పై హితబోధ చేసిన కొద్ది నిమిషాలు కూడా గడవకముందే అదే వేదికపై సీఎం రేవంత్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం విచారకరమని ఆయన అన్నారు. కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత ద్వేషంతో మాట్లాడుతున్నారని, ఆ అక్కసు మరోసారి బయటపడిందని హరీష్ రావు ఆరోపించారు. విదేశాల్లో చదువుకున్నా కూడా మాటల తీరులో, ప్రవర్తనలో మార్పు కనిపించడంలేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించిన కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హరీష్ రావు అన్నారు. నాలుగు కోట్ల మంది ప్రజలు స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమం చేస్తున్న సమయంలో రేవంత్ రెడ్డి పాత్ర ఏమిటన్నదానిపై ఆయన ప్రశ్నించారు. అధికారాన్ని ప్రజల సంక్షేమం కోసం కాకుండా, ప్రతిపక్షాలపై రాజకీయ కక్ష సాధింపులకు వినియోగిస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలు, తెలంగాణ ఉద్యమ ప్రాధాన్యం రేవంత్ రెడ్డికి అర్థం కావడం లేదని హరీష్ రావు అన్నారు. ఎక్కడికి వెళ్లి చదువుకున్నా మాటల తీరులో మార్పు రావడం లేదని ఆయన వ్యాఖ్యానించారు.

ఇంటర్నేషనల్ లిటరేచర్ ఫెస్టివల్ లో ఫిజిక్స్ అరుణ్

ప్రతిపక్షం, సిటీబ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 2: శూన్యం, బిగ్ బ్యాంగ్ పుస్తక రచనలతో ఉమ్మడి తెలుగు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్ర నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన ప్రైవేటు టీచింగ్ ఫ్యాకల్టీ, కవి, రచయిత ఫిజిక్స్ అరుణ్ కుమార్ రైటర్స్ క్యాపిటల్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పనోరమ ఇంటర్నేషనల్ లిటరేచర్ ఫెస్టివల్ 2026లో భాగంగా "ది ఎలిమెంట్ ఆఫ్ ఎర్త్" అనే థీమ్ తో జూమ్ వేదికగా ఆదివారం రాత్రి నిర్వహించిన ఆన్లైన్ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో ఇండియా ప్రతినిధి గా పాల్గొని కవితా గానం చేశారు.ఈ సందర్భంగా ఫిజిక్స్ అరుణ్ "అవని... ప్రేమ కిరణాల కవనమై..!"శీర్షికతో చదివిన కవిత ద్వారా గాంధీజీ, రవీంద్రనాథ్ ఠాగూర్ స్ఫూర్తితో విశ్వమంతా ప్రేమ మయమై, యుద్ధాలు లేని ప్రపంచంలో పర్యావరణహితమై అందరూ సుఖశాంతులతో జీవించాలనీ, ప్లాస్టిక్ వినియోగ రహిత అవనిపై పచ్చని చెట్ల చిరునవ్వుల వెలుగుల మధ్య పుడమిపై పున్నమి వెన్నెల పూయాలనీ, లౌకిక తాత్విక స్ఫూర్తితో వసుదైక కుటుంబమై మనమంతా మెలగాలనీ.. తన అక్షరాలతో ప్రపంచానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ ఇరానీదౌరా కవడియా, సమన్వయకర్తగా డాక్టర్ రామకృష్ణ పెరుగు, ముఖ్యఅతిథిగా డాక్టర్ రామ్మోహన్ రావు,గౌరవ అతిథిగా లక్ష్మీనారాయణ్ కొల్లి, వినోద్ కుత్తుం, మిరప మహేష్, సుధా మురళి, శ్రీ వశిష్ట సోమేపల్లి, మందారపు హైమావతి ప్రతినిధులుగా పాల్గొన్నారు. అంతర్జాతీయస్థాయి కార్యక్రమంలో పాల్గొనడం పై వివిధ రంగాల ప్రముఖులు, విద్యార్థులు,మిత్రులు, కుటుంబ సభ్యులు, తదితరులు వివిధ సోషల్ మీడియా వేదికగా అరుణ్ కు అభినందనలు తెలిపారు. తనకి ఇంతటి మంచి అవకాశాన్ని కల్పించిన ఫౌండేషన్ కు, డాక్టర్ పెరుగు రామకృష్ణ తదితర సభ్యులందరికీ అరుణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

రసాయనాలతో తిరుమల లడ్డూ ప్రసాదం తయారుచేసి వైసీపీ మహాపరాధం చేసింది. నెయ్యిలో జంతు కొవ్వు లేదని సిట్ నివేదికలో ఎక్కడా పేర్కొనలేదు. అయినా వైసీపీ విష ప్రచారం చేస్తోంది. లడ్డూలో వినియోగించిన నెయ్యి అసలు నెయ్యే కాదు. రూ.400కి కిలో నువ్వుల నూనె దొరకదు. అలాంటిది ఆవు నెయ్యి ఎలా ఇచ్చారు? దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి.
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్

ఓపెన్ వాయిస్

విషాదాన్ని మిగిల్చుతున్న విమాన ప్రమాదాలు

ఆది అంతమూ లేని ఆకాశాన్ని.. అసలైన స్వేచ్ఛకు ప్రతీకగా మనం భావిస్తూ ఉంటాం. అయితే.. సమున్నతంగా, అనంతంగా వ్యాపించిన ఆ నీలి ఆకాశమే.. జాతిని ముందుకు నడపాల్సిన విలువైన వ్యక్తులను నిర్దాక్షిణ్యంగా చిదిమేసినప్పుడు కలిగే దుఃఖం మాటల్లో చెప్పలేనిది. తనను నమ్ముకున్న అనుచరులు పోటీ చేస్తున్న చోట ప్రచారానికో, దగాపడిన ప్రజలకు ధైర్యం చెబుదామనో, దేశప్రగతిని పట్టాలెక్కించే మరో కార్యక్రమం కోసమో.. విమానంలోనో, హెలికాప్టర్‌లోనో బయలుదేరిన నేతలు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోయినప్పుడు.. అది చెప్పలేని విషాదంగా పరిణమిస్తుంది. భారతప్రజాస్వామ్య చరిత్రలో అలాంటి అత్యంత విషాదకరమైన పీడకలలు ఎన్నో ఉన్నాయి. ఈ జాబితాలో ప్రజల మనసులు గెలిచిన నాయకుల నుంచి అన్ని రంగాల ప్రముఖులూ ఉన్నారు. విమాన ప్రమాదాలు అనగానే తెలుగువారికి ముందుగా కొన్ని పేర్లు గుర్తుకు వస్తాయి. వారిలో యలవర్తి నాయుడమ్మ ఒకరు. చిన్న రైతు కుటుంబంలో పుట్టిన నాయుడమ్మ అంతర్జాతీయ స్థాయి రసాయన శాస్త్రవేత్తగా ఎదిగారు. అప్పట్లో ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరాగాంధీకి సలహాదారుగా పని చేసిన ఆయన, ఐక్యరాజ్యసమితితోపాటు పలు అంతర్జాతీయ సంస్థలకు, విదేశీ సంస్థలకు కూడా సలహాదారుగా పనిచేశారు. కెనడాలోని ఐడిఆర్‌సి సమావేశానికి హాజరై 1985 జూన్ 23న తిరిగి వస్తున్న క్రమంలో ఆ ఎయిర్ ఇండియా విమానం పేలిపోవటంతో కన్నుమూశారు. ఈ వార్త వినగానే.. ఆయన భార్య డాక్టర్ పవన ఆత్మహత్య చేసుకుని మరణించటం మరో విషాదం.

ఇలాంటి విషాద వార్తలు వినగానే తెలుగువారికి ఏపీ మాజీ సీఎం రాజశేఖరరెడ్డి, నాటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి, సినీ నటి సౌందర్య మరణాలు మనం ఇప్పటికీ మర్చిపోలేం. లోక్‌సభ మాజీ స్పీకర్, టీడీపీ నేత జీఎంసీ బాలయోగి 2002 మార్చి 3న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. భీమవరం నుంచి బయలుదేరిన ఆయన ప్రయాణిస్తున్న ప్రైవేట్ హెలికాప్టర్, కృష్ణా జిల్లా కైకలూరు సమీపంలోని ఓ చెరువులో కూలిపోయింది. సరిగ్గా రెండేళ్ల తర్వాత తెలుగువారికి ఎంతో సుపరిచితురాలైన ప్రముఖ సినీ నటి సౌందర్య 2004 ఏప్రిల్ 17న జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందారు. ఇక.. తెలుగు రాష్ట్రాల ప్రజల జనహృదయ నేతగా పేరు తెచ్చుకున్న నేత దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 14 వ సీఎంగా పనిచేసిన వైఎస్సార్.. 2009, సెప్టెంబర్ 2న నల్లమల అడవుల్లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాల ప్రజలను తీవ్రంగా కలచివేసింది. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి మాధవరావు సింధియా 2001 సెప్టెంబర్ 30న విమాన ప్రమాదంలో మృతి చెందారు. నిరుడు జూన్ నెలలో దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపిన అహ్మదాబాద్ ఎయిరిండియా ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మరణించారు. ఇలా వరుసగా జరుగుతున్న విమాన, హెలికాప్టర్ ప్రమాదాలు చరిత్రలో చెరగని విషాద ఘట్టాలుగా నిలిచిపోయాయి. తాజాగా, బుధవారం ఉదయం మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆయన ప్రయాణిస్తున్న విమానం బారామతిలో ల్యాండింగ్ అవుతుండగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు మృతి చెందారు. ఈ వార్త విని యావత్ దేశం దిగ్భ్రాంతికి గురైంది. ముంబై నుంచి తన సొంత నియోజకవర్గం బారామతిలో జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. విమానం బయల్దేరినప్పటి నుంచి రెండుసార్లు సిగ్నల్స్ కట్ అయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటాలో తేలింది. ఉదయం 8:10 గంటలకు ముంబై ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరిన విమానం, ప్రారంభంలో 6 కిలోమీటర్ల ఎత్తులో ప్రయాణించింది. 8:34 నిమిషాలకు మొదటిసారి సిగ్నల్స్ ఆగిపోయి, కొద్దిసేపటి తర్వాత మళ్లీ కనెక్ట్ అయ్యాయి. అయితే, 8:43 నిమిషాలకు బారామతి ఎయిర్‌పోర్ట్‌కు కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పుడు సిగ్నల్స్ పూర్తిగా నిలిచిపోయాయి. ప్రమాదానికి కొన్ని నిమిషాల ముందు విమానం వేగం గంటకు 237 కిలోమీటర్లకు పడిపోయి, ఆకస్మికంగా సంబంధాలు తెగిపోవడంతో కూలిపోయినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. విమాన ప్రమాదాలకు చాలా సార్లు పైలట్ తప్పిదం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌లో నిర్లక్ష్యం కారణంగా కూలిపోయిన ఘటనలు గతంలో వెలుగుచూశాం. అంతేకాకుండా చాలాసార్లు విమానాలు నడిపే పైలట్లకు అనుభవం లేకపోవడం వల్ల.. వారు తీసుకునే తప్పుడు నిర్ణయాలతోనూ విమానాలు కూలిపోయే అవకాశాలుంటాయి. ఇక సాంకేతిక సిబ్బంది చేసిన తప్పుల కారణంగా సైతం విమానాలు కూలిపోతుంటాయి. పైలట్ కంట్రోల్ రూమ్ మధ్య కమ్యూనికేషన్ కోల్పోవడం కూడా విమాన ప్రమాదానికి దారితీస్తుంది. వాతావరణం కూడా విమాన ప్రమాదాలకు కారణం అవుతుంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
మంగళవారం
03.02.2026

ఆరోగ్య వ్యవస్థను మోస్తున్న మహిళా వైద్యులు

వైద్య విద్యలో మహిళల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, భవిష్యత్తులో భారత ఆరోగ్య వ్యవస్థ రూపురేఖలు మారనున్నాయి. సానుభూతి, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమగ్ర దృష్టికోణం మహిళా వైద్యుల బలంగా మారుతున్నాయి. పలు పరిశోధనలు, మహిళా వైద్యులు రోగులతో ఎక్కువ సమయం గడుపుతూ, చికిత్స వివరాలను స్పష్టంగా వివరించడంతో చికిత్స ఫలితాలు మెరుగ్గా ఉంటాయని సూచిస్తున్నాయి. ఇది ఆరోగ్య రంగంలో నాణ్యతాపరమైన మార్పుకు దారితీస్తోంది.

రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

వైద్యం మానవ సమాజంలో అత్యంత విశ్వసనీయమైన సేవా రంగం. ప్రాణాన్ని కాపాడే ఈ వృత్తిలో సేవా దృక్పథం ఎంత ముఖ్యమో, సానుభూతి కూడా అంతే కీలకం. ఆ సానుభూతికి సహజ ప్రతిరూపంగా నిలిచింది మహిళా వైద్యుల పాత్ర. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 3న జాతీయ మహిళా వైద్యుల దినోత్సవాన్ని జరుపుకోవడం వెనుక ఉన్న ఆలోచన కేవలం గౌరవ ప్రదర్శన మాత్రమే కాదు; భారత ఆరోగ్య వ్యవస్థలో మహిళల కృషిని గుర్తించి, వారి సేవలకు సామాజిక గుర్తింపును పెంపొందించడమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ రోజు ప్రపంచంలో తొలి మహిళా వైద్యురాలిగా గుర్తింపు పొందిన డాక్టర్ ఎలిజబెత్ బ్లాక్‌వెల్ జన్మదినం కావడం కూడా ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. భారత సమాజంలో మహిళలకు విద్య, వృత్తి స్వేచ్ఛ లభించని కాలంలో వైద్య రంగంలోకి మహిళలు అడుగు పెట్టడం ఒక విప్లవాత్మక పరిణామం. 19వ శతాబ్దం చివర్లో ఆనంది గోపాల్ జోషి, కడంబినీ గంగూలీ వంటి మహిళలు వైద్య విద్యను అభ్యసించడం అప్పటి సామాజిక నిర్మాణానికి పెద్ద సవాలుగా నిలిచింది. అప్పటి నుండి నేటి ఆధునిక వైద్య వ్యవస్థ వరకు మహిళా వైద్యుల ప్రయాణం అనేక పోరాటాలు, త్యాగాలతో నిండి ఉంది. ఈ చారిత్రక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుంటే, మహిళా వైద్యుల దినోత్సవం ఒక స్మరణా దినం మాత్రమే కాదు; ఒక సామాజిక మార్పు ప్రయాణానికి గుర్తుగా నిలుస్తుంది. నేటి భారతదేశ వైద్య రంగంలో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగింది. నేషనల్ మెడికల్ కమిషన్ గణాంకాల ప్రకారం, మెడికల్ అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరుతున్న విద్యార్థుల్లో సుమారు 48 నుంచి 50 శాతం వరకు మహిళలే ఉన్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఈ సంఖ్య 55 శాతానికి మించి ఉంది. ఇది వైద్య విద్యలో మహిళల ఆసక్తి, ప్రతిభ ఎంతగా పెరిగిందో స్పష్టంగా సూచిస్తుంది. కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నివేదికల ప్రకారం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న డాక్టర్లలో మహిళల వాటా గత రెండు దశాబ్దాల్లో దాదాపు రెట్టింపు అయింది. అయితే ఈ సంఖ్యలు ఆశాజనకంగా కనిపించినప్పటికీ, ఉన్నత స్థాయి వైద్య పరిపాలన, నిర్ణయాధికార స్థానాల్లో మహిళల ప్రాతినిధ్యం ఇంకా పరిమితంగానే ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 (NFHS5) నివేదికలు భారతదేశ ఆరోగ్య సూచికలలో మహిళా వైద్యుల పాత్ర ఎంత కీలకమో వెల్లడిస్తున్నాయి. మాతృ మరణాల రేటు, శిశు మరణాల రేటు తగ్గుదలలో మహిళా వైద్యులు, నర్సులు, ఆశా కార్యకర్తల సమిష్టికృషి కీలకంగా నిలిచింది. 2000 సంవత్సరంలో ప్రతి లక్ష ప్రసవాలకు 370గా ఉన్న మాతృ మరణాల రేటు, 2019-21 కాలానికి వచ్చేసరికి 97కి తగ్గడం వెనుక మహిళా వైద్యుల నిరంతర సేవలు ప్రధాన కారణంగా పేర్కొన బడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా వైద్యుల లభ్యత పెరిగిన చోట్ల గర్భిణీ సంరక్షణ మెరుగు పడినట్టు ప్రభుత్వ నివేదికలు స్పష్టంగా సూచిస్తున్నాయి.

గ్రామీణ భారతంలో మహిళా వైద్యుల అవసరం మరింత



ఎక్కువగా ఉంది. సామాజిక సంప్రదాయాల కారణంగా మహిళలు తమ ఆరోగ్య సమస్యలను పురుష వైద్యులతో పంచుకోవడంలో సంకోచించే సందర్భాలు ఇప్పటికీ ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మహిళా వైద్యులు నమ్మకానికి ప్రతిరూపాలుగా నిలుస్తున్నారు. మాతృ ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ, రక్తహీనత నివారణ, బాలికల పోషణ వంటి అంశాల్లో మహిళా వైద్యుల జోక్యం వల్ల ఆరోగ్య అవగాహన గణనీయంగా పెరిగింది. జాతీయ ఆరోగ్య మిషన్ నివేదికలు, మహిళా వైద్యులు ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవల వినియోగం అధికంగా ఉంటుందని స్పష్టం చేస్తున్నాయి.

కరోనా మహమ్మారి కాలం మహిళా వైద్యుల సేవలను దేశం మొత్తం ప్రత్యక్షంగా చూసిన సమయం. ఆరోగ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, కోవిడ్ ఫ్రంట్‌లైన్ వర్కర్లలో దాదాపు 60 శాతం వరకు మహిళలే ఉన్నారు. వైద్యులు, నర్సులు, ల్యాబ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఈ సమస్త వ్యవస్థను నిలబెట్టిన ప్రధాన శక్తి మహిళలే. కుటుంబానికి దూరంగా ఉంటూ, సంక్రమణ భయాన్ని లెక్కచేయకుండా, ఆసుపత్రుల్లో విధులు నిర్వర్తించిన మహిళా వైద్యులు నిజమైన సేవా స్ఫూర్తికి ప్రతీకలుగా నిలిచారు. అనేక ప్రభుత్వ నివేదికలు ఈ కాలంలో మహిళా వైద్యులు ఎదుర్కొన్న మానసిక ఒత్తిడి, శారీరక ప్రమాదాలు, కుటుంబ విరహ వేదనలను కూడా ప్రస్తావించాయి. ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం, కోవిడ్ కాలంలో పనిచేసిన మహిళా వైద్యుల్లో సుమారు 35 శాతం మంది తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనయ్యారని, అయినా సేవలో వెనక్కి తగ్గలేదని వెల్లడైంది. ఇది వారి వృత్తి నిబద్ధతకు నిదర్శనం. గ్రామీణ-పట్టణ విభజన కూడా మహిళా వైద్యుల విషయంలో ఒక ముఖ్యమైన అంశం. పట్టణ ప్రాంతాల్లో మహిళా వైద్యుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో వారి లభ్యత ఇంకా తక్కువగా ఉంది. దీనికి కారణాలు అనేకం. భద్రతా లోపాలు, మౌలిక సదుపాయాల కొరత, కుటుంబ సహకారం లేకపోవడం మొదలైనవి. అయినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ సేవలకు మహిళా వైద్యులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, అదనపు భత్యాలు, నివాస సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నాయి. జాతీయ ఆరోగ్య మిషన్ కింద పనిచేస్తున్న అనేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళా వైద్యుల నియామకం వల్ల సేవల నాణ్యత మెరుగుపడినట్లు ప్రభుత్వ ఆడిట్ నివేదికలు పేర్కొంటున్నాయి.

ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 3న జరుపుకునే జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం ఒక ఆచార కార్యక్రమంగా కాక, ఆత్మ పరిశీలన దినంగా మారాల్సిన అవసరం ఉంది. మహిళా వైద్యుల సేవలను గౌరవించడమే కాకుండా, వారు ఎదుర్కొంటున్న సమస్యలకు విధానపరమైన పరిష్కారాలు చూపాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, వైద్య సంస్థలు, సమాజం మీద ఉంది. సురక్షిత పని వాతావరణం, సమాన అవకాశాలు, నాయకత్వ స్థాయిల్లో ప్రాతినిధ్యం, కుటుంబానికి అనుకూలమైన విధానాలు అమలు చేసినప్పుడే మహిళా వైద్యుల పూర్తి సామర్థ్యం దేశానికి ఉపయోగ పడుతుంది.

భారతదేశం ఆరోగ్య సూచికలలో సాధించిన పురోగతి వెనుక మహిళా వైద్యుల శ్రమ అప్రతిహతంగా ఉంది. మాతృమరణాల తగ్గుదల నుంచి శిశు ఆరోగ్య మెరుగుదల వరకు, పోషణ లోపాల నివారణ నుంచి వ్యాధి నిరోధక కార్యక్రమాల విజయాల వరకు.. ప్రతి చోటా మహిళల ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. వారి సేవలు లేకుండా 'సర్వసౌఖ్య సమాజం' అనే లక్ష్యం అసంపూర్ణమే.

కాబట్టి జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం మనకు ఇచ్చే సందేశం స్పష్టమైనది. వైద్యం అనే సేవా రంగంలో మహిళలు కేవలం భాగస్వాములు కాదు, మార్పుకు దిశానిర్దేశకులు. సేవ, శాస్త్రం, సానుభూతి అనే మూడు మూల్యాల సమ్మేళనమే మహిళా వైద్యురాలు. వారి కృషికి గౌరవం చెల్లించడం అంటే ఆరోగ్యవంతమైన, సమానత్వభరితమైన భారత సమాజ నిర్మాణానికి పునాది వేయడమే.

ఫిబ్రవరి 3...జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం

(వ్యాసకర్త సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

బడ్జెట్ గణాంకాల వెనుక దాగిన నిర్లక్ష్యం

వేముల భవానీ
హైదరాబాద్

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, అంకుర సంస్థలపై కేంద్ర ప్రభుత్వం మరోసారి మాటల మాయ మాత్రమే చూపిందా? "స్వయం ఆధారిత భారత్", "భారతదేశంలో తయారీ" అంటూ ప్రతి సంవత్సరం నినాదాలు వినిపిస్తున్నా, వాస్తవానికి వచ్చేసరికి ఈ బడ్జెట్ లో చిన్న పరిశ్రమలకు దక్కింది ఏమిటన్న ప్రశ్నలు దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి.

కేంద్ర బడ్జెట్‌లో చిన్న పరిశ్రమల కోసం ప్రకటించిన రూ.10 వేల కోట్ల వృద్ధి నిధిను పెద్ద ఘనతగా ప్రచారం చేస్తున్నా, ఇది దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది సూక్ష్మ, చిన్న పరిశ్రమల సమస్యలకు పరిష్కారమా అన్న సందేహం తలెత్తుతోంది. ఈ నిధి కూడా ప్రధానంగా పెద్ద స్థాయికి ఎదగగల కొద్ది సంస్థలకే పరిమితమవుతుందన్నది పరిశ్రమల వర్గాల ఆందోళన.

చిన్న పరిశ్రమల సమస్యలు...బడ్జెట్‌కు కనిపించలేదా?

దేశవ్యాప్తంగా చిన్న పరిశ్రమలు నేడు ముడి సరుకుల ధరల పెరుగుదల, విద్యుత్ వ్యయాలు, కార్మిక ఖర్చులు, రుణాల లభ్యత లోపం వంటి అనేక సమస్యలతో సతమతమవుతున్నాయి. పరిశ్రమల్లో పవర్ ఫ్యాక్టర్ లోపాల పేరుతో విధిస్తున్న భారీ విద్యుత్ జరిమానాలు అనేక యూనిట్లను మూతపడే పరిస్థితికి నెట్టుతున్నాయి. అయినా ఈ అంశంపై బడ్జెట్‌లో ఒక్క స్పష్టమైన చర్య కూడా ప్రకటించలేదు. యంత్రాల ఆధునీకరణకు అవసరమైన సబ్సిడీలు, తక్కువ వడ్డీ రేట్ల రుణాలు, పూచీకత్తు లేని రుణాల పరిమితి పెంపు వంటి కీలక డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు కూడా కొద్ది రంగాలు, కొద్ది పెద్ద సంస్థలకే పరిమితమయ్యాయన్న విమర్శలు నిజమనే భావన కలుగుతోంది.

అంకుర సంస్థల ఆశలపై నీళ్లు

ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధికి ప్రతీకలుగా నిలుస్తున్న అంకుర సంస్థలపై ఈ బడ్జెట్ తీవ్ర నిరాశ మిగిల్చింది. యువతలో వ్యాపార స్ఫూర్తిని పెంపొందించే ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీలు, పరిశోధన-అభివృద్ధికి గణనీయమైన కేటాయింపులు ఉంటాయని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. దేశ భవిష్యత్ ఆర్థిక శక్తిగా చెప్పుకునే అంకుర సంస్థల వ్యవస్థకు ఇది వెనుకడుగే అన్న అభిప్రాయం బలపడుతోంది.

తెలంగాణకు బడ్జెట్‌లో ఏమిచ్చారు? శూన్యం!

ఈ కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు జరిగిన అన్యాయం మరోసారి స్పష్టమైంది. రాష్ట్ర విభజన జరిగి పన్నెండు సంవత్సరాలు పూర్తయినా, విభజన హామీల అమలుపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ నిర్లక్ష్య ధోరణినే కొనసాగిస్తోంది. రాష్ట్ర

ప్రభుత్వం కేంద్రానికి పంపిన నలభై ఏడు అంశాల ప్రతిపాదనల్లో ఒక్కదానికీ బడ్జెట్ లో స్థానం దక్కలేదు. ప్రాంతీయ వలయ రహదారి, హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ, పట్టణాభివృద్ధి వంటి కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర నిధులు లేవు. భారతీయ నిర్వహణ సంస్థ, నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాల మంజూరుపై కూడా బడ్జెట్ మౌనం వహించింది. విభజన హామీలలో భాగమైన ఉక్కు కర్మాగారం, రైలు బోగీల కర్మాగారం అంశాలను కూడా కేంద్రప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పెద్దవారి బడ్జెట్... చిన్నవారి నిరాశ

మొత్తంగా ఈ బడ్జెట్‌ను పరిశీలిస్తే, పెద్ద సంస్థలకు అనుకూలంగా విధానాలు రూపుదిద్దుకున్నాయన్న అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. ఉపాధి కల్పనకు కీలకమైన చిన్న పరిశ్రమలు, ప్రాంతీయ అభివృద్ధికి ఆధారమైన రాష్ట్రాలు మాత్రం పక్కకు నెట్టబడ్డాయి.

పునఃపరిశీలన లేకపోతే ప్రమాదమే

చిన్న పరిశ్రమలు, అంకుర సంస్థలు క్షీణిస్తే దాని ప్రభావం ఉపాధి, ఉత్పత్తి, ఆర్థిక వృద్ధిపై తీవ్రంగా పడుతుంది. తెలంగాణ వంటి రాష్ట్రాలను నిర్లక్ష్యం చేస్తే ప్రాంతీయ అసమానతలు మరింత పెరుగుతాయి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఈ బడ్జెట్‌ను పునఃపరిశీలించి, చిన్న పరిశ్రమలు, అంకుర సంస్థలు, తెలంగాణకు న్యాయం చేసే విధంగా విధాన సవరణలు చేయకపోతే ఈ బడ్జెట్ ప్రజల బడ్జెట్ కాదన్న భావన మరింత బలపడటం ఖాయం.

(వ్యాస రచయిత తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి Women Entrepreneur Wing)

చదువు, చైతన్యం, సమాజం: నేటి అనుసంధానం

చిటికెన కిరణ్ కుమార్
9490841284

చదువు అనేది ఒక వ్యక్తి జీవితంలో మొదలయ్యే ప్రక్రియగా కనిపించినా, అది ముగిసేది వ్యక్తితో కాదు; సమాజంలోకి విస్తరిస్తుంది. చదువు పెరిగినప్పుడు వ్యక్తి ఆలోచన మారుతుంది. ఆ ఆలోచన మారినప్పుడు చైతన్యం పుడుతుంది. ఆ చైతన్యం విస్తరించినప్పుడు సమాజం కదులుతుంది. ఈ మూడు మధ్య ఉన్న అనుసంధానాన్ని అర్థం చేసుకోలేకపోతే చదువు కేవలం అక్షరజ్ఞానంగా మిగులుతుంది; చైతన్యం కేవలం పదంగా మిగులుతుంది; సమాజం మాత్రం యథాతథంగా నిలిచిపోతుంది. నేటి కాలంలో చదువు విస్తరించినట్టు కనిపిస్తోంది. పుస్తకాలు మాత్రమే కాదు, సమాచారం అనేక రూపాల్లో అందుబాటులో ఉంది. కానీ సమాచారం పెరగడం చదువు పెరగడం కాదు. చదువు అనేది తెలుసుకోవడం మాత్రమే కాదు; ఆ తెలిసినదాన్ని ఆలోచనగా మార్చుకోవడం. ఆలోచనగా మారినప్పుడే అది చైతన్యంగా రూపాంతరం చెందుతుంది. ఈ మధ్య మనం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఇదే సమాచారం చాలా ఉంది, కానీ ఆలోచనకు కావలసిన నిశ్శబ్దం తక్కువగా ఉంది.

చైతన్యం అనేది ఒక వ్యక్తిలో ఒక్కసారిగా వెలిగే దీపం కాదు. అది చదువుతో పాటు అనుభవం కలిసినప్పుడు నెమ్మదిగా వెలుగులోకి వస్తుంది. చదువు మనకు ప్రశ్నలు వేయడం నేర్పితే, చైతన్యం ఆ ప్రశ్నలను మనలోనే నిలిపి ఉంచుతుంది. ప్రతి ప్రశ్నకు తక్షణ సమాధానం కావాలని కోరుకునే అలవాటు చైతన్యాన్ని పెంపొందించదు. ఆలోచనకు ఓర్పు అవసరం. ఆ ఓర్పే చైతన్యానికి మూలం.

సమాజం అంటే వ్యక్తుల సమూహం మాత్రమే కాదు; ఆ వ్యక్తుల ఆలోచనల సమిష్టి రూపం. ఒక సమాజం ఎలా ఆలోచిస్తోంది అన్నది, ఆ సమాజంలో చదువు ఎలా ఉంది అన్నదానిపై ఆధారపడి ఉంటుంది. చదువు వ్యక్తిని మాత్రమే మార్చినప్పుడు అది వ్యక్తిగత విజయంగా మిగులుతుంది. అదే చదువు చైతన్యాన్ని పెంపొందించి, సమాజంతో అనుసంధానమైనప్పుడు అది సామూహిక ప్రయోజనంగా మారుతుంది.

నేటి సమాజంలో చదువు-చైతన్యం మధ్య ఉన్న దూరం గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది. చదువుకున్నవాడు కూడా కొన్నిసార్లు ఆలోచించకుండా స్పందిస్తున్నాడు. చైతన్యం అంటే పెద్ద మాటలు మాట్లాడడం కాదు; చిన్న విషయాల్లో బాధ్యతగా ఆలోచించడం. సమాజం పట్ల తన పాత్ర ఏమిటో తెలుసుకోవడం. ఈ భావన చదువుతో కలి

సినప్పుడే సమాజం ముందుకు కదులుతుంది.

చదువు మనకు మార్గాలు చూపుతుంది. చైతన్యం మనకు దిశ ఇస్తుంది. సమాజం ఆ దిశలో నడిచే శక్తిని అందిస్తుంది. ఈ మూడు ఒకదానికొకటి విరుద్ధంగా కాకుండా, పరస్పరంగా సహకరించినప్పుడు మాత్రమే సమతుల్యమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. చదువు లేకుండా చైతన్యం ఊహ మాత్రమే. చైతన్యం లేకుండా చదువు ఖాళీ సమాచారమే. ఈ రెండూ లేకుండా సమాజం కేవలం గుంపుగా మిగులుతుంది.

ఈ అనుసంధానాన్ని బలోపేతం చేయాల్సిన బాధ్యత కేవలం విద్యా సంస్థలదే కాదు. ప్రతి పాఠకుడిదీ, ప్రతి రచయితదీ, ప్రతి ఆలోచన చేసే మనిషిదీ. చదివిన దానిని ప్రశ్నించడం, ప్రశ్నించిన దానిపై ఆలోచించడం, ఆలోచనను జీవితంలో అమలు చేయడం ఇదే చదువు నుంచి చైతన్యానికి, చైతన్యం నుంచి సమాజానికి వెళ్లే సహజ మార్గం. చివరికి చదువు మనిషిని పెద్దవాడిని చేయాలి; చైతన్యం మనిషిని బాధ్యతగలవాడిని చేయాలి; సమాజం మనిషిని మనిషిగా నిలబెట్టాలి. ఈ మూడు మధ్య అనుసంధానం బలపడినప్పుడే నేటి సమాజం నిజమైన అర్థంలో ముందుకు సాగుతుంది. అదే ఈ కాలానికి అత్యవసరమైన ఆలోచన.

(వ్యాసకర్త : ప్రముఖ సాహితీవేత్త, విమర్శకులు ఇంటర్నేషనల్ బెనెవోలెంట్ రీసెర్చ్ ఫోరం సభ్యులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

విద్యలో దినదినాభివృద్ధి ఉన్నత శిఖరాలకు చేర్చుతుంది

- వ్యక్తిత్వ వికాస నిపుణులు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

ప్రతిపక్షం, కరీంనగర్, ఫిబ్రవరి 2: విద్యార్థులు విద్యలో చూపించే దినదిన అభివృద్ధి వారు ఎంచుకున్న లక్ష్యాలకు చేర్చడానికి దోహదపడుతోందని, క్రమశిక్షణ కలిగిన జీవనశైలి విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు కెప్టెన్: డాక్టర్: లయన్: బుర్ర మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. గొల్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ లో విద్యార్థులకు సోమవారం లయన్స్ క్లబ్ గొల్లపల్లి, లీడ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన వ్యక్తిత్వ వికాస కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మోటివేటివ్ స్పీకర్ కెప్టెన్ లయన్ బుర్ర మధుసూదన్ రెడ్డి విద్యార్థుల్లో ప్రేరణ కలిగించారు. విద్యార్థులు చెడు అలవాట్లను త్వరగా గ్రహిస్తారని వాటికి దూరంగా ఉండి వారు ఏర్పరచుకున్న లక్ష్యాలను చేరడానికి ప్రతినిత్యం కష్టపడాలన్నారు. రోజులోని 24 గంటల్లో పాఠశాలకు ఎనిమిది గంటలు నిద్రకు ఎనిమిది గంటలు పోగా మిగిలిన ఎనిమిది గంటల్లో ఎక్కువ సమయాన్ని విద్య కోసం కేటాయిస్తారో వారే ఉన్నత లక్ష్యాలను చేరుకొని ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. విద్యార్థి తనను తాను తెలుసుకొని తనలోని చెడు లక్షణాలైనా అలసత్వం, సోమరితనాన్ని దూరం చేసుకుని తనను తాను జయించినప్పుడే విజయాలు తనకు దాసోహమైతాయన్నారు. ఇప్పుడు టెన్త్ చదువుతున్న మీరు మరో ఆరు సంవత్సరాలలో మీరు పెట్టుకున్న లక్ష్యాన్ని సాధించి సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో ఉండి అందరికీ ఆదర్శంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి మాట్లాడుతూ టెన్త్ విద్యార్థుల్లో పోబియో ఉంటుందని పరీక్షలు అంటే భయం లేకుండా చదివిందాన్ని పరీక్షల్లో రాయాలన్నారు. ఉన్నత చదువులకు 10వ తరగతి ఒక మెట్టు మాత్రమే అని పదవ తరగతి మార్కులతో సాధించేది ఏమీ లేదని విద్యార్థులు పాఠాలను బట్టి పట్టకుండా ప్రాక్టీస్ ద్వారా విద్యను అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా ట్రైనింగ్ మేనేజర్ తాడూరి శ్రీనివాస్, జి ఎల్ టి కోఆర్డినేటర్ లయన్ ఇనుగుర్తి రమేష్, లయన్ అంజనా రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుంకరి రవి గొల్లపల్లి లైన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు కరుణాకర్ రెడ్డి కార్యదర్శి సాయిని నరహరి సభ్యుడు తాడూరి సత్యం, మల్లారెడ్డితో పాటు 200 మంది పాఠశాల విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లీడ్ ఇండియా పౌండేషన్ బాధ్యులు ముఖ్య అతిథి డా: బుర్ర మధుసూదన్ రెడ్డి, గౌరవ అతిథులను సముచితంగా సన్మానించారు.

5న గుమ్లాపూర్ లో సీఎం సభ

- సీఎం పర్యటన ఏర్పాట్లపై సీపీ సమీక్ష
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి సభా ప్రాంగణ పరిశీలన

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 2: ఈ నెల 5న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కరీంనగర్ జిల్లాలో పర్యటించనున్నారు. సీఎం పర్యటన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం చొప్పదండి నియోజకవర్గంలోని గుమ్లాపూర్ సభా ప్రాంగణం, హెలిపాడ్ మరియు పార్కింగ్ స్థలాలను స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి పోలీస్ కమిషనర్ (సీపీ) క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభా ప్రాంగణ మ్యాప్ ఆధారంగా భద్రతా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, బారికేడ్ల నిర్మాణ శైలిని సీపీ పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన బారికేడ్ విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాలను డ్రోన్ కెమెరాల ద్వారా క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు మరియు భౌగోళిక పరిస్థితులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వివరించారు. సభకు వచ్చే వాహనాల కోసం కేటాయించిన పార్కింగ్ స్థలాలను పరిశీలించి, ట్రాఫిక్ జామ్ కాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ఎక్కడా చిన్నపాటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సీపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రెబల్ అభ్యర్థులపై బీజేపీ కొరడా

- 15 ఏళ్లపాటు పార్టీ నుంచి సస్పెన్షన్ హెచ్చరిక
- బి.ఫాం పొందిన అభ్యర్థుల గెలుపుకోసం శ్రమించాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు స్పష్టం

ప్రతిపక్షం బ్యూరో, ఉత్తర తెలంగాణ, ఫిబ్రవరి2: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు స్పష్టం చేశారు. బీజేపీ బి.ఫాం జారీ చేసిన అభ్యర్థులే ఎన్నికల బరిలో ఉండాలని, పార్టీ తరఫున నామినేషన్లు దాఖలు చేసి టికెట్ రాకపోయినా వెనక్కి తగ్గని నేతలు తక్షణమే తమ నామినేషన్లను ఉపసంహరించుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. అనేక సర్వే నివేదికలు, సామాజిక సమీకరణలు, పార్టీ వ్యూహాత్మక అంశాలను పరిగణనలోకి తీసుకొని గెలుపు అవకాశాలు ఉన్న అభ్యర్థులకే టికెట్లు ఖరారు చేసినట్లు తెలిపారు. టికెట్ దక్కని నాయకులు నిరాశ చెందడం సహజమే అయినప్పటికీ, పార్టీ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని క్రమశిక్షణ పాటించాలని సూచించారు. పార్టీ కోసం సంవత్సరాల తరబడి పనిచేసిన ప్రతి కార్యకర్తను బీజేపీ గుర్తుంచుకుంటుందని, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ సాధించిన ఘనవిజయాలకు కార్యకర్తల కృషే కారణమని ఆయన గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ఈ మున్సిపల్ ఎన్నికల్లో కూడా ప్రజల మద్దతుతో బీజేపీ విజయ పరంపర కొనసాగిస్తుందన్న పూర్తి విశ్వాసాన్ని రాష్ట్ర పార్టీ వ్యక్తం చేసింది. నామినేషన్లు వేసిన నాయకులందరూ వెంటనే ఉపసంహరించుకుని, తమ తమ డివిజన్లు, వార్డుల్లో బీజేపీ అధికారిక అభ్యర్థుల గెలుపుకోసం సమష్టిగా పని చేయాలని ఎన్.రామచంద్రరావు పిలుపునిచ్చారు. పార్టీ క్రమశిక్షణను అతిక్రమించి రెబల్ లేదా ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాంటి వారిని 15 సంవత్సరాలపాటు పార్టీ నుంచి సస్పెండ్ చేయడమే కాకుండా, భవిష్యత్తులో తిరిగి బీజేపీలోకి తీసుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టంగా తెలిపారు.

లక్ష్యసాధనకు విద్యార్థులు నిరంతర కృషి చేయాలి

- వ్యక్తిత్వ వికాస నిపుణుడు బాలాజీ

ప్రతిపక్షం, చిట్యాల, ఫిబ్రవరి 2: విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవడానికి నిరంతరం శ్రమించాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, 'విజయశిఖరం' రచయిత బాలాజీ చిర్రబోయిన బాలాజీ పిలుపునిచ్చారు. నల్గొండ జిల్లా చిట్యాలలోని పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బోడ సుశీల అధ్యక్షతన సోమవారం 'కెరీర్ గైడెన్స్' కార్యక్రమం జరిగింది. ముఖ్య వక్తగా విచ్చేసిన బాలాజీ మాట్లాడుతూ.. డబ్బు సంపాదనకు మార్గాలున్నా, గౌరవం మాత్రం చదువుతోనే లభిస్తుందని పేర్కొన్నారు. పట్టుదల, ఆత్మవిశ్వాసంతో శ్రమిస్తే విజయం తథ్యమని, విఫలమైనా మళ్ళీ గెలిచే అవకాశాలు ఉంటాయని ధైర్యం చెప్పారు. జనరల్ నాలెడ్జ్ లో ప్రతిభ చూపిన విద్యార్థులకు విజయ శిఖరం పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిలకరాజు శ్రీనివాస్, పద్మజ, కోణం శ్రీనివాస్, ఇందిర, సైదులు, ప్రసన్న, సాదిక్, సరళ, జానకి పాల్గొని బాలాజీని అభినందించారు.

అంబేద్కర్ వర్సిటీ డిగ్రీ పరీక్షలు వాయిదా

- తిరిగి ఫిబ్రవరి 17 నుంచి నిర్వహణ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 2 : డా. బీఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 11 న మున్సిపల్ ఎన్నికలను ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్నందున వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. వాయిదా పడ్డ ఈ డిగ్రీ మూడవ, రెండవ, మొదటి సంవత్సరం వేర్వేరు సెమిస్టర్ల పరీక్షలను తిరిగి ఈ నెల 17 నుండి మార్చ్ 10, 2026 వరకు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొ. భోజు శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, పరీక్షకు మూడు రోజుల ముందు విశ్వవిద్యాలయ వెబ్ పోర్టల్ www.braouonline.in లో హాల్ టికెట్స్ డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు వారి సంబంధిత ఆధ్యయన కేంద్రంలో, లేదా వెబ్ సైట్ www.braou.ac.in లో సంప్రదించొచ్చని సూచించారు.

ఎమ్మెల్యే సమక్షంలో బీ -ఫారాలు అందజేత

ప్రతిపక్షం, చిట్యాల, ఫిబ్రవరి 2: నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలోని చిట్యాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని వేగవంతం చేసింది. పోటీ చేస్తున్న అభ్యర్థుల కోసం కేటాయించిన బీ ఫారంలను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత సోమవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో చిట్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు జడల మల్లయ్య, సీనియర్ నాయకులు పోకల దేవదాస్, మారగోని ఆంజనేయులు గౌడ్, పాటి మాధవరెడ్డి, గుడిపాటి లక్ష్మీనరసింహలకు అందజేశారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు.

చిట్యాల మున్సిపల్ బీజేపీ అభ్యర్థుల ఖరారు

ప్రతిపక్షం, చిట్యాల, ఫిబ్రవరి 2: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు నల్గొండ జిల్లా, చిట్యాల మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఖరారు చేశారు. ఈ జాబితాలో రిజర్వేషన్ల ఆధారంగా 1 నుండి 12 వార్డులకు వరుసగా.... రుద్రవరం లింగస్వామి, గుండాల పవిత్ర, పాల శ్రీలత, నాగరాజు, ఈదుదుల నర్సమ్మ, గంజి గోవర్ధన్, దళ లక్ష్మమ్మ, మాస శ్రీనివాస్, కురెళ్ళ శ్రీను, కూనూరు సంజయ్ దాస్, దుద్దు భాగ్యమ్మ, అశ్విని నుంచు పోటీ చేయనున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీదే విజయం

- సంగారెడ్డి జిల్లా మున్సిపల్ ఎన్నికల సమన్వయకర్త పట్లోళ్ల, శశిధర్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 2 : మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో బీఆర్ఎస్ జండా ఎగరడం తథ్యం అని మెదక్ మాజీ ఎమ్మెల్యే, సంగారెడ్డి జిల్లా మున్సిపల్ ఎన్నికల సమన్వయకర్త పట్లోళ్ల శశిధర్ రెడ్డి అన్నారు. సోమవారం ఇస్నాపూర్ లో మున్సిపల్ ఎన్నికల సమీక్ష సమావేశంలో గడీల శ్రీకాంత్ గౌడ్ తో కలిసి ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలోని 11 మున్సిపాలిటీలలో అభ్యర్థుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరిపినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా రెబల్స్ బెడద లేకుండా సమన్వయం జరిపినట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి గడువు చాలా తక్కువగా ఉన్నందువల్లా బీఆర్ఎస్ అభ్యర్థులు సమయం వృధా కాకుండా ప్రచారం నిర్వహించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాల్లో విఫలమైన సందర్భాన్ని ప్రతి ఓటరుకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని సూచించారు. అంతేకాకుండా ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఏమయ్యాయి.? అంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులను ఎక్కడికక్కడ ఎండగట్టాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తే బీఆర్ఎస్ మున్సిపల్ వార్డు అభ్యర్థులు గెలవడం తథ్యం అని అన్నారు. ప్రచారం నిర్వహించుకోవడానికి కేవలం ఆరు రోజులే ఉన్నందున ప్రతి ఓటర్ ను కలిసి ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు. ఈనెల 16న అన్ని మున్సిపాలిటీలలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఈ సందర్భంగా పట్లోళ్ల శశిధర్ రెడ్డి తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఘనపూర్ మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్వీ నాయకులు మేరాజ్ ఖాన్, నాయకులు దుర్గయ్య, జోగు ధన్ రాజ్ ,రాము, లక్ష్మి కాంత్ రెడ్డి, దుర్గాసాయి పాల్గొన్నారు.

విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో నిరాశ

- ఏఐఎస్ఓ రాష్ట్ర కన్వినర్ జి. రమేష్ కుమార్

ప్రతిపక్షం, సిటీబ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 కేంద్ర బడ్జెట్ లో విద్యా రంగానికి కేటాయించిన నిధులు తీవ్ర నిరాశకు గురిచేశాయని ఏఐఎస్ఓ రాష్ట్ర కన్వినర్ జి. రమేష్‌కుమార్ అన్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే విద్యను నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరోసారి నిర్లక్ష్యం చేసిందని అన్నారు. విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిన కేంద్ర బడ్జెట్ ను అఖిల భారత విద్యార్థి సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ మొత్తం సుమారు ₹53.5 లక్షల కోట్లు కాగా, విద్యారంగానికి కేటాయించిన మొత్తం కేవలం ₹1.39 లక్షల కోట్లు మాత్రమే, అంటే మొత్తం బడ్జెట్ లో సుమారు 2.6% మాత్రమే కేటాయించారని, ఇది ప్రపంచంలో అత్యధికంగా ఉన్న యువత, విద్యార్థులు గల దేశానికి పూర్తిగా సరిపోని అన్నారు. కేంద్ర బడ్జెట్లో కనీసం 10%, జీడీపీలో 6 శాతం నిధులు కేటాయించాలని అనేక సంవత్సరాలుగా విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నా కూడా ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం విద్యారంగాన్ని నిర్లక్ష్యాన్ని గురి చేయడమేనని అన్నారు. స్వయంగా కేంద్ర ప్రభుత్వమే తీసుకొచ్చిన విద్యార్థి వ్యతిరేక జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ 2020) ప్రకారం విద్యపై జీడీపీలో కనీసం 6% ఖర్చు చేస్తామని చెప్పారు. వారు చెప్పిన దాని ప్రకారం అయినా నిధుల కేటాయింపు లేవని మండిపడ్డారు. అంటే విధాన ప్రకటనలు ఒకవైపు, నిధుల కేటాయింపులు మరోలా ఉండడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని స్పష్టంగా చూపిస్తోందన్నారు.

ప్రభుత్వ విద్యకు మొండి చెయ్యి

ప్రభుత్వ పాఠశాలలు, గ్రామీణ విద్య, లక్షల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల నియామకాలు, స్కాలర్‌షిప్‌లు వంటి మౌలిక అవసరాలపై తగిన నిధులు కేటాయించలేదని, ఐఐటీ, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో చదువుకునే విద్యార్థులకు ఫీజులను నియంత్రించలేదన్నారు. స్కాలర్షిప్లు పెంచలేదు, పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు తీసుకొచ్చి విద్యార్థులపై ఆర్థిక భారాన్ని పెంచుతున్నారని అన్నారు. దీనివల్ల పేద, దళిత, ఆదివాసీ, వెనుకబడిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతారని రమేష్‌కుమార్ అన్నారు. ఏఐ, స్కిల్ డెవలప్‌మెంట్ , కంటెంట్ క్రియేషన్ వంటి మార్కెట్ ఆధారిత రంగాలపై మాత్రమే దృష్టి పెట్టడం వల్ల విద్యలో అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, పేద విద్యార్థుల కోసం ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫెలోషిప్‌లను పెంచకపోగా కోతలు విధిస్తున్నారని, ఇది సామాజిక న్యాయంపై నేరుగా దాడి చేయడమేనని అన్నారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్రానికి రావలసిన సైనిక్, నవోదయ స్కూల్స్, ఐఐఎం, ఐఐటీ, సెంట్రల్ యూనివర్సిటీల ఏర్పాటుపై కనీస ప్రకటన లేకపోవడం తెలంగాణ విద్యార్థి లోకాన్ని మోసం చేయడమేనని అన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ సమీర్, ఏఐఎస్ఓ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ధనుంజయ్, సాయి కృష్ణ, శివకుమార్, ఆదిత్య, కందూరు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సైకిల్ పంపిణీ

- నిరుపేద విద్యార్థినికి విద్యాభివృద్ధి కోసం సహాయం

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 2: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమంలో భాగంగా శిశుమందిర్‌లో విద్యనభ్యసిస్తున్న ఆర్యవైశ్య నిరుపేద విద్యార్థిని శివతపశ్వినికి సైకిల్ పంపిణీ చేశారు. విద్యార్థిని పాఠశాలకు సులభంగా, సమయానికి చేరుకునేందుకు ఈ సైకిల్ ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్బా అరుణ విద్యార్థినికి సైకిల్‌ను అందజేశారు. సైకిల్ అందుకున్న శివతపశ్విని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా అమ్మాయి తండ్రి, తమ కుమార్తె చదువు కొనసాగేందుకు ఈ సహాయం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారి జంధ్యం మాధవి , జంధ్యం మధుకర్ పాల్గొని, విద్యార్థిని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సేవా కార్యక్రమాలు సమాజంలో విద్యాభివృద్ధికి దోహదపడుతున్నాయని వారు ప్రశంసించారు.

“



రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతోంది. బందిపోట్ల మాదిరి టీడీపీ తమ నేతల ఇళ్లపై దాడులు చేస్తోంది. చంద్రబాబు, లోకేశ్ ఆదేశాలతో అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై పోలీసుల సమక్షంలోనే గూండాలు దాడి చేశారు. లడ్డూ అంశంలో దొరికిపోవడంతో చంద్రబాబు ఇలా చేస్తున్నారు. తాము అధికారంలోకి వచ్చాక చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ తప్పని సరిగా ఇస్తాం.
- వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రాంతీయం

తెలంగాణకు మేలు చేసే బడ్జెట్

- ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 2: పార్లమెంట్ లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ తెలంగాణ ను మేలు చేసేలా ఉందని ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా రామచంద్ర పురంలోని ఆయన నివాసంలో ఆయన మాట్లాడుతూ..'ఉపాధి అవకాశాలను, మౌలిక వసతులకు పెద్దపీట వేసిన బడ్జెట్ అని అన్నారు. నవ భారత యువత భవిష్యత్ కు పెట్టుబడి ఈ బడ్జెట్ అని కొనియాడారు. 'వికసిత్ భారత్' లక్ష్యం గా తెలంగాణ రాష్ట్రానికి ఈ బడ్జెట్ గర్వకారణమని, హైదరాబాద్‌కు 3 హైస్పీడ్ రైల్ కారిడార్ల ప్రకటనతో రాష్ట్రం జాతీయ వృద్ధి యంత్రంగా మరింత బలపడనుందని అన్నారు. ఆత్మనిర్భర్ భారత్ దృష్టితో రూపొందిన ఈ బడ్జెట్ దేశీయ తయారీ రంగానికి ఊతమివ్వడంతో పాటు, ఇంధన, రక్షణ రంగం భద్రతను బలోపేతం చేస్తోందని, దిగుమతులపై ఆధారాన్ని ఉపాధి సృష్టి, వ్యవసాయ ఉత్పాదకత పెంపు, కొనుగోలు శక్తి వృద్ధి, నాణ్యమైన విద్యవైద్య సేవల విస్తరణకు ఈ బడ్జెట్ బలమైన పునాదిని వేస్తోందన్నారు. ఈ విధానాలతో దేశం సుమారు 7 శాతం వృద్ధి రేటుతో ముందుకు సాగుతోందని, ప్రజల సంక్షేమం, రైతుల సౌభాగ్యం, మహిళల సాధికారత, యువత ఆశయాల సాధనకు అన్నిరంగాల అభివృద్ధి, సంక్షేమాని అనుగుణంగా ఉందన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి కావాల్సిందే
- త్వరలో మినీ ఫంక్షన్ హాళ్లు, కమ్యూనిటీ హాళ్ల ప్రారంభం
- జిహెచ్ఎంసి సమీక్షా సమావేశంలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 2: పటాన్ చెరు, అమీన్ పూర్ బల్దియా సర్కిల్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని నాణ్యత ప్రమాణాల్లో రాజీ పడకుండా నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు. సోమవారం పటాన్ చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జి హెచ్ఎంసి, రెవెన్యూ, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో జరిగిన సమీక్ష సమావేశం లో ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్ చెరు, అమీన్పూర్ సర్కిల్ల పరిధిలోని డివిజన్లో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతి ని వేదికలపై చర్చించారు. ప్రధానంగా మినీ ఫంక్షన్ హాళ్లు, కమ్యూనిటీ హాళ్లు, ఇండోర్ స్టేడియం, అంతర్గత మురుగునీటి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులలో వేగం పెంచాలని సూచించారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలో నిర్మిస్తున్న వార్డు కార్యాలయాన్ని ప్రత్యేకతను పూర్తి చేయాలన్నారు. ముత్తంగి డివిజన్ పరిధిలోని పాటి గ్రామ పరిధిలోగల వివేకానంద స్టేడియం అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 27 కోట్ల రూపాయలు మంజూరు చేశాయని, పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టెండర్లు పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు.పటాన్ చెరు డివిజన్ పరిధిలో రెండు ఎకరాల విస్తీర్ణంలో స్లాటర్ హౌస్ (పశు వధశాల) నిర్మించబోతున్నట్లు తెలిపారు. 10 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఆధునిక వసతులతో నూతన టెక్నాలజీతో నిర్మాణం చేయబోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూములలో లేఔట్లు, అనుమతి లేని నిర్మాణాలు, అక్రమంలో కొనసాగకుండా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తూ కబ్జాదారుల పైన ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో పటాన్ చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, పటాన్చెరు ఎమ్మార్వో హరిబాబు, రామచంద్రపురం తహసిల్దార్ సరస్వతి, విద్యుత్ శాఖ డిఈ భాస్కరరావు, నీటిపారుదల శాఖ ఈఈ భీమ్, డిఈ రామస్వామి, జిహెచ్ఎంసి ఈఈ సురేష్, డిఈ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ కాంగ్రెస్ అభ్యర్థులకు బిఫారాలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 2 : జహీరాబాద్ నారాయణ్ ఖేడ్ మున్సిపాలిటీ లలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులకు సంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి బిఫారాలు అందజేశారు. అభ్యర్థులు తమ బిఫారాలు సమర్పించేందుకు మంగళవారం చివరి రోజు కావడంతో సోమవారం కాంగ్రెస్ అభ్యర్థులకు బి ఫారాలు పంపిణీ చేశారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి అజారుద్దీన్ సమక్షంలో నిర్మలా జగ్గారెడ్డి నారాయణ్ ఖేడ్ , జహీరాబాద్ మున్సిపాలిటీ బిఫారాలు అందజేశారు. నారాయణ్ ఖేడ్ మున్సిపాలిటీ కి సంబంధించిన బిఫారాలను ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, జహీరాబాద్ ఎంపి సురేష్ శెట్కార్ లకు డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి అందజేశారు. జహీరాబాద్ బి ఫారాలను నియోజవర్గ ఇంచార్జ్ చంద్ర శేఖర్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి లకు ఆమె అందించారు.

'గీతం'లో త్యాగరాజ ఆరాధన

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 2 : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లలిత, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాజ ఆరాధన - 2026 వేడుకలను సంగీత కార్యక్రమాల ద్వారా ఘనంగా నిర్వహించి, ఆయనకు ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, కర్ణాటక సంగీతాన్ని ఓపెన్ ఎలక్టివ్ గా, మైనర్ ప్రోగ్రామ్ గా ఎంపిక చేసుకున్న విద్యార్థులు త్యాగరాజ కీర్తనలను హృద్యంగా ఆలపించారు. వారికి వయోలిన్ పై మహావాది వాసు, మృదంగంపై ఎం.చంద్రకాంత్ సహకారం అందించగా, వారి సహకారం ప్రదర్శన ఆధ్యాత్మిక లోతును, సంగీతంపై శ్రద్ధను పెంచాయి. తొలుత ఈ ప్రదర్శన ఆనందు మురళి, మృదు రవళిల 'ఎందరో మహానుభావులు' తో ఆరంభమై, ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. ఆ తరువాత మృదు రవళి ఒంటరిగా 'నమో నమో రాఘవ', 'మనవ్యాలకించర..', 'బాల కనక మయా..', ఆ తరువాత చారుకేశి రాగం, అంతకు మించి ఆలాపన, తాళం, పల్లవిల మేళవిందు, వాద్య సహకార జుగల్ బందీతో అలరించారు. 'ఆడమోదిగలడే , 'హరిదాసులు వెడలె ముచ్చటకని వంటి చక్కని పాటలతో ప్రేక్షకులను మైమరించారు. ఇక విద్యార్థులు 'రామా కోదండ రామా కళ్యాణ రామా, గంధము పూయరుగా పన్నీరు గంధము పూయరుగా ప్రదర్శనలు ప్రేక్షకుల మన్ననలను చూరగొని, కరతాళ ధ్వనులతో వేదిక మార్మోగింది. ఈ ప్రదర్శనలు త్యాగరాజ కవి యొక్క ఆధ్యాత్మిక లోతును, సంగీత వారసత్వాన్ని అద్భుతంగా ఆవిష్కరించాయి. శాస్త్రీయ సంగీతం, నృత్యం, సంప్రదాయాన్ని మేళవించి, నిర్వహించిన ఈ ఆరాధన సుసంపన్నమైన సాంస్కృతిక అనుభవాన్ని అందించడమే గాక, మనదేశ గొప్ప కళాత్మక వారసత్వాన్ని కాపాడటానికి గీతం యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించింది. లలిత, ప్రదర్శన కళల విభాగం సమన్వయకర్త డాక్టర్ వై.లలితా సింధూరి పర్యవేక్షణలో, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆనందు మురళి, దర్భా మృదురవళి ఈ ఆరాధనా కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

రేగా కాంతారావు పై చర్యలు తీసుకోవాలి

- గుండాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల డిమాండ్

ప్రతిపక్షం, గుండాల, ఫిబ్రవరి 2: తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం సిట్ విచారణకు హాజరైన సందర్భంగా, పినపాక నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మణుగూరు పట్టణ కేంద్రంలో నల్ల జెండాలతో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా, అధికారం లోకి వస్తే ఒక్కొక్కరి సంగతి చూస్తామని బెదిరింపులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని గుండాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు.గతంలో గౌరవప్రదమైన పదవిని నిర్వహించిన వ్యక్తి నుంచి ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు రావడం సరికాదని, ఇది ప్రజాస్వామ్య దేశమని, ప్రజల కోసం ప్రజా అవసరాల దృష్ట్యా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నప్పటికీ, అది హద్దులు దాటకూడదని పీఎస్ఆర్ పీవీఆర్ యువసేన కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఎస్.కె. ఖదీర్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ కి అప్రజాస్వామిక వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే కాంగ్రెస్ నాయకులకు తగిన రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుండాల మండల ఏఎంసీ డైరెక్టర్ ఊకే బుచ్చయ్య, సీనియర్ నాయకులు పొంబోయిన ముత్తయ్య, మండల నాయకులు వాంకుడోత్ బీకోజీ, వాంకుడోత్ రమేష్, ఊకే బాబురావు, ఎస్కే వాజిద్ పాషా, ఎస్కే ఖాసీం, అరెం నర్సింహారావు, పల్లపు రాజేష్, నూనావత్ రవి, సనప రాంబాబు, బానోత్ నరేందర్, గడ్డం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శిఖం భూమి ఆక్రమణపై తహసీల్దార్ కు వినతి

ప్రతిపక్షం, గుండాల, ఫిబ్రవరి 2: మండలంలోని అక్రమంగా ఆక్రమించుకున్న మోద్గులకుంట శిఖం భూములను తక్షణమే స్వాధీనపర్చుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ.మోద్గులకుంట శిఖం భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని దీనిపై రెవిన్యూ యంత్రాంగం సర్వే నిర్వహించి ఆ ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పూనెం శ్రీను, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతా వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు వజ్జా ఎర్రయ్య, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు వీసీ దొర తదితరులు పాల్గొన్నారు.

12 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గోవింద్ రాజ్

ప్రతిపక్షం, నారాయణపేట్, ఫిబ్రవరి 2: కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్ లకు నిరసనగా ఈ నెల 12న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గోవిందరాజ్ పిలుపునిచ్చారు. సోమవారం మక్తల్ పట్టణ కేంద్రంలో మండల విద్యాధికారికి మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులను ఉద్దేశించి గోవింద్ రాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, పారిశ్రామిక, విధానాల వల్ల ప్రజలు కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి జాతీయ కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు 2026 ఫిబ్రవరి 12 న ఒకరోజు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. 29 కార్మిక పట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు అమల్లోకి తెస్తూ 2025 నవంబర్ 21 న ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం 2025 ను ఉపసరించుకోవాలని, పేదలకు పని గ్యారంటీ కల్పిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని కొనసాగించాలని, పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు 26వేల రూపాయలు పెంచాలని, మిడ్ డే మిల్స్ వర్కర్స్ ఎగ్గు రేట్లు పెంచాలని తదితర డిమాండ్లపై కేంద్ర కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో దేశవుత సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నామని హక్కులపై నిరంతర దాడి కొనసాగించేందుకు తీసుకొస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కేంద్ర బిజెపి తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడులకు వ్యతిరేకంగా కనీస వేతనాలు అమలుకై ఫిబ్రవరి 12న పోరుబాట పట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కవిత, రాజమ్మ, అమీనా, అభిబి, ఆ మీద బేగం, లక్ష్మి, అలివేలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల కోసం పరితపించిన కనకం యాదగిరి

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 2: హసన్ పర్తి ప్రాంతంలో అంబేద్కర్ భావజాలాన్ని ఆయా గ్రామాలకు తీసుకువెళ్లి ప్రజల్ని చైతన్య పరిచిన వ్యక్తి కనకం యాదగిరి అని పలువురు వక్తలు కొనియాడారు. గత ఐదు రోజుల క్రితం హసన్ పర్తి లో మరణించిన వ్యక్తి కనకం యాదగిరి గారి చిత్రపటానికి పూలమాల వేసి సంతాప సభ సోమవారం రోజు వారి స్వగృహంలో జరిగింది మీ సంతాప సభకు ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరెపల్లి పవన్ సభ అధ్యక్షత వహించారు ఈ సంతాప సభలో పాల్గొన్న వక్తలు ప్రసంగిస్తూ ఒకపక్క ఉపాధ్యాయ వృత్తి కొనసాగిస్తూనే మరోపక్క సామాన్య ప్రజానీకం కోసం వారి బాగోగుల కోసం పరితపించిన వ్యక్తి అని యాదగిరి సేవలను కొనియాడారు. హసన్ పర్తి మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షునిగా ఆయన చేసిన సేవలు పలువురు నాయకులు కొనియాడారు. ఈ సంతాప సభలో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు రౌత్ రమేష్ కుమార్. కాంగ్రెస్ నాయకులు పెద్దమ్మ నరసింహారాములు విసం సురేందర్ రెడ్డి గొర్రె కిరణ్ కుమార్ బిగుల్ల సురేష్ టిఆర్ఎస్ నాయకులు కందుకూరు చంద్రమోహన్ ఎమ్మార్పీఎస్ నాయకులు మేకల రమేష్ పోతరాజు వీరస్వామి మాల మహానాడు జిల్లా నాయకులు గరిగే అనిల్ అంబేద్కర్ సంఘం నాయకులు తాళ్ల రవిపాల్ సంతాప సభలో కుటుంబ సభ్యులు కనకం రంజిత్ కనకం కార్తీక్ కుమార్తెలు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 2: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన వినతులను నిర్ణీత గడువులో పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ప్రజలు వినతి పత్రాలు సమర్పించి తమ సమస్యలను వివరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, హౌజింగ్, విద్యుత్, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 91 వినతులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలు సీరియస్‌గా పరిగణించి పక్షం రోజుల్లోగా తీసుకున్న చర్యలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్‌ను ఆదేశించారు. పరిష్కరించిన ప్రతి దరఖాస్తుకు సంబంధించిన పూర్తి వివరాలను డీఆర్‌ఓకు అందజేయాలని అధికారులను సూచించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, హాస్టల్స్‌ను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించాలని ఆదేశించారు. ప్రత్యేక శిక్షణ తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయులు - అధ్యాపకుల పనితీరు తదితర అంశాలపై నివేదిక సమర్పించాలని తెలిపారు. అలాగే హాస్టల్స్‌లో ఏర్పాటు చేసిన ఫిర్యాదు పెట్టెలను పరిశీలించి, అందులో వచ్చిన ఫిర్యాదులను నమోదు చేసి సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. హాస్టల్స్‌లో శుద్ధమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం, తాజా కూరగాయలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.స్టూడెంట్ వెల్నెస్ కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి సారించి, 8వ తరగతి నుండి 12వ తరగతి వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఆర్టీఐ ఫిర్యాదుల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ, సంబంధిత శాఖల పీఐఓలతో డీఆర్‌ఓ ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, డీఆర్డీవో మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

“

రెడ్ బుక్ రాజ్యాంగంతో లోకేశ్ నన్ను మట్టుబెట్టాలని చూస్తున్నారు. నాకు ఏదైనా జరిగితే ఆయనదే బాధ్యత. లోకేశ్ ఆదేశంతో ఎంపీ చిన్ని రౌడీలతో నా ఇంటిపై దాడి చేయించారు. దాడికి ముందు టీడీపీ నేతలతో డీసీపీ, సీఐ చర్చించారు. టీడీపీ గూండాలు ర్యాలీగా పెట్రోలు సీసాలు, కర్రలతో వస్తుంటే వారికి పోలీసులు ఎస్కార్ట్‌గా వచ్చారు. ఇలాగే కొనసాగితే ప్రజలు తిరగబడక మానరు.

- ఏపీ మాజీ మంత్రి జోగి రమేశ్

మృత్యు భయం చూపి ముంచేశారు

- లంకె బిందెల పేరుతో లక్షల దోపిడీ!
- అంతర్ జిల్లా మాయగాడి అరెస్ట్
- 7 లక్షల నగదు, విలాసవంతమైన కార్లు స్వాధీనం
- జిల్లా ఎస్పి యం రాజేష్ చంద్ర వెల్లడి

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఫిబ్రవరి 2: ఇంట్లో వాస్తు దోషం ఉందని, ఎవరో ఒకరు చనిపోతారని భయపెట్టి లక్షలు దోచుకున్న నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత నెల 26 నాడు హొన్నజిపేట్ గ్రామం, ధర్పల్లి మండలం నిజామాబాద్ జిల్లా కు చెందిన దుమ్మల్ల బీరవ్వకు ఒక వ్యక్తి వాస్తు, క్షుద్ర పూజలు, అతీంద్రియ శక్తులున్నాయని నటిస్తూ, ఇంట్లో "లంకె బిందెలు" ఉన్నాయని, అవి తీసివేయకపోతే కుటుంబంలో మరణం సంభవిస్తుందని భయపెట్టి, పూజల పేరుతో బెదిరించి మొత్తం ₹8,20,000/ తీసుకొని మోసం చేశారు. డబ్బులు తీసుకున్న అనంతరం నిందితులు ఫోన్‌లకు స్పందించకుండా తప్పించుకున్నారని ఫిర్యాదు మేరకు కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించడం జరిగింది. పిర్యాదురాలు ఇచ్చిన సమాచారం మేరకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలంకి చెందిన కడమంచి నర్సింలుతో పాటుగా మరో ఇద్దరు వ్యక్తులు కలిసి అమాయక ప్రజలను మూఢనమ్మకాల పూజలు ద్వారా భాదలు తొలుగుతాయని నమ్మించి బంగారం నిధులు తీసి దానికి లక్షలు నగదు ఆన్లైన్ ద్వారా డబ్బులు లాగుతున్నారని నిర్ధారణకు రావడం జరిగింది. వీరు గత సంవత్సరములో అక్టోబర్ నెలలో భిక్షాటన పేరుతో చిన్న మల్లారెడ్డి గ్రామానికివెళ్లీ అక్కడ లాస్య అనే వారి కుటుంబంలో ఆరోగ్య సమస్యలు ఉన్నట్టు ముందుగా తెలుసుకొని లాస్య సోదరుడు సురేష్‌కు కిడ్నీ వ్యాధి, తల్లికి కూడా అనారోగ్య సమస్యలు ఉన్నట్టు వారికి ముందుగానే చెప్పడం ద్వారా వారి వద్ద నమ్మకం సంపాదించాడు. అనంతరం, వారి ఇంట్లో "లంకె బిందెలు" ఉన్నాయని, వాటి కారణంగా అనారోగ్యాలు వస్తున్నాయని అవి తీసివేయకపోతే కుటుంబంలో ఎవరో ఒకరు చనిపోతారనిభయపెట్టి ₹14,00,000/వరకు ఖర్చు అవుతుందని చెప్పి 2,93,000/ తీసుకున్నారు. వీరు ముగ్గురు కలసి సదాశివనగర్ మరియు జనగామ జిల్లా కోడకండ్ల పోలీసు స్టేషన్ పరిదిలో నేరాలు చేసినట్లు తెలిసినది. పరరారీలో ఉన్న ఇద్దరినీ కూడా త్వరలో పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. ప్రజలు ఇలాంటి మూఢనమ్మకాల మాటలు నమ్మవద్దని ఎవరైనా ఈ విధంగా భయపెడితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు గాని లేదా డయల్ 100 కి గాని సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లాలో ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పి తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం విద్యార్థులకు అందించాలి

- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 2: కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటిస్తూ విద్యార్థుల హాజరు ప్రకారం ఆహారం సరిపోయే విధంగ రుచికరంగా వండాలని, పిల్లలకు మరల అన్నం కూరలు వారు కూర్చున్న వద్దకు వెళ్లి వడ్డించాలని వంట సిబ్బందిని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. సోమవారం పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పిల్లలకు భోజనం లో నెయ్యి వడ్డించాలని వంట సిబ్బందిని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్ ను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు సరుకులు ఇవ్వగానే రాయాలని ఒకే సారి రాస్తాను అని నిర్లక్ష్యం వహించకూడదని హెచ్చరించారు. విద్యార్థులతో ఆప్యాయంగా పలకరిస్తూ ఆహారం బాగా నమిలి తినాలని తినేటప్పుడు మాట్లాడకూడదని, ఆహారం సరిపోయేంత తింటేనే శారీరకంగా దృఢంగా ఉంటారని, రోజు చదువుతో పాటు ఆటలు సైతం ఆడాలని విద్యార్థులకు తెలిపారు. పిల్లలకు భోజనం, వసతి, చదువు విషయం లో రాజీ పడవద్దని మంచి క్రమశిక్షణ తో విద్యాబుద్ధులు నేర్పించాలని ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయుల కు సూచించారు.

పాప ప్రాణాలపైకి తెచ్చిన పదవీ వ్యామోహం

- బాలికను చంపిన తండ్రి, సర్పంచ్ అరెస్టు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 2: ఓ పదవీ వ్యామోహం కన్నబిడ్డ అని కనికరం లేకుండా చేసింది. పదవీ కొరకు ఆ కసాయి తండ్రి కన్నబిడ్డ అని చూడకుండా ప్రాణాలను తీసి కటకటాల పాలయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి సోమవారం ఎడపల్లి పోలీసే స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..కెరుర్ గ్రామానికి చెందిన కొండమంగలే పాండురంగ అనే వ్యక్తి మంగలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక బాబు ఉన్నాడు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కొండ మంగలే గ్రామ సర్పంచ్గా పోటీ చేసే పనిలో ఉన్నాడు. కానీ, ముగ్గురు సంతానం ఉన్నవారు పోటికి అనార్హులు అవుతారని భావించాడు. దాంతో బాబును ఎవరికైనా దత్తత ఇద్దామనుకోగా అప్పటికే బాబుకు బర్త్ సర్టిఫికేట్ ఉండటంతో పూణేలో కార్పొరేషన్ ఆఫీసుకు వెళ్లి బర్త్ సర్టిఫికెట్ మార్చాలని ప్రయత్నం చేయగా సాధ్యపడలేదు. దాంతో ఇంటికి వచ్చి గ్రామ ప్రస్తుత సర్పంచ్ గణేష్ షిండేతో కలిసి పెద్ద కూతురు చిన్నారి ప్రాచీ(6)ను చంపేసి ఆమె తప్పిపోయినట్లుగా చెప్పాలని కుట్ర పన్నారు. అందులో భాగంగా గత నెలా 29న తండ్రి గ్రామ సర్పంచ్ తో కలిసి తన కూతురు ప్రాచీకి మాయమాటలు చెప్పి తన బైక్పై ఎక్కించుకుని బోధన్ మీదుగా ఎడపల్లి వరకు వచ్చి ఏఆర్పి క్యాంప్ శివారు నిజాంసాగర్ డీ 46 కెనాల్ వద్ద బైక్ను ఆపి కూతురు బతికి ఉండగానే కెనాల్లోకి తోసివేసి పారిపోయారు. అనంతరం పాప మృతదేహం బయట పడటంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ జరిపి పాపను చంపేసిన తండ్రిని అతనికి సహకరించిన గ్రామ సర్పంచ్ను పోలీసులు అరెస్టు చేసినట్లు సీపీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ, రెంజల్ ఎస్సై చంద్రమోహన్, ఏఎస్సై బాబురావు, కానిస్టేబుళ్లు సుధీర్, శ్రీకాంత్లను సీపీ అభినందించి రివార్డులను ప్రధానం చేశారు.

ప్రభుత్వ పాఠశాల టాపర్లకు శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్

రూ.2.2 కోట్ల నగదు బహుమతులు

- అదనపు కలెక్టర్ నగేష్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి 2: తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించాలని శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ నిర్ణయించిందని అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రోత్సహిస్తూ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వారు బహుమతుల ప్రధానం గోడపత్రికలను సోమవారం మెదక్ కలెక్టరేట్ లో డిఆర్డిఓ శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి. రాజిరెడ్డి, శ్రీరామ్ బ్రాంచ్ మేనేజర్ రత్నాకర్ లతో కలసి అదనపు కలెక్టర్ నగేష్ ఆవిష్కరించారు.ఈ ఏడాది (2026)లో ప్రభుత్వ పాఠశాలల నుంచి 10వ తరగతి బోర్డు పరీక్షలు రాసే విద్యార్థుల్లో టాపర్లకు రూ.2.2 కోట్ల నగదు బహుమతులను ప్రకటించిందని ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర స్థాయిలో స్టేట్ ఫస్ట్ వచ్చిన విద్యార్థికి రూ.5 లక్షలు, రెండో స్థానం వచ్చిన విద్యార్థికి రూ.3 లక్షలు, ప్రతి జిల్లా టాపర్ కు రూ.2 లక్షల చొప్పున, ప్రతి నియోజక వర్గ టాపర్‌కు రూ.ఒక లక్ష చొప్పున, 612 మండలాల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థికి రూ.10 వేల నగదు అందజేయనున్నట్టు వెల్లడించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ సేవా దృక్పథం హర్షనీయమని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కొనియాడారు. లక్ష్యాలు సాధించిన విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, మెదక్, జూనియర్ మేనేజర్ రాజేంద్రప్రసాద్,మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ శ్రీకాంత్ రవి కుమార్ తదితరులు ఉన్నారు.

అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

ప్రతి పక్షం, దౌల్తాబాద్, ఫిబ్రవరి 2: పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడినంత కూరగాయలు అందించాలని విధుల్లో నిర్లక్ష్యం వస్తే అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. సోమవారం ఇందుప్రియ గ్రామంలో గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫార్మసీ స్టోర్, ల్యాబ్,ఇంజక్షన్ గదులను పరిశీలించారు. లోపల పరిశుభ్రత పాటించాలని రోగులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని మెడికల్ ఆఫీసర్ ను ప్రదర్శించారు. కంటి చూపు సమస్య కొరకు పిహెచ్సికి వచ్చిన వృద్ధునితో మాట్లాడుతూ. దృష్టి లోపం ఎక్కువగా ఉంటే జిజిఎచ్ కి పంపించాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. ఆకుకూరలు బాగా తినాలని, రాగి జావా తాగాలని ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకోవాలని రోగులకు సూచించారు. పి హెచ్ ప్రాంగణంలో చెట్లకు నీరు పోసి శుభ్రం చేయించాలని తెలిపారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో ఒకే కూర టమాటా పప్పు, హైస్కూల్ లో పప్పుతో పాటు ఆలుగడ్డ టమాటా సరిపడినంత వండలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు ప్రకారం వంట చెయ్యాలి గానీ మీ ఇష్టానుసారంగా వండి పిల్లలకు ఏదో కూరతో తింటారు కదా అని నిర్లక్ష్యం వహిస్తారని ప్రిన్సిపల్ పైన మండి పడ్డారు. విద్యార్థులు హాజరు ప్రకారం కూరలు సరిపడినంత వండనందుకు ప్రిన్సిపల్ పైన యాక్షన్ తీసుకోవాల్సిందిగా డీఈఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని విద్యార్థులకు సరిపడినంత కూరగాయలు అందించాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కిచెన్ గార్డెన్ పరిశీలిస్తూ కొత్తిమీర, తోటకూర, మెంతికూర ఇలా ప్రతిదీ రోజు కూరల్లో వాడాలని గార్డెన్ లో కలుపు తీసి రోజు నీర పెట్టాలని వంట సిబ్బందినీ ఆదేశించారు. కలెక్టర్ కార్యక్రమంలో ఎంఈఓ గజ్జల కనకరాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ బోణీ 32వ వార్డు ఏకగ్రీవం

- రెండోసారి కౌన్సిలర్ గా గోదల మానస సాయిరాం

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ ఫిబ్రవరి 2: మెదక్ మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ ఖాతా తెరిచింది. అధికార ప్రతిపక్ష పార్టీల ఊహాత్మకంగా ముందుకు వెళ్తున్నాయి. రెండు పార్టీలు సాధ్యమైనంతవరకు కౌన్సిలర్లను గెలిచి మెదక్ మున్సిపల్ పై జెండా ఎగురవేయాలని. సాధ్యమైనంత వరకు కౌన్సిలర్ స్థానాలను ఏకగ్రీవంగా ఎన్నుకునే విధంగా ప్రణాళికను రూపొందిస్తున్నారు. మున్సిపాల్టీలోని 32 వ వార్డును ఏకగ్రీవం చేశారు. మున్సిపాలిటిలో 32 వార్డులు ఉండగా, 32వ వార్డు నుంచి గోదల మానస సాయిరాం ఏకగ్రీవమయ్యారు. 32వ వార్డులో కాంగ్రెస్ నుంచి గోదల మానస సాయిరాం నామినేషన్ వేసి బరిలో నిలువగా, బీఆర్ఎస్ నుంచి ప్రత్యర్థులు గోదల జ్యోతి కృష్ణ బరిలో నిలిచారు. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు చొరవతో గోదల జ్యోతి తమ నామినేషన్ ను ఉపసంహరణకు అంగీకరించింది. దీంతో గోదల మానస సాయిరాం రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికకావడం జరిగింది.మెదక్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలో మొత్తం 75 వ వార్డులకు గాను 415 నామినేషన్లు వచ్చాయి.

బైక్ దొంగ అరెస్ట్.. మూడు బైక్‌ల రికవరీ

- మెదక్ టౌన్ సిఐ మహేష్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి 2: మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ద్విచక్ర వాహన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈ సందర్భంగా మెదక్ టౌన్ సిఐ మహేష్ కేసు వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించారు. నర్సిములు అనే వ్యక్తి పని నిమిత్తం మెదక్‌కు వచ్చి, ఆటో నగర్‌లోని వనదుర్గ భవాని వైన్స్ షాప్ ముందు తన ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేయగా, గుర్తు తెలియని వ్యక్తి బైక్‌ను దొంగిలించాడు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. సోమవారం బోధన్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో, ఒక వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తూ పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా అనుమానం వచ్చి పట్టుకుని విచారించారు. విచారణలో అతని పేరు కమ్మరి రాములుగా గుర్తించినట్లు చెప్పారు. విచారణలో అతడు పలు ద్విచక్ర వాహనల దొంగతనలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. అతడు గతంలో కూడా మెదక్, రామాయంపేట పరిసర ప్రాంతాల్లో అనేక ద్విచక్ర వాహన దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి వచ్చిన పాత నేరస్తుడని వివరించారు ..అతనిపై మెదక్ మరియు రామాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు ఆరు కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుండి మొత్తం మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు సిఐ పేర్కొన్నారు.

హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలి

- మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి
- సిద్దిపేటలో కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, ఫిబ్రవరి 2: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డిలు అన్నారు. సిద్దిపేట పట్టణం 7వ వార్డులో వివిధ వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పెట్టిన హామీలను గుర్తుచేస్తూ 'కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఆరోపించారు. గత 25 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రైతు భరోసా కింద ఒక్కో రైతుకు రెండు లక్షల రూపాయల వరకు బాకీ పడిందన్నారు. వరి పంట బోనస్‌గా ఎకరాకు రూ.12,500 చొప్పున ఇప్పటి వరకు రూ.50 వేల వరకు రైతులకు బాకీ ఉందన్నారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాల హామీతో పాటు నిరుద్యోగ భృతి కింద 24 నెలలకు రూ.96 వేల బాకీ ఉందని తెలిపారు. ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున ఇప్పటివరకు రూ.24 వేల బాకీ ఉందన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున 24 నెలలకు రూ.62,500 బాకీ ఉందని పేర్కొన్నారు.వృద్ధులు, బీడీ కార్మికులకు నెలకు రూ.4,000 పెన్షన్ హామీతో 24 నెలలకు సుమారు రూ.50 వేల బాకీ, దివ్యాంగులకు నెలకు రూ.6,000 చొప్పున 24 నెలలకు రూ.50 వేల వరకు బాకీ పడిందన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆడబిడ్డల పెళ్లికి తులం బంగారం హామీ ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. విద్యార్థులకు స్కూటీ ఇస్తామన్న హామీ పత్తా లేకుండా పోయిందని, రూ.8,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12,000 చొప్పున ఇప్పటివరకు రూ.24,000 బాకీ ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో 7వ వార్డు బీఆర్ఎస్ నాయకులు పిండి అరవింద్, గూడూరి రాజు (బండల), అభిబ్, కౌన్సిలర్లు శ్రీనివాస్ యాదవ్, విటోభ, బింగి రాజేశం, సాయి, పట్టణ యూత్ అధ్యక్షులు రెడ్డి ప్రభాకర్ రెడ్డి, వేముల నగేష్, కంటెమ్ రాజు, మంచే నర్సింహులు, పత్రి శ్రీనివాస్, రాహుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం పట్టణ అధ్యక్షుడిగా నీలం యాదగిరి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 2: సిద్దిపేట పట్టణ మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులుగా నీలం యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఆకుల కిష్టయ్య, కార్యదర్శిగా నాయకం సత్యనారాయణ (ఓటింగ్ ద్వారా), సహాయ కార్యదర్శిగా చెంది సత్యనారాయణ, కోశాధికారిగా కే.ఆర్. సురేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పెట్టుగారి శ్రీనివాస్, ఆకుల దేవేందర్, కర్రు శ్రీనివాస్, ధర్మారం రమేష్, రెండ్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆర్థిక సంఘ సభ్యులుగా బస్సా మన్మోహన్, మడిపల్లి బాపయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ ఎన్నికల్లో కార్యదర్శి పదవికి మాత్రమే ఓటింగ్ నిర్వహించగా, మిగిలిన అన్ని పదవులు ఏకగ్రీవంగా భర్తీ అయ్యాయి.సలహా సంఘ సభ్యులు భూశెట్టి భూమయ్య, నాయకం తిరుపతి, బస్సా శ్రీనివాస్, ఆకుల మల్లేశం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగింది.



మున్సి'పోల్స్'లో పార్టీ బీ ఫారం పొందిన వారే పోటీలో ఉండాలి. పార్టీ ఇతర నేతలు బరి నుంచి తప్పకోవాలి. పోటీలో కొనసాగే రెబల్స్‌ను 15 ఏళ్లపాటు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తాం. అనేక సర్వే నివేదికల ఆధారంగా గెలిచే వారినే అభ్యర్థులుగా పార్టీ నిర్ణయించింది. టికెట్లు రాని వారికి పార్టీ పరంగా పదవులు ఇస్తాం.
- టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు

ప్రాంతీయం

మున్సిపల్‌లో సీపీఐ అభ్యర్థులను గెలిపించండి

- **సీపీఐ ఇంచార్జీ శివలింగు కృష్ణ**

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 2: మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సి పి ఐ అభ్యర్థులను కౌన్సిలర్స్ గా గెలిపించాలని,అలాగే 9 వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉన్నా తనను ప్రజలు ఆశీర్వదించాలని నియోజక వర్గ సిపిఐ ఇంచార్జీ శివలింగు కృష్ణ కోరారు. సోమవారం నాడు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ (ఆర్ అండ్ ఆర్) కాలనీ లో సి పి ఐ గజ్వేల్ నియోజక వర్గం ఇంచార్జీ శివలింగు కృష్ణ మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల నిత్యం పోరాడుతూ ప్రజలకు అండగా ఉంటున్న సి పి ఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ బలపర్చిన 7 వ వార్డు మెట్టు శ్రీను, 9వ వార్డు శివలింగ కృష్ణ, 10 వ వార్డు పోతుల శంకరయ్య 13వ వార్డు గూడూరి యాదమ్మ పార్టీ నాయకులు పోచయ్య, రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫర్టిలైజర్ యాప్ ద్వారా యూరియాను వినియోగించుకోవాలి

- **ఏ.డి.ఏ. మల్లయ్య**

ప్రతి పక్షం,దౌల్తాబాద్, ఫిబ్రవరి 2: రైతులు మొబైల్ ఫర్టిలైజర్ గా ధర యూరియాను బుక్ చేసుకోవాలని దుబ్బాక ఏడిఏ మల్లయ్య పేర్కొన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మొబైల్ యాప్ ఫర్టిలైజర్ పై డీలర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దుబ్బాక ఏడిఏ మల్లయ్య మాట్లాడుతూ. రైతులు తమ యూరియా ఫర్టిలైజర్ అవసరాలను సులభంగా తీర్చుకోవడానికి ప్రభుత్వం వినియోగంలోకి తీసుకువస్తున్న ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ఉపయోగించడం అత్యంత ముఖ్యం అని సూచించారు. ఈ యాప్ ద్వారా రైతులు ఖరీఫ్ మరియు యాసంగి సమయంలో యూరియా కోసం క్యూలైన్ లో నిలబడవలసిన అవసరం లేకుండా, తమ మొబైల్‌ఫోన్‌లోనే నేరుగా అవసరమైన యూరియాను బుక్ చేసుకోవచ్చన్నారు. గూగుల్ ప్లే స్టోర్‌లో యాప్ అందుబాటులో ఉందని ఒకసారి బుక్ చేసిన యూరియా బ్యాగ్ 24 గంటల పాటు రిజర్వ్ చేయబడుతుందన్నారు. యాప్ ద్వారా బుక్ చేసే వ్యవస్థ రైతులకు సరఫరా పారదర్శకంగా, సమయానుకూలంగా అందించే లక్ష్యంతో రూపొందించబడిందన్నారు. ఫర్టిలైజర్ డీలర్లు యూరియా పై అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.కార్యక్రమంలో ఏవో సాయికిరణ్, ఏ ఈ ఓ రజినీకాంత్, రైతులు డీలర్లు పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు

- **డీసీఓ వరలక్ష్మి**

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 2: రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుండగా, వాటిలోనే రైతులు పండించిన పంటలు విక్రయించాలని డిసిఓ వరలక్ష్మి స్పష్టం చేశారు. సోమవారం గజ్వేల్ మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, నిబంధనల మేరకు కొనుగోలు కేంద్రంలో విక్రయించి ఆర్థికంగా ప్రయోజనం పొందాలని సూచించారు. క్వింటాలుకు 8 వేలు చెల్లిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ రగోత్తం రెడ్డి, మార్కెట్ కమిటీ సెక్రటరీ జాన్ వెస్లీ, ప్యాక్స్ సీఈవో బాల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకుపచ్చ బహుమతితో పుట్టినరోజు జరుపుకోండి

- **జన్మదినం పురస్కరించుకొని మొక్కను నాటిన పిట్ల వెంకట్**
- **పర్యావరణ పరిరక్షణకు యువత చొరవ చూపాలని సూచన**

ప్రతిపక్షం,తొగుట, ఫిబ్రవరి 2: పుట్టినరోజులు ప్రతి ఒక్కరికీ ప్రత్యేకమైనవి, అవి జీవితంలోని మరో సంవత్సరాన్ని, ప్రేమను, జ్ఞాపకాలను, చిరునవ్వును గుర్తు చేస్తూ ప్రతి వ్యక్తికి ప్రాణం పోస్తాయి. అలాంటి పుట్టినరోజును మరింత అర్థవంతంగా ఎందుకు చేసుకోకూడదని అనుకున్నాడు తొగుట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు పిట్ల వెంకట్ సోమవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా స్థానిక వేణుగోపాల స్వామి దేవాలయం ఆవరణలో ఒక చెట్టును నాటి పర్యావరణ పరిరక్షణ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతను చాటుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ జన్మదినం రోజున పర్యావరణ పరిరక్షణ కోసం ఒక మొక్కను నాటలని, యువత జన్మదినం రోజున మద్యం తాగడం, పార్టీలు చేసుకోవాడం, బైక్ రైడ్స్ లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. రోజు రోజుకు అడవులు నశించి పోయి, కాలుష్యం పెరిగిపోయి సకాలంలో వర్షాలు కురవక ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆ ఇబ్బందులు రాకూడదు అంటే చెట్లను నాటి పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో మండల బిఆరెస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవీందర్, నాయకులు బాలేష్ యాదవ్, పర్శరాములు, గోవర్ధన్ రెడ్డి, స్వామి గౌడ్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్ ఉన్నభవనం పైఫ్లోర్‌లోనే నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహిస్తున్న దృశ్యం

అనుమతులు లేకున్నా సీబీఎస్ఈ అంటూ ప్రచారం

అనుమతులు ఒకలా.. నిర్వహణ మరోలా

విద్యార్థుల భద్రత గాలికి!

- ప్రైమరీ స్కూల్లో హైస్కూల్‌తరగతులు
- రెస్టారెంట్ ఉన్న భవనంలోనే పాఠశాల
- అగ్నిప్రమాదం జరిగితే పరిస్థితి ఏంటి?
- అధికారులు పట్టించుకోవడం లేదని తల్లిదండ్రుల ఆరోపణ
- బండ్లగూడలో నిబంధనలకు విరుద్ధంగా 'మాస్టర్‌మైండ్స్' పాఠశాల నిర్వహణ

ప్రతిపక్షం సిటీబ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 2: పాఠశాల నిర్వహణలో యాజమాన్యాలు తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపుతున్నాయి. అనుమతులు లేకుండానే తరగతులు నిర్వహిస్తూ, నిబంధనలకు అణుగుణంగా లేని భవనాల్లో పాఠశాలలు నిర్వహిస్తూ పలు పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల జీవితాలతో చెలగాటం అడతున్నాయి. హైదరాబాద్‌బండ్లగూడలో ఓ పాఠశా నిర్వహిస్తున్న తీరు విద్యార్థుల భద్రతను ప్రశ్నిస్తోంది. పాఠశాల భవనం కిందనే ఓ రెస్టారెంట్ ఉండడంతో భద్రత విషయంలో ప్రశ్నలు మొదలవుతున్నాయి. బండ్లగూడలోని మాస్టర్ మైండ్స్ గ్లోబల్ స్కూల్ ఉన్న భవనంలోనే ఓ రెస్టారెంట్ ఉండడం.. అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉందని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇంకా నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల యాజమాన్యం అనుమతులకు మించి తరగతులను నిర్వహిస్తున్నట్లు సమాచారం. పూర్తిస్థాయి అనుమతులు లేకుండానే పదవ తరగతి వరకు తరగతులు, సీబీఎస్ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు బాహాటంగానే చెబుతున్నారు. ఇటీవల నగరంలో జరుగుతున్న అగ్ని ప్రమాదాల నేపథ్యంలో పలు వ్యాపార సంస్థల నిర్వహణపై హైడ్రాధికారులు దృష్టి సారించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలను, ఆయా వ్యాపార సంస్థలను సీజ్ చేశారు. అయితే ఇటీవల జరుగుతున్న అగ్నిప్రమాదం దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ అధికారులు కూడా ఆయా పాఠశాల భవనాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాల్లో, ప్రమాదాలకు తావునిచ్చే ప్రదేశాల్లో పాఠశాల నిర్వహిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై బండ్లగూడ మండల ఐఓఎస్ అధికారి దశరథ్‌ని సంప్రదించగా నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకుంటామని చెప్పడం కోసం మెరుపు.



పార్టీ మారలేదు సిద్ధాంతం వదలలేదు

- **చిత్తశుద్ధితో పనిచేస్తా**
- **బీజేపీ అభ్యర్థి ఉప్పల మధుసూదన్**

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 2: గత 40 సంవత్సరాలుగా ఒకే పార్టీకి అంకితమై ప్రలోభాలకు లొంగకుండా, ఆంక్షలకు బెదరకుండా, ఇబ్బందులకు వెరవకుండా, నూతన కార్యకర్తలను పార్టీకి జోడిస్తూ, భారతీయ జనతా పార్టీనే తన జీవన ధ్యేయంగా భావించి పని చేసిన తనను దీవించాలని 20వ వార్డు అభ్యర్థి ఉప్పల మధుసూదన్ అన్నారు. పార్టీ కష్టకాలాల్లో వెనుతిరగకుండా, పార్టీ ఎదుగుదలే తన ఎదుగుదలగా భావిస్తూ, గజ్వేల్ పట్టణంలో బీజేపీ పునాదులను బలంగా వేసిన సీనియర్ కార్యకర్త గా ప్రజల పక్షం వహించి, పార్టీ కోసం అనుక్షణం శ్రమించిన నిబద్ధత గల వ్యక్తిత్వం తో పదవుల కోసం కాదు - నమ్మిన సిద్ధాంతం కోసంసంస్కారం, క్రమశిక్షణ, సేవాభావం ఉన్న తనను గజ్వేల్ పురపాలక ఎన్నికల్లో 20వ వార్డు నుంచి కౌన్సిలర్ గా ఎన్నుకోవాలని విన్నవించారు.

నార్మల్ డెలివరీల సంఖ్య పెంచాలి

- **జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్**

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 2: హాస్పిటల్ నందు నార్మల్ డెలివరీల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ అన్నారు. సోమవారం రోజు గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ ను ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మరియు సిబ్బందితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూహాస్పిటల్ నందు నార్మల్ డెలివరీలు సంఖ్య పెంచాలని, "కోత ఆపరేషన్లు వద్దు, నార్మల్ డెలివరీసు ముద్దు" అనే అంశం మీద చర్చించారు. తొమ్మిది నెలల గర్భవతులకు తొందరగా డెలివరీ అయ్యేందుకు ఎక్సర్సైజ్. ట్రైనింగ్ ఇచ్చుటకు ఒక యోగ టీచర్ ను కావాలని వారికి కాలక్షేపం కోసం ఒకటి టీవీని ఏర్పాటు చేయాలని అందుకు తగిన ప్రణాళికలు కావలసిన సదుపాయాలు సమకూర్చుకోవాలని డి ఎం అండ్ హెచ్ ఓ ని కోరారు. ఈ పర్యటనలో భాగంగా వర్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను సందర్శించి హాస్పిటల్ లో పనిచేస్తున్న సిబ్బంది ప్రతి ఒక్కరూ హెపటైటిస్ బి వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. వీరి వెంట డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ (డిఐఓ) డాక్టర్ దీప్తిప్రియాంక, హాస్పిటల్ ఆర్ఎంవో డాక్టర్ రాము, కె. రవీందర్ రెడ్డి క్లస్టర్ సిహెచ్ఓ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సాంఘిక శాస్త్రంతో సమాజం పట్ల అవగాహన

- **సిద్దిపేట జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాసరెడ్డి**

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 2: సమాజం పట్ల విద్యార్థులకు సాంఘిక శాస్త్రం ద్వారా అవగాహన కలుగుతుందని సిద్దిపేట జిల్లా విద్యాధికారి ఎల్లెంకి శ్రీనివాస రెడ్డి అన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల జిల్లా ఫోరం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష సిద్దిపేటలోని ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం(టీటీసీ)లో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభా పరీక్షల్లో పాల్గొని తమ విజ్ఞానాన్ని మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఉద్యోగ పోటీ పరీక్షలకు ఎలా చదవాలో ప్రతిభా పరీక్షల ద్వారా అవగాహన కలుగుతుందన్నారు. పోటీ పరీక్షల ద్వారా ఉద్యోగ నియామకాలు జరుగుతున్న తరుణంలో ప్రతి మార్కు కీలకంగా మారుతుందని చెప్పారు. విద్యార్థులు ప్రతిభా పరీక్షల్లో జరిగిన సరిదిద్దుకుంటూ ఆయా సబ్జెక్టులలో సబ్జెక్టులలో పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. సిద్దిపేట జిల్లా అన్ని రకాల విద్యాసంస్థలలో రాష్ట్రంలో ప్రతిభ కనబరుస్తోందని చెప్పారు. భవిష్యత్తులో ఇలాగే జిల్లాను ముందుకు తీసుకెళ్ళాలని ఉపాధ్యాయులను, విద్యార్థులను కోరారు. పరీక్షా నిర్వహణ, ఫలితాలను ప్రకటించడంలో సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం కొత్త ఒరవడి సృష్టించిందని అభినందించారు. ప్రతిభా పరీక్ష నిర్వాహకులుగా జిల్లా సాంఘిక శాస్త్ర పోరం అధ్యక్షుడు మామిడి పూర్ణచంద్రరావు, గౌరవ అధ్యక్షుడు మామిళ్ళ లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి ఉన్నారు. ఈ పరీక్షను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాలలో నిర్వహించారు. ఈ పరీక్షకు 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంగ్లీష్ మీడియం విభాగంలో జిల్లా స్థాయి ప్రథమ స్థానం ఏ.శ్రీజ (టీజీఎంఎస్ ఇబ్రహీం నగర్) , ద్వితీయ స్థానం సానియా సదాఫ్ (జడ్.పి.హెచ్.ఎస్ ఇందిరానగర్), తృతీయస్థానం బి.సమీరా (జడ్పీహెచ్ఎస్ కోహెడ), తెలుగు మీడియం విభాగంలో జిల్లాస్థాయి ప్రథమ స్థానం కె.వివేకానంద (జడ్పీహెచ్ఎస్ బాయ్స్ దౌల్తాబాద్), ద్వితీయ స్థానం ఎస్.శ్రవణ్ (జడ్.పి.హెచ్.ఎస్ బేగంపేట్), తృతీయ స్థానం డి.నీరజ (జడ్.పి.హెచ్.ఎస్ బేగంపేట్), ఉర్దూ మీడియం విభాగంలో జిల్లా స్థాయి ప్రథమ స్థానం సిమ్రాన్ (జెడ్పీజిహెచ్ఎస్ గజ్వేల్), ద్వితీయ స్థానం మహెక్ (జడ్పీహెచ్ఎస్‌గజ్వేల్), సాధించారు. విజేతలకు జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ అంతకుముందు టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాన్ని జిల్లా ప్రభుత్వ పరిక్షలు విభాగం అధికారి లక్ష్మయ్య, సిద్దిపేట అర్బన్ ఎంఈఓ రాజ ప్రభాకర్ రెడ్డి విడుదల చేశారు. జిల్లాస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఫిబ్రవరి 7న తెలంగాణ రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఫోరం జిల్లా ఆర్థిక కార్యదర్శి వై రాంగోపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జి సమ్మయ్య, కె.అన్నపూర్ణ, డివిజనల్ సమన్వయకర్తలు చంద్రశేఖర్, రాచకొండ భూపాల్, కాల్వ శ్రీకాంత్, భోగ నరేష్, కలకుంట్ల రాములు , జోసెఫ్, ఫోరం నాయకులు రంజిత్ కుమార్ , పరశు రాములు తదితరులు పాల్గొన్నారు.

'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' పేరిట పీఎం మోదీ రాజ్యాంగాన్నే మార్చేందుకు కుట్ర పన్నుతున్నారు. దేశంలో 'వన్ పర్సన్.. వన్ పార్టీ' విధానాన్ని తెచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. రాజ్యాంగాన్ని తొలగించేందుకే 400 సీట్లు అడిగారు. అందుకే ప్రజలు వారికి సింపుల్ మెజార్టీ కూడా ఇవ్వలేదు. ఓటు హక్కును కాలరాయడానికి 'సర్' పేరిట ప్లాన్ చేస్తున్నారు.

- సీఎం రేవంత్ రెడ్డి

అజిత్ పవార్ మరణంపై అనుమానాలు

- ఇరిగేషన్ కుంభకోణంపై బీజేపీని బెదిరించిన 10 రోజుల్లోనే ఘటన
- శివసేన ఉద్ధవ్ వర్గం నేత సంజయ్ రౌత్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ముంబై, ఫిబ్రవరి 2: మహారాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణంపై అనుమానం వ్యక్తం చేశారు శివసేన ఉద్ధవ్ వర్గం నేత సంజయ్ రౌత్. ఇరిగేషన్ కుంభకోణాన్ని బయట పెడుతానని బీజేపీని బెదిరించిన 10 రోజుల్లోనే ఆయన మరణించారని తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీతో తెగదెంపులు చేసుకుని ఎన్‌సీపీలో తిరిగి విలీనం కావాలని అజిత్ పవార్ నిర్ణయం తీసుకున్నారని ఆయన వెల్లడించారు. ఈ పరిణామాలన్నింటిని పరిశీలిస్తే ఆయన మరణం అనుమానాస్పదంగా కనిపిస్తుందని అన్నారు. మరోవైపు బీజేపీపైనా తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు ఎంపీ సంజయ్ రౌత్. అజిత్ పవార్ తిరిగి ఎన్‌సీపీలో చేరడం బీజేపీకి ఘోర పరాభావమని అభిప్రాయపడ్డారు. ఒకవేళ ఇదే జరిగితే దేశ రాజకీయాల్లో ఇది కీలక పరిణామంగా మారేదని చెప్పారు. అజిత్ దాదాకు చెందిన పార్టీ ఇప్పుడు పవార్, పాటిల్‌తో సంబంధం లేకుండా పోయిందని సంజయ్ రౌత్ అన్నారు. ప్రస్తుతం ఆ పార్టీ గోయల్, పటేల్, పరేఖ్, షా, మోదీలకు చెందినదిగా మారిందన్నారు. అంతకుముందు ఎన్‌సీపీ నేత అమోల్ మిట్కారీ కూడా అజిత్ పవార్ మరణంపై అనుమానం వ్యక్తం చేశారు. ఈ విమాన ప్రమాదంపై ఉన్నత స్థాయి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. అజిత్ పవార్ మరణంపై సీబీఐతో దర్యాప్తు చేపించాలని ముఖ్యమంత్రిని కోరుతున్నాను. ఈ విషయంపై హోంమంత్రిని కలుస్తానని అని అమోల్ అన్నారు.

విశ్వ వీక్షణం

షేక్ హసీనాకు పదేండ్ల జైలు శిక్ష

- మేనల్లుడు, మేనకోడలికి కూడా వేర్వేరు కేసుల్లో శిక్ష

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు పదేళ్ల జైలు శిక్ష ఖరారు చేశారు. ఆమె మేనల్లుడు రద్వాన్ ముజిబ్ సిద్దిక్, మేనకోడళ్లు తులిప్ రిజ్వానా సిద్దిక్, అజ్మినా సిద్దిక్‌లకు కూడా రెండు వేర్వేరు అవినీతి కేసుల్లో శిక్ష పడింది. రాజుక్ న్యూ టౌన్ ప్రాజెక్టుకు సంబంధం ఉన్న ప్లాట్ల కేటాయింపులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసులో అవినీతి జరిగినట్లు షేక్ హసీనాతో పాటు ఆమె బంధువులపై ఎఫ్ఐఆర్ బుక్ చేశారు. ఢాకాలోని కోర్టు 4కు చెందిన ప్రత్యేక జడ్జీ రాబిల్ ఆలమ్ ఇవాళ ఆ కేసులో తీర్పును వెలువరించారు. ఒక్కొక్క కేసులో అయిదేళ్ల చొప్పున, మొత్తంగా హసీనాకు పదేళ్ల జైలుశిక్షను ఖరారు చేశారు. తులిప్ సిద్దిక్‌కు నాలుగేళ్లు, ఇక హసీనా మేనకోడళ్లకు ఒక్కొక్కరికి ఏడేళ్ల శిక్షను వేశారు. ఈ కేసులో సరెండర్ అయిన రాజుక్ సభ్యుడు ఖుర్షీద్ ఆలమ్‌కు ఏడాది జైలుశిక్ష విధించారు. నిందితులు అందరికీ లక్ష జరిమానా విధించారు. ఒకవేళ కట్టలేని పక్షంలో అదనంగా ఆర్నెళ్లు జైలు జీవితాన్ని అనుభవించాలి. హసీనాకు శిక్ష పడిన విషయాన్ని ఏసీసీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తారిక్ ఇస్లామ్ ఖాన్ మనిముల్ హసన్ లిపన్ నిర్ధారించారు.



ఆకట్టుకునే రాత.. అధిక మార్కులకు చేయూత

ఎస్సెస్సీ, ఇంటర్ పబ్లిక్ పరీక్షలలో అందమైన రాతపై విద్యార్థులకు అవగాహన

ప్రముఖ చేతిరాత నిపుణుడు ఎజాస్ అహ్మద్ సూచనలు

కత్తుల లక్ష్మారెడ్డి, సిద్దన్నపేట

చదివిన అంశాలను ఆకట్టుకునేలా రాయాలి. రాసిన అంశంలో స్పష్టత ఉండాలి. ప్రశ్నకు సమాధానం రాసే ప్రతిభ ఉన్నా కుదిరించి రాయక పోవడం వల్ల మార్కులు తగ్గుతున్నాయి. రాసిన అంశంలో స్పష్టత కలిగి ఆకట్టుకునేలా ఉంటే పరీక్షల్లో మెరుగైన ఫలితం సాధించవచ్చు. అక్షర దోషాలు, రాతలో గజిబిజి, కొట్టివేతలు లేకపోతే పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు పొందవచ్చు. ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి 25 వ తేదీ నుంచి,పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి14 వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో 9,91,488 రెగ్యులర్ విద్యార్థులు, 10వేల మంది సప్లిమెంటరీ విద్యార్థులు కలిపి మొత్తం 10,01,488 మంది ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసేందుకు పరీక్ష రుసుం చెల్లించారు. బాలురు 2,58,000 మంది, బాలికలు 2,51,000 మంది కలిపి మొత్తం 5,09,000 మంది ఎస్.ఎస్. సి. పరీక్షల రుసుము చెల్లించారు. పరీక్షల సమయం సమీపిస్తోంది. సిలబస్ పూర్తయింది. ఆయా విద్యాసంస్థల్లో పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు పరీక్షల సన్నద్ధత దశకు చేరుకున్నారు. విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను మననం చేసుకుంటూ పరీక్షలకు తయారు అవుతున్నారు. పరీక్షలలో పరీక్షా పత్రంపై పలు మెళకువలు పాటిస్తూ సమాధానాలు రాయాలని సిద్దిపేటకు చెందిన చేతిరాత ప్రముఖ నిపుణులు ఎజాస్ అహ్మద్ సూచించారు.

ఏడాదిలో చదివింది మూడు గంటల్లో రాస్తేనే..

ఏడాది పాటు చదివిన సబ్జెక్టులోని అంశాలను మూడు గంటల్లో రాయాల్సి ఉంటుంది. సైన్స్ కు సంబంధించి భౌతిక రసాయన శాస్త్రం, జీవశాస్త్రం పరీక్షలకు గంటన్నర చొప్పున సమయం ఉంటుంది. పరీక్షలలో 24 పేజీల ఆన్సర్ బుక్ లెట్ ను ఇస్తారు. ఎస్.ఎస్. సి. పరీక్షలకు సంబంధించి సైన్స్ సబ్జెక్టులో భౌతిక రసాయన శాస్త్రానికి 12 పేజీలు, జీవ శాస్త్రానికి 12 పేజీల ఆన్సర్ బుక్ లెట్లు ఇస్తారు. అదనపు సమాధాన పత్రాలు ఇవ్వరు. ఈ పేజీలలో మాత్రమే సమాధానాలను రాయాలి. ప్రతి పేజీలో 24 లైన్లు(గీతలు) ఉంటాయి.

ఎరుపు, పచ్చ ఇంకు వాడొద్దు

సమాధాన పత్రంలో సమాధానాలు రాసేటప్పుడు ఎరుపు, పచ్చ ఇంకు పెన్నులు వాడరాదు. శీర్షికలను స్కెచ్ పెన్నులతో రాయవచ్చు. ఒక ప్రశ్నకు సమాధానం పూర్తయ్యాక పెన్సిల్ తో గీత గీయవచ్చు. లేదంటే ఒక లైను వదిలి పెడితే సరిపోతుంది. పరీక్ష ప్రారంభంలో నెమ్మదిగా చివరి నిమిషాల్లో వేగంగా రాసి పరీక్షను ముగించ వద్దు. ప్రశ్నపత్రంలో ఇచ్చిన ప్రశ్నల సంఖ్యకు రాసే సమాధానాల నిడివి ఆధారంగా సమయాన్ని విభజించుకుని సమాధానాలు రాయాలి. ముందుగా సమాధానం బాగా తెలిసిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. వరుస క్రమంలోనే రాయాలనే నిబంధన ఏమీ లేదు. ప్రతి పేజీలో ఎడమవైపున నిలువుగా మార్జిన్ గీత గీయాలి. సమాధానం రాసే ప్రశ్న నెంబర్ ను మార్జిన్ లో మాత్రమే స్పష్టంగా రాయాలి. సమాధానం రాసే ముందు ఆ ప్రశ్న ఏ సెక్షనుకు సంబంధించిందో ఆ సెక్షన్ నంబరును పేర్కొనాలి. సమాధానాలను పాయింట్లు వారిగా రాసేటప్పుడు పాయింటు నెంబర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ మార్జిన్లో రాయకూడదు. గణితం పరీక్ష సమాధానాలు రాసేటప్పుడు ప్రతి పేజీని నిట్ట నిలువుగా నాలుగు సమాన భాగాలుగా విభజించుకోవాలి. ఎడమవైపు మొదటి భాగాన్ని మిగిలిన మూడు భాగాలతో విభజిస్తూ నిలువు గీత పెన్సిల్ తో గీసి ఈ భాగాన్ని మార్జిన్ గా ఉపయోగించాలి. మిగిలిన మూడు భాగాలలో చివరి భాగాన్ని విభజిస్తూ నిలువు గీతను పెన్సిల్ తో గీయాలి. సమాధానాలను మధ్య



భాగంలో రాయాలి. వైపు చివరి నిలువు భాగాన్ని ఆ పేజీలో లెక్కలు సాధించడానికి అవసరమైన చిత్తు పనికి వినియోగించాలి. పార్ట్ బి లో బహుళైచ్చిక ప్రశ్నలకు సమాధానాలు రాసేటప్పుడు సరైన సమాధానం యొక్క ఆప్షన్ అక్షరం ఎలా ఉంటే అలానే నమోదు చేయాలి. ఆప్షన్ కు ఆంగ్లంలోని చిన్న అక్షరము ఉంటే చిన్న అక్షరాన్ని, పెద్ద అక్షరం ఉంటే పెద్ద అక్షరాన్ని మాత్రమే నమోదు చేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆప్షన్లు రాసేటప్పుడు కొట్టివేతలు, దిద్దుబాటు చేయకూడదు. చేతిరాత ప్రాక్టీసుకు రోజు అరగంట కేటాయించాలి.

అక్షరాలు సమానంగా రాయాలి

తెలుగులో అక్షరాలు సమానంగా గుండ్రంగా ఉండాలి. అచ్చుల గుర్తులు అన్నిచోట్ల సమానంగా ఉండాలి. అలకట్లు ఒకే ఆకారంలో అక్షరానికి సరిపోయే విధంగా ఇవ్వాలి. సున్నాలను అక్షరం సైజులోనే రాయాలి. ఒత్తులు చిన్నవిగా ఇవ్వాలి. వాక్యంలో పదాలకు మధ్య సరైన నిడివి ఉండాలి. సమాధానం రాసేటప్పుడు ఒకే రకమైన పెన్నును వాడాలి. లేఖ(ఉత్తరం), వ్యాసం, కరపత్రం వంటి వాటికి సమాధానం సాధ్యమైనంత వరకు ఒకే పేజీలో ఉండేలా రాయాలి. ఒకే సమాధానాన్ని రెండు పేజీలలో రాసేటప్పుడు జాగ్రత్త వహించాలి. ఫుల్ స్టాప్(చుక్క గుర్తు), కామా, బ్రాకెట్లు, ఆశ్చర్యార్థకాలు, ఇన్వర్టర్ కామాలు అవసరమైన చోట తప్పక రాయాలి. .

పదాలు, లైన్ల మధ్య సరైన విడివి పాటించాలి

హిందీలో ఐదు అంశాల పట్ల జాగ్రత్త వహించి సమాధానాలు రాయాలి. హిందీలో సమాధానాలు రాసేటప్పుడు అక్షరాలు గుండ్రటి కృతిని కలిగి ఉండాలి. నిలువుగీత కలిగిన అక్షరాలను సమానంగా ఒకే ఆకారం(సైజు)లో రాయాలి. ఎడమవైపు గాని, కుడి వైపు గాని వంగినట్లు అక్షరాలను రాయవద్దు. పదాలు, లైన్లకు మధ్య విడితిలో సమానత్వం పాటించాలి. 'ఎ'కీ మాత్ర(అచ్చుల గుర్తులు), 'ఐ 'కీ మాత్ర, 'ఔ 'కీ మాత్రలను మాత్రం ఎడమవైపు వాల్చుతూ సమానంగా రాయాలి. 'ఇ 'కీ మాత్ర, 'ఈ ' కీ మాత్ర అక్షరానికి గుడిష మాదిరిగా, అదే ఈ క్రమంలో కుడి వైపు వాలినట్లు రాయాలి.

అక్షరాలన్నీ ఒకే ఆకారంలో

ఆంగ్లంలో ఏ, సీ, ఈ, ఐ, ఎం, ఎన్, ఓ, ఆర్, ఎస్, యూ, వీ, డబ్ల్యూ, ఎక్స్ అక్షరాలు మధ్య భాగాన వచ్చేటట్లు రాయాలి. బీ, డీ, ఎఫ్, హెచ్, కే, ఎల్, టీ అక్షరాలు పైకి వెళ్ళేలా రాయాలి. జీ, జే, పీ, క్యూ, వై, జడ్ అక్షరాలు కిందకు వచ్చేటట్లు రాయాలి. కర్స్యు రైటింగ్ గాని, లూసిడా రైటింగ్ గానీ ఏదైనా రాయవచ్చు. అక్షరాలు వాలేటట్లు రాయగూడదు. క్యాపిటల్ లెటర్స్(పెద్ద అక్షరాలు) పెద్ద సైజులో, స్మాల్ లెటర్స్(చిన్న అక్షరాలు) చిన్న సైజులో రాయకూడదు.

గుర్తులను గుర్తుంచుకోవాలి

గణితంలో అంకెలు ఒకటి నుంచి తొమ్మిది వరకు చక్కగా రాయగలగాలి. సున్న అంకె '0' ను 'o ' లా రాయవద్దు. సున్న అంకె '0' ను రాయడం బాగా ప్రాక్టీస్ చేయాలి. సున్న, సమానత్వం, లెస్ దాన్ (తక్కువ), గ్రేటర్ దాన్(ఎక్కువ), ప్లస్(కూడిక), మైనస్ (తీసివేత), మల్టిప్లికేషన్ లేదా ఇంటు (గుణకారం), డివిజన్ (భాగహారం) గుర్తులు అయిన 0, =, <, >, +, , ×, ÷ గుర్తులను స్పష్టంగా రాయాలి. ఎక్స్(x), వై(y), స్క్వేర్, స్క్వేర్ రూట్ (√)లను సరిగ్గా రాయాలి. స్టెప్స్ చిన్నవిగా పెద్దవిగా వచ్చినప్పుడు ఆకట్టుకునేలా రాయాలి. గ్రాఫ్ లను పెన్సిల్ తో గీయాలి. గ్రాఫ్ గీయడానికి పెన్సిల్ ను సన్నగా చెక్కుకోవాలి. స్కేలును గ్రాఫ్ పై భాగంలో కుడివైపున పెన్సిల్ తో రాయాలి.

బొమ్మలను పెన్సిల్ తో గీయాలి

సైన్స్ లో భాగమైన భౌతిక రసాయన శాస్త్రం, జీవశాస్త్రం పరీక్షల్లో ప్రశ్నపత్రానికి సమాధానాలు రాసేటప్పుడు అక్షరాలు గుండ్రంగా తప్పులు లేకుండా రాయాలి. తెలుగు మాధ్యమంలో సమాధానం రాసేవారు అక్షరాలను రాసే క్రమంలో తెలుగు రాసేటప్పుడు పాటించే నియమాలను పాటిస్తూ రాయాలి. ఆంగ్ల మాధ్యమంలో సమాధానాలు రాసేవారు ఆంగ్లం రాసేటప్పుడు పాటించే నియమాలను పాటించాలి. ప్రయోగాల పటాలు, బొమ్మలు బాగా వేయాలి. పెన్సిల్ తో పటాలను బొమ్మలను గీసి భాగాలను గుర్తించి వాటి పేర్లను పెన్నుతో రాయవచ్చు. పటాలు బొమ్మల యొక్క భాగాలను గుర్తించి కుడి వైపున రాయాలి.

మ్యాప్ పాయింటింగ్ సరిగ్గా గుర్తించాలి

సాంఘిక శాస్త్రం తెలుగు మాధ్యమంలో సమాధానం రాసేవారు అక్షరాలను రాసే క్రమంలో తెలుగు అక్షరాలను రాసేటప్పుడు పాటించే నియమాలు, ఆంగ్ల మాధ్యమంలో సమాధానాలు రాసేవారు ఆంగ్ల అక్షరాలను రాసేటప్పుడు పాటించే నియమాలు పాటిస్తూ సమాధానాలు రాయాలి. మ్యాప్ పాయింటింగ్ సరిగ్గా గుర్తించాలి.

ఫాస్ట్‌ట్యాగ్ యూజర్లకు గుడ్ న్యూస్

- కీలక సంస్కరణ తెచ్చిన ఎన్ హెచ్ ఏఐ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: ఫాస్ట్‌ట్యాగ్ విధానంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్ హెచ్ ఏఐ) కీలక సంస్కరణలు తీసుకొచ్చింది. ఫాస్ట్ ట్యాగ్ యాక్టివేషన్ సమయంలో వాహన వివరాలను ధృవీకరించే పూర్తి బాధ్యతను బ్యాంకులకే అప్పగించింది. ఇప్పటివరకు వాహన యజమానులు అన్ని చెల్లుబాటుఅయ్యే పత్రాలు సమర్పించి ఫాస్ట్‌ట్యాగ్ పొందిన తర్వాత కేవైవీ పూర్తి చేసుకోవాల్సి ఉండేది. దాంతో యాక్టివేషన్ ఆలస్యం కావడం, టోల్ ప్లాజాల వద్ద ఇబ్బందులు ఎదురవడం, రిఫండ్స్ నిలిచిపోవడం వంటి సమస్యలు ఎదురయ్యేవి. కొత్త విధానంతో ఫాస్ట్‌ట్యాగ్ జారీ తర్వాత ప్రత్యేకంగా కేవైవీ పూర్తి చేయాల్సిన అవసరం లేదు. బ్యాంకులు ముందుగానే వాహన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ధృవీకరిస్తాయి. ఫలితంగా ఫాస్ట్ ట్యాగ్ జారీ ప్రక్రియ వేగంగా జరుగుతుంది. ఇది లక్షల మంది వాహన వినియోగదారులకు మేలు చేస్తుంది. ఈ కేవైవీ సడలింపు కేవలం కొత్తగా జారీ అయ్యే ఫాస్ట్‌ట్యాగ్ లకు మాత్రమే కాకుండా.. ఇప్పటికే జారీ చేసిన వాటికి కూడా వర్తిస్తుంది. కాబట్టి ఇకపై కేవైవీ తప్పనిసరి కాదు. అయితే ఫాస్ట్‌ట్యాగ్ వినియోగానికి సంబంధించిన మోసాలు జరిగినట్లు అనుమానం తలెత్తితే, కేవైవీ చేసుకోవాల్సి వస్తుంది.

పాకిస్తాన్ నుంచి వచ్చిన దళితులకు ఇండ్లు ఇవ్వాలి

- సుప్రీం కోర్టు ఆదేశం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: పాకిస్తాన్ నుంచి వలస వచ్చి, ఇక్కడే ఉండిపోయిన హిందూ దళితులకు ప్రభుత్వం ఇండ్లు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది. పాకిస్తాన్ నుంచి కొంతకాలం క్రితం వలస వచ్చిన దళిత హిందువులు ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. ముఖ్యంగా మజ్నూ కా తిలా ప్రాంతంలోని, సిగ్నేచర్ బ్రిడ్జి వద్ద ఎక్కువగా నివసిస్తున్నారు. అయితే, వీరి నివాసాలను తొలగించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఆక్రమణల పేరుతో తొలగించేందుకు ప్రయత్నిస్తుండటంతో నిత్యం భయంతో బతుకుతున్నారు. ఈ నేపథ్యంలో వీరికి భారత ప్రభుత్వం పౌరసత్వం కల్పించడంతోపాటు, ఇండ్లు మంజూరు చేసేలా ఆదేశించాలని కోరుతూ సుప్రీంలో పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై విచారణ జరిపిన కోర్టు తాజాగా కీలక ఆదేశాలిచ్చింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్ కోటేశ్వర్ సింగ్ ఆధ్వర్యంలోని బెంచ్ సోమవారం ఈ వ్యాఖ్యలు చేసింది. పాక్ నుంచి వచ్చిన హిందూ దళితులకు కేవలం భారత పౌరసత్వం ఇస్తే సరిపోదని, గౌరవంగా బతికేలా ఇండ్లు కూడా ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది. అలాగే, ఇతర పునరావాస చర్యలకు కూడా కోర్టు ఆదేశించింది. దీనికి సంబంధించి నాలుగు వారాల్లోగా సమాధానం తెలపాలని సూచించింది. అలాగే, ఆక్రమణల తొలగింపు లేదా అభివృద్ధి పనుల కోసం నివాసాల్ని తొలగిస్తే దళితులు ఇబ్బంది పడతారని కోర్టు అభిప్రాయపడింది. వీరి నివాసాల తొలగింపును ఆపేయాలని సూచించింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 250 కుటుంబాలు పాక్ నుంచి వచ్చి జీవిస్తున్నాయి. దాదాపు వెయ్యి మంది వరకు దళితులు ఉంటారని అంచనా. కొన్నేళ్లుగా ఉంటున్న వీరికి సరైన జీవన భద్రత లేకుండా పోయింది.

బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీలో మహిళా సూసైడ్ బాంబర్లు

- ఫోటోలు, వీడియోలు విడుదల చేసిన బీఎల్ఏ మిలిటెంట్ సంస్థ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: పాకిస్థాన్‌లోని బలోచిస్తాన్ లో ఇటీవల తిరుగుబాటు దళాలు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఘర్షణల్లో తీవ్ర రక్తపాతం చోటుచేసుకున్నది. ఇరు వైపుల భారీ సంఖ్యలో ప్రాణ నష్టం జరిగింది. అయితే నిషేధిత బలోచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ తాజాగా మహిళా ఫిదాయిన్‌ల ఫోటోలను రిలీజ్ చేసింది. తమ దళానికి చెందిన ఇద్దరు మహిళా సూసైడ్ బాంబర్లు భారీ దాడుల్లో పాల్గొన్నట్లు బీఎల్ఏ పేర్కొన్నది. ఆ ఇద్దరిలో ఒకరి పేరు హవా బలోచ్. ఆమె తండ్రి కూడా బీఎల్ఏ ఫైటర్. 2021లో పాకిస్థాన్ భద్రతా దళాల చేతిలో అతను హతమయ్యాడు. ఇక మరో ఫైటర్‌ను అసిఫా మెంగాల్‌గా గుర్తించారు. 2002లో ఆమె పుట్టింది. ఇటీవల నుషిక్‌లోని ఐఎస్ఐ క్యాంపుపై జరిగిన సూసైడ్ దాడిలో ఆమె పాల్గొన్నట్లు బలోచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ తెలిపింది. జెన్ జెడ్ కేటగిరీకి చెందిన మహిళలుగా వారిని గుర్తిస్తున్నారు. ఆ ఇద్దరూ మంచి విద్యావంతులే. తిరుగుబాటు దళంలో చేరడానికి ముందు ఆ ఇద్దరూ ఉన్నత విద్యను అభ్యసించారు. కానీ ఎన్నో ఏళ్లుగా సాగుతున్న బలోచ్ వేర్పాటువాద ఉద్యమంలో యువత, చదువుకున్న అమ్మాయిలు కూడా పాలుపంచుకుంటున్నారు. పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఎల్ఏ దళాలు పోరాటం చేస్తున్నాయి. పాక్ ఆర్మీపై దాడి చేసిన ఇద్దరు మహిళా బాంబర్ల ఫోటోలను రిలీజ్ చేస్తున్నట్లు బీఎల్ఏ అధికారికంగా ప్రకటించింది. పాకిస్థాన్ భద్రతా బలగాలను టార్గెట్ చేసేందుకు హిరాఫ్(బ్లాక్ స్టార్మ్) ఆపరేషన్ చేపట్టినట్లు బీఎల్ఏ చెప్పింది.

'ఐసీసీ నిబంధనలు పాటిస్తాం'

పాకిస్థాన్‌తో మ్యాచ్‌పై బీసీసీఐ కీలక నిర్ణయం!

టీ20 వరల్డ్‌కప్‌లో భారత జట్టుతో మ్యాచ్ బాయ్‌కాట్ చేయాలని పాకిస్థాన్ తీసుకున్న నిర్ణయం పెద్ద దుమారం రేపుతోంది. ఎంపిక పద్ధతిన మెగా టోర్నీలో పాక్ జట్టు ఆడాలనుకోవడాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి తప్పు పడుతోంది. పాక్ ప్రభుత్వం, ఆ దేశ బోర్డు తమ నిర్ణయాన్ని మార్చుకోకుంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది కూడా. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి సైతం తమ వైఖరిని స్పష్టంగా వెల్లడించింది. తాము ఐసీసీ నిబంధనలను పాటిస్తామని.. పీసీబీ చీఫ్ మొహ్సిన్ నఖ్వీ మాదిరిగా పూటకో మాట, రోజుకో విధంగా ప్రవర్తించడం తమకు తెలియదని బీసీసీఐ పేర్కొంది. స్వదేశంలో మొదలయ్యే పొట్టి ప్రపంచకప్ కోసం పక్కాగా సిద్ధమైన భారత జట్టు టైటిల్ నిలబెట్టుకునేందుకు సర్వశక్తులు ఒడ్డనుంది. సన్నాహక సిరీస్‌లో విజయంతో కొండంత ఆత్మవిశ్వాసంతో ఉన్న టీమిండియా ట్రోఫీ వేటకు కాచుకొని ఉంది. షెడ్యూల్ ప్రకారం లీగ్ దశలో సూర్యకుమార్ యాదవ్ సేన ఫిబ్రవరి 15న పాకిస్థాన్‌తో తలపడాలి. కానీ, ఇండియాతో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తామని పాక్ ప్రభుత్వం ప్రకటించడం చర్చనీయాంశమైంది. దాయాదుల బిగ్ ఫైట్ చూడాలనుకున్న కోట్లాదిమంది ఒకింత షాక్ అవుతున్నారు. అయితే.. బీసీసీఐ మాత్రం పాక్ ప్రభుత్వ నిర్ణయాన్ని తేలికగానే తీసుకుంది. తాము ఐసీసీ ప్రొటోకాల్ పాటిస్తామని, షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 15న భారత జట్టు కొలంబో స్టేడియానికి వెళ్తుందని సోమవారం బీసీసీఐ వర్గాలు తెలిపాయి. 'వరల్డ్‌కప్‌లో ఫిబ్రవరి 15వ తేదీన లీగ్ దశ మ్యాచ్ కోసం భారత జట్టు శ్రీలంకకు వెళ్తుంది. ఐసీసీ ప్రొటోకాల్.. షెడ్యూల్ ప్రకారం టీమిండియా క్రికెటర్లు సాధన చేస్తారు. మ్యాచ్‌కు ముందు మీడియా సమావేశంలో కూడా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతాడు. మ్యాచ్ సమయానికి భారత బృందం స్టేడియానికి చేరుకుంటుంది. ఒకవేళ పాక్ జట్టు ఆడేందుకు సిద్ధంగా లేదంటే ఆ తర్వాత రిఫరీ నిర్ణయం కోసం మేము ఎదురుచూస్తాం. రిఫరీ మ్యాచ్ రద్దు చేశామని చెప్పాకే స్టేడియం నుంచి బయటకొస్తాం' అని బీసీసీఐ వర్గాలు చెప్పినట్టు పలు కథనాలు పేర్కొంటున్నాయి.

వామప్ మ్యాచ్‌లో యూఎస్ ఏకు షాకిచ్చిన ఇండియా

పొట్టి ప్రపంచకప్ వామప్ మ్యాచ్‌లో సంచలనం. తొమ్మిదో సీజన్‌లో పెద్ద జట్లకు షాకిచ్చిన యూఎస్ఏను భారత ఏ జట్టు అలవోకగా మట్టికరిపించింది. డీవై పాటిల్ మైదానంలో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టి.. 38 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. ఓపెనర్ నారాయన్ జగదీశన్(104) శతకమోతకు, కెప్టెన్ ఆయుష్ బదోని(60 నాటౌట్) అర్ధ శతకం తోడవ్వగా భారీ లక్ష్యాన్నినిర్దేశించిన భారత్.. తర్వాత ప్రత్యర్థిని రెండొందలకే కట్టడి చేసింది. గత సీజన్‌లో సొంతగడ్డపై చెలరేగిపోయిన యూఎస్ఏకు వామప్ మ్యాచ్‌లోనే ఊహించని ఝలక్ ఇచ్చింది భారత ఏ జట్టు. భారీ అంచనాలతో వరల్డ్‌కప్ బరిలో నిలిచిన అమెరికాను పునరాలోచనలో పడేస్తూ.. 38 పరుగుల తేడాతో ఓడించింది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో భారత ఏ జట్టు భారీ స్కోర్‌తో యూఎస్ఏకు సవాల్ విసిరింది. 239 రన్స్ ఛేదనలో ఓపెనర్ ఆండ్రీస్ గౌస్(44) రాణించినా మిగతావాళ్లు చేతులెత్తేశారు. మిస్టరీ లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్(337) స్పిన్ ధాటికి టాపార్డర్ కుప్పకూలగా.. సీనియర్ పేసర్ ఖలీల్ అహ్మద్(225) మిడిలార్డర్‌ను కూల్చాడు. దాంతో.. అమెరికా జట్టు 200లకే ఆలౌటయ్యింది.



మ్యాచ్ బహిష్కరణ నిర్ణయం మాదికాదు

పదో సీజన్ టీ20 ప్రపంచకప్‌లో భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌పై ఉత్కంఠ నెలకొంది. లీగ్ దశలో టీమిండియాతో ఆడబోమని పాక్ ప్రభుత్వం తేల్చిచెప్పడంతో ఫిబ్రవరి 15న దాయాదుల మ్యాచ్ సందేహమే అనిపిస్తోంది. ఇదే విషయంపై పాక్ కెప్టెన్ సల్మాన్ అఘాను విలేకరులు ప్రశ్నించగా అతడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. బాయ్‌కాట్ నిర్ణయం తమది కాదని, ప్రభుత్వం చెప్పినట్టు వినడం తప్ప ఏమీ చేయలేమని అతడు వెల్లడించాడు. భారత్‌లో వరల్డ్‌ప్ ఆడబోమని పంతం పట్టిన బంగ్లాదేశ్‌పై వేటు పడగా.. ఇప్పుడు పాకిస్థాన్ అదే తీరుగా వ్యవహరిస్తోంది. లీగ్ దశలో ఫిబ్రవరి 15న కొలంబోలో టీమిండియాతో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నామని ఆ దేశం స్పష్టం చేసింది. అయితే.. ఎంచుకొని మ్యాచ్‌లు ఆడడాన్ని సహించమని పీసీబీని ఐసీసీ హెచ్చరించింది. అయినా సరే పాక్ బోర్డు మాత్రం స్పందించలేదు. వరల్డ్‌కప్ కోసం సోమవారం పాక్ జట్టు శ్రీలంకకు బయల్దేరింది. జెర్సీ ఆవిష్కరణ అనంతరం కెప్టెన్ సల్మాన్ అఘా మీడియాతో మాట్లాడాడు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ ఇది మా నిర్ణయం కాదు..మేము ఏమీ చేయలేం అని బదులిచ్చాడు.

టి20 వరల్డ్ కప్... శ్రీలంక టీం రెడీ

టీ20 వరల్డ్‌కప్ కోసం ఆతిథ్య శ్రీలంక స్క్వాడ్‌ను ఎంపిక చేసింది. సీనియర్ ఆటగాడు ధనంజయ డిసిల్వాకు షాకిస్తూ కమిందు మెండిస్‌కు జై కొట్టారు సెలెక్టర్లు. దసున్ శనక సారథ్యంలో 15 మందితో కూడిన బృందాన్ని సోమవారం ప్రకటించారు. వీరిలో ఐపీఎల్ స్టార్లు పథిరన, థీక్షణ ఉన్నారు. అయితే.. పేసర్ ప్రమోద్ మధుషాన్‌కు చోటు దక్కలేదు. మాజీ ఛాంపియన్ శ్రీలంక రెండో టైటిల్ లక్ష్యంగా పటిష్టమైన స్క్వాడ్‌తో బరిలోకి దిగుతోంది. వలర్డ్‌కప్ సన్నాహక టోర్నీకి చరిత అసలంకను తప్పించి దసున్ శనకు పగ్గాలు అప్పగించిన సెలెక్టర్లు.. నిలకడగా నిలకడగా రాణిస్తున్న వాళ్లకే ప్రాధాన్యమిచ్చారు. బ్యాటింగ్ యూనిట్‌లో పథుమ్ నిశాంక, మిశార, మెండిస్ ద్వయం కీలకం కానున్నారు. ఆల్‌రౌండర్ కోటాలో హసరంగ, వెల్లలాగే చోటు దక్కించుకోగా.. ప్రత్యేక స్పిన్నర్‌గా థీక్షణ ఎంపికయ్యాడు. పేస్ దళానికి పథిరన నాయకత్వ వహించనుండగా.. ఇషాన్ మలింగ, చమీర అతడితో బంతిని పంచుకోనున్నారు. అయితే.. ఇంగ్లండ్తో మ్యాచ్‌లో ఎముక స్థానభ్రంశం చెందడంతో ఇషాన్ ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశముంది. శ్రీలంక టీ20 వరల్డ్‌కప్ స్క్వాడ్ : దసున్ శనక(కెప్టెన్), పథుమ్ నిశాంక, కమిల్ మిశార, కుశాల్ మెండిస్, కమిందు మెండిస్, కుశాల్ జెనిత్ పెరీరా, చరిత్ అసలంక, జనిత్ లియనగే, పవన్ రత్ననాయకే, వనిందు హసరంగ, దునిత్ వెల్లలాగే, మహీశ్ థీక్షణ, చమీర, పథిరన, ఇషాన్ మలింగ.

సినీ సంగీత సామ్రాజ్య మకుట రహిత 'చక్రవర్తి'

తెలుగు చలన చిత్ర రంగంలో విడదీయరాని బంధం అనుబంధం కలిగి ఉన్న బహుముఖ ప్రజ్ఞాశాలి సంగీత దర్శకులు చక్రవర్తి. 950కి పైగా చలన చిత్రాలకు సంగీతాన్ని అందించిన చక్రవర్తి తెలుగు చలన చిత్ర రంగములో ప్రముఖ స్వరకర్తగా, 1971 నుంచి 1989 వరకు రంగములో మకుటం లేని మహారాజుగా వెలిగారు. చక్రవర్తి గుంటూరు జిల్లా, తాడికొండ మండలం, పొన్నెకల్లులో 1936 సెప్టెంబరు 8వ తేదీన జన్మించిన చక్రవర్తి అసలు పేరు కొమ్మినేని అప్పారావు. అయన తల్లిదండ్రులు సంగీత జ్ఞాన సంపన్నులు. అలా ఆయనకు సంగీతంపై ఆసక్తికి నేపథ్యం ఉంది. కుమారుని ఉత్సాహంచూసి తండ్రి గుంటూరులో ఉన్న మహావాది వెంకటప్పయ్య శాస్త్రి దగ్గర సంగీతం నేర్పించారు. ఒక పక్క చదువు, మరో పక్క సంగీతాభ్యాసం నిరాటంకం గానే సాగాయి. అయన ఉత్సాహం దాచుకోలేక వినోద్ ఆర్కెస్ట్రా అనే బృందాన్ని ఏర్పాటు చేసి పాటలు, పద్యాలు పాడుతూ ప్రదర్శనలు ఇచ్చేవారు. విజయవాడ ఆల్ ఇండియా రేడియోలో 195458ల మధ్య కె.అప్పారావు కంఠం పాటలతో ప్రతిధ్వనించేది. నాటి శ్రోతలకి అతని కంఠం బాగా సుపరిచితమే. అప్పారావు మద్రాసు వచ్చి హెచ్.ఎమ్.వి. వారికి గ్రామఫోను పాటలు పాడటం ప్రారంభించారు. ఒక రికార్డింగులో సంగీత దర్శకులు రాజన్, నాగేంద్రలు అవకాశం ఇప్పించి పాడించారు. బి.విఠలాచార్య ఆపారావుతో తన సినిమా జయ విజయ (1959) లో ఆడాలి ... పెళ్ళాడాలి అనే పాటను పాడించారు. ఆ పాటను చిత్రంలో హాస్యనటుడు బాలకృష్ణ పాడతాడు. ఇదే అప్పారావు సినిమాలలో పాడిన మొదటి పాట. గాయకుడిగా కెరీర్ ప్రారంభించారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. డబ్బింగ్ ఆర్టిస్టుగానూ 500 చిత్రాలకు గాత్రం అందించాడు. నటుడిగా తేనెటీగ, రాజా తదితర చిత్రాల్లో కనిపించారు. డైలీ సీరియల్స్‌లోనూ ఉదాత్తమైన పాత్రలు పోషించారు. కొన్ని చిత్రాలకు పాటలూ రాశారు. ఫలోమా అనే మలయాళ చిత్రం హిందీ డబ్బింగుకి వచ్చింది, దానికి అప్పారావుని సంగీత దర్శకునిగా తీసుకున్నారు. టైటిల్స్‌లో అన్నీ హిందీ పేర్లే ఉన్నాయి, వాటి మధ్య అప్పారావు అనే తెలుగు పేరు ఎందుకని సినిమావారు అతనుకు చెప్పి "చక్రవర్తి"గా వేశారు. అలా చక్రవర్తి అయి పోయారు. ఆ కాలంలో అనువాద చిత్రాలు ఎక్కువగా ఉండేవి, అందులో అప్పారావుకి అవాకాశాలు వచ్చాయి. నాటకాలలో అనుభవం ఉండడం చేత ఆయన సంభాషణలను బాగా చెప్ప గలిగారు. ఇలా అప్పారావు పాటలు పాడడంతో పాటు అనువాద చిత్రాలలో పాత్రలకు గాత్రం అందించటం మొదలు పెట్టారు. కంఠం, చెప్పే విధానం బాగా ఉండడంతో హీరో పాత్రలకు గొంతు దానం చేసే స్థాయికి ఎదిగారు. అలా ఎం.జి. రామచంద్రన్, జయ శంకర్, జెమిని గణేశన్ లకు గాత్రం అందించారు. హాస్యనటులైన నగేష్, కులదైవం రాజగోపాల్ లకూ డబ్బింగ్ చెప్పారు. ముఖ్యంగా నగేష్‌కు బాగా డబ్బింగు చెప్పేవారు. అప్పారావు సినిమాలలో 200లకు పైగా పాటలు పాడాతు. కొన్ని

కలిసి పాడినవి ఐతే, కొన్ని యుగళ గీతాలు. పరమానందయ్య శిష్యుల కథ (1966)లో ఘంటసాలతో "పరమగురుడు చెప్పిన వాడు పెద్దమనిషి కాదురా" అనే పాటను పాడారు. బంగారు సంకెళ్ళు (1968)లో రాజబాబుకి "తొలగండెహే" అనే తాగుడు పాటని పాడారు. నిలువు దోపిడి (1968)లో ఎన్.టి.రామారావుకు ఒక పద్యం చదివినప్పుడు, నాగార్జున పద్యాలు, శ్లోకాలు చదివినప్పుడు అందరూ మెచ్చుకున్నారు. దర్శకుడు సి.ఎస్.రావు దగ్గర సహాయ దర్శకుడిగా చేరి నిలువు దోపిడి, మళ్ళీపెళ్ళి, కంచుకోట, పెత్తందార్లు సినిమాలకు పని చేశారు. అయితే తమకు ఇష్టమైన సంగీతాన్ని విడిచి పెట్టక పాటలూ పాడేవాడు. శారద చిత్రంతో సినీ రంగంలో స్థిరపడ్డారు. అక్కినేని నాగేశ్వరరావుతో ప్రేమాభిషేకం,ఎన్.టి.రామారావుతో కొండవీటి సింహం వంటి విజయ వంతమైన చిత్రాలకు సంగీత దర్శకులుగా వ్యవహరించి 850కు పైగా తెలుగు చిత్రాలకు సంగీతాన్ని అందిచారు. చక్రవర్తి కొన్ని చిత్రాలలో కూడా నటించారు. చివరి సారిగా నిన్నే ప్రేమిస్తా చిత్రంలో సౌందర్య నాన్నగారిగా నటించారు.

తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల సినిమాలన్నీ కలుపుకుంటే 959 చిత్రాలు. ఆయన 'ట్రాక్' రికార్డు గురించి చెప్పకోవాలంటే కన్నడ (60), తమిళం (4), మలయాళం (1) ఒకే ఏడాదిలో 69 చిత్రాలకు సంగీతాన్ని అందించిన పాటల చక్రవర్తి అయన. అప్పారావు సినిమాల్లో 200లకు పైగా పాటలు పాడారు. తెలుగులో సంగీత దర్శకుడిగా 'మూగప్రేమ'తో కెరీర్ ప్రారంభించిన చక్రవర్తి 1997లో 'పెళ్లామా మజాకా' వరకూ సుస్వరాలు అందిస్తూనే ఉన్నారు. అమ్మోరు చిత్రానికి చివరి సారిగా సంగీతాన్ని అందించిన చక్రవర్తి 2002 ఫిబ్రవరి 3న కన్ను మూశారు. ఆస్కార్ అవార్డు పొందిన ఏ.ఆర్. రెహమాన్ చక్రవర్తి శిష్యుడు కావడం విశేషం.

రామ కిష్టయ్య సంగన భట్ల , 9440595494

చాక్లెట్.. ఛార్మింగ్

సన్నీలియోన్ అంటేనే గ్లామర్ కి మరో బ్రాండ్ ఇమేజ్. వయసు పెరుగుతున్నా ఆమెలోని అందం, ఆకర్షణ ఏమాత్రం తగ్గలేదు. తాజాగా ఈ బ్యూటీ చాక్లెట్ బ్రౌన్ కలర్ డ్రెస్ లో మెరిసిపోతూ దిగిన ఫొటోలు ఇప్పుడు నెట్టింట హీట్ పుట్టిస్తున్నాయి. డీప్ వీ నెక్ డిజైన్ తో ఉన్న ఈ స్లీవ్ లెస్ గౌన్ లో సన్నీ తనదైన శైలిలో అందాల విందు చేసింది. ఆ డ్రెస్ లో ఆమె నిల్చున్న తీరు, ఆ బాడీ లాంగ్వేజ్ చూస్తుంటే ఒక పాలరాతి శిల్పంలా అనిపిస్తోంది. ఈ లుక్ లో సన్నీ హెయిర్ స్టైల్ చాలా స్పెషల్ గా ఉంది. తడి ఆరిన జుట్టులా ముందు వైపు వదిలేసి, వెనుక ముడి వేసుకున్న తీరు ఆమె ముఖానికి మరింత అందాన్ని తెచ్చింది. మెడలో సన్నని గొలుసు, చెవులకు చిన్న కమ్మలు ధరించి చాలా క్లాసీగా రెడీ అయ్యింది. పియానో ముందు నిల్చొని, సీరియస్ గా చూస్తూ ఆమె ఇచ్చిన ఫోజులు చూస్తుంటే కుర్రాళ్ళ గుండెల్లో రైళ్లు పరిగెత్తాల్సిందే. ఇక సన్నీలియోన్ కెరీర్ విషయానికి వస్తే, ఒకప్పుడు అడల్ట్ స్టార్ గా ప్రపంచానికి పరిచయమైన ఆమె, తర్వాత బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. 'జిస్మ్ 2' తో మొదలైన ఆమె ప్రయాణం, 'రాగిణి ఎంఎంఎస్ 2', 'ఏక్ పహేలీ లీలా' వంటి చిత్రాలతో విజయవంతంగా సాగింది. కేవలం హీరోయిన్ గానే కాకుండా, 'లైలా మై లైలా', 'బేబీ డాల్' వంటి ఐటమ్ సాంగ్స్ తో దేశవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. టాలీవుడ్ ప్రేక్షకులతో కూడా సన్నీకి మంచి అనుబంధం ఉంది. మంచు మనోజ్ సినిమా 'కరెంట్ తీగ' లో సన్నీ టీచర్ పాత్రలో మెరిసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత రాజశేఖర్ 'గరుడ వేగ' లో స్పెషల్ సాంగ్ చేసి మాస్ ఆడియెన్స్ ను ఉర్రూతలూగించింది. ఆమధ్య కాలంలో మంచు విష్ణు సరసన 'జిన్నా' సినిమాలో కూడా కీలక పాత్రలో నటించి మెప్పించింది. భాష ఏదైనా సరే తన గ్లామర్, డ్యాన్స్ తో ఆడియెన్స్ ను ఎంటర్ టైన్ చేయడంలో సన్నీ ఎప్పుడూ ముందుంటుంది. ప్రస్తుతం ఆమె పలు పాన్ ఇండియా ప్రాజెక్టులతో పాటు, సౌత్ లోనూ మరిన్ని మంచి అవకాశాల కోసం చూస్తోంది.



మహాశివరాత్రి కి 'నాగబంధం' టీజర్

విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వం వహించిన మోస్ట్ ఎవైటెడ్ మైథలాజికల్ యాక్షన్ డ్రామా 'నాగబంధం'. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్లు అద్భుతమైన రెస్పాన్ తో అంచనాలను పెంచాయి. ఈ చిత్రం టీజర్‌ను ఫిబ్రవరి 15, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా విడుదల చేయనున్నారు. ఆకట్టుకునే టీజర్ పోస్టర్‌లో ఒక పురాతన ఆలయంలోని రహస్య నిధి చుట్టూ రక్షణగా చుట్టుకుని ఉన్న ఒక మహా నాగుపాము కనిపిస్తుంది. ఇది సినిమాలోని ఆధ్యాత్మిక దైవిక రహస్యాన్ని సూచిస్తుంది. భారతదేశంలోని చారిత్రాత్మక విష్ణు దేవాలయాల నేపథ్యంలో సాగే ఈ కథాంశం ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వనుంది. నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటిస్తుండగా, జగపతి బాబు, జయ ప్రకాష్, మురళి శర్మ, బి.ఎస్. అవినాష్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సౌందర్ రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీ, ఆర్‌సి ప్రణవ్ ఎడిటింగ్, అశోక్ కుమార్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్న ఈ విజువల్ వండర్ ప్రేక్షకులను మెస్మరైజ్ చేయడానికి సిద్ధంగా ఉంది. కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్న 'నాగబంధం' చిత్రం తుది నిర్మాణ దశకు చేరుకుంది. ఈ వేసవిలో తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషలలో భారీ పాన్‌ఇండియా విడుదలకు సిద్ధమవుతోంది.

కొత్త వాళ్లతో 'మ్యాడ్ 3'

టాలీవుడ్‌లో యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌లుగా భారీ విజయాలను అందుకున్న 'మ్యాడ్', 'మ్యాడ్ 2' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్లుగా నిలిచిన విషయం తెలిసిందే. దర్శకుడు కళ్యాణ్ శంకర్ తెరకెక్కించిన ఈ రెండు చిత్రాలు యువతను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఫన్, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో సాగిన ఈ సిరీస్‌కు ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. నార్నె నవీన్, రామ్ నితిన్, సంగీత్ శోభన్ హీరోలుగా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీకి కొనసాగింపుగా 'మ్యాడ్ 3'ను తెరపైకి తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించిన నిర్మాతలు, ఈసారి కొత్త కాన్సెప్ట్‌తో పాటు కొత్త కాస్టింగ్‌ను కూడా పరిచయం చేయాలని భావిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. గత చిత్రాల్లో కనిపించిన హీరోల స్థానంలో ఈసారి కొత్త యువ నటులను తీసుకొస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త కాస్టింగ్‌లో భాగంగా 'లిటిల్ హార్ట్స్' ఫేమ్ జేయ్ కృష్ణ, 'కోర్ట్' ఫేమ్ హర్ష్ రోషన్ పేర్లు వినిపిస్తున్నాయి. యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ ఫ్రెష్ ఫేస్‌లతో ఈ చిత్రాన్ని రూపొందించాలన్న ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో సినిమాకు 'మ్యాడ్ జూనియర్స్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఫిల్మ్‌నగర్‌లో ప్రచారం జరుగుతోంది. టైటిల్ ద్వారా కూడా ఈ చిత్రం కొత్త తరం యువత కథగా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైనట్లు సమాచారం. త్వరలోనే ఫస్ట్ లుక్, టీజర్ వంటి అప్డేట్స్ విడుదల చేసే అవకాశముంది. గత రెండు భాగాల మాదిరిగానే యూత్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ హాస్యం, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ లైఫ్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం రూపొందనుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వరుస విజయాలతో దూసుకెళ్తున్న ఈ బ్యానర్ నుంచి వస్తున్న మరో యూత్ ఎంటర్‌టైనర్ కావడంతో 'మ్యాడ్ 3' పై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. కొత్త కాస్టింగ్, కొత్త టైటిల్‌తో ఈ సినిమా ప్రేక్షకుల్లో ఎంత మేరకు క్రేజ్ సొంతం చేసుకుంటుందో చూడాలి.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200